అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ


గురువారం 28-12-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 357 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



ఉపరాష్ట్రపతి జగ్‌దీప్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



గడీల పాలనను గ్రామాలకు తెచ్చాం

పకడ్బందీగా ఆరు గ్యారంటీల అమలు

"మాది ప్రజా ప్రభుత్వం..ప్రజల చేత ప్రజల కోసం ఎన్నుకోబడ్డ ప్రభుత్వం.. గడీల నుంచి పాలనను గ్రామాలకు తెచ్చాం..ఎన్నికల ముందు తెలంగాణ సమాజానికి ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టాం..డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు గ్రామాలు, పట్టణాల్లో సభలు నిర్వహించి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తాం... ప్రజలకు మంచి పాలన అందించడమే మా లక్ష్యం" అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీల లోగో, పోస్టర్, దరఖాస్తు ఫారాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖతో కలిసి సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందని తెలిపారు. ఈ నెల 8న రెండు గ్యారంటీల అమలును చేపట్టగా, మిగతా గ్యారంటీల ప్రక్రియకు బుధవారం నుంచి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు.

- నేటి నుంచి జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- అన్ని గ్రామాలు, పట్టణాల్లో సభలు
- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- టీఎస్‌పీఎస్సీకి త్వరలో చైర్మెన్ నియామకం
- డిసెంబర్ 2024 వరకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ
- మేడిగడ్డపై న్యాయ విచారణ
- కేటీఆర్ దోచుకున్న లక్ష కోట్లు కక్కిస్తాం : అభయ హస్తం లోగో, పోస్టర్, ధరఖాస్తు ఫారం ఆవిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 3లో

మన పద్దులో వాస్తవికత ఉండాలి

- ఉన్నది ఉన్నట్టుగా ప్రజల ముందుంచుదాం..
- అదే అసలైన బడ్జెట్
- కేంద్ర నిధులను నూటికి నూరు పాళ్లూ వాడుకోవాలి
- ప్రజలకు జవాబుదారీగా వార్షిక బడ్జెట్ : సీఎం రేవంత్

వివరాలు 3లో

ప్రజాపాలనకు నోడల్ అధికారులు

కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాల వారిగా నోడల్ అధికారులను నియమించింది. ఈ మేరకు ...13లో



భారత్ న్యాయ యాత్ర

14 రాష్ట్రాలు, 85 జిల్లాలు, 6,200 కిలో మీటర్లు

- మణిపూర్ టూ ముంబయి
- జనవరి 14 నుంచి మార్చి 20 వరకు రాహుల్ పాదయాత్ర

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి యాత్ర చేపట్టనున్నారు. ఈసారి 'భారత్ న్యాయ యాత్ర' పేరిట ఈశాన్య రాష్ట్రం మణిపూర్ నుంచి ప్రారంభించి పశ్చిమ తీరం వరకూ యాత్ర సాగనుంది. జనవరి 14న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జెండా ఊపి ఈ యాత్రను ప్రారంభించనున్నారు. మార్చి 20న ముంబయిలో ముగియనుంది. 14 రాష్ట్రాల్లో 85 జిల్లాల మీదుగా 6,200 కిలో మీటర్లు సాగనున్న ఈ యాత్రను రాహుల్ గాంధీ వినూత్న తరహాలో నిర్వహించనున్నారు. బస్ ద్వారా, అక్కడక్కడా కాలినడకన రాహుల్ భారత్ న్యాయ యాత్ర సాగనుంది. ఇది రాజకీయ యాత్ర కాదని, రాజకీయ ప్రయోజనాలు ఆశించడం లేదని ఏఐసీసీ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జ్ జనరల్ ...3లో

రెజ్లర్లతో రాహుల్

- బజరంగ్ పూనియాతో సహా పలువురితో సంభాషణ
- హర్యానాలో కాంగ్రెస్ అగ్రనేత పర్యటన

వివరాలు 6లో

డీప్‌ఫేక్ పాలిట్రిక్స్

'ఏఐ'తో టెక్నాలజీ మాయాజాలం

- లేనిది ఉన్నట్టుగా వీడియోలు, ఆడియోలు తయారు
- ప్రత్యర్థులపై అడ్డదారుల్లో దుష్ప్రచారాలు
- ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే ఎత్తుగడలు
- ఇందుకోసం ఎంత ఖర్చుకైనా వెనకాడని నేతలు
- డిజిటల్, టెక్ సంస్థలకు రూ. లక్షల్లో చెల్లింపులు
- 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారాలపై ఆంగ్ల వార్త సంస్థ దర్యాప్తులో బహిర్గతం



ప్రముఖ సాంకేతిక నిపుణులు, దిగ్గజ టెక్ సంస్థల అధినేతలు చెప్పినట్టుగానే కృత్రిమ మేధ (ఏఐ) ప్రమాదకరంగా మారుతున్నది. 'డీప్‌ఫేక్'తో నకిలీ వీడియోలు, ఆడియోలు తయారు చేస్తున్న తీరు ఈ మధ్యకాలంలో అధికమైంది. అది క్రమంగా రాజకీయ రంగానికీ పాకింది. భారత్‌లో 2024 లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు ముందు డీప్‌ఫేక్ టెక్నాలజీని కృత్రిమంగా ఉపయోగించటం ద్వారా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయటానికి డిజిటల్ మానిప్యులేటర్లు రహస్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఒక జాతీయ ఆంగ్ల వార్త సంస్థ దర్యాప్తులో ఇది బహిర్గతమైంది.



న్యూఢిల్లీ : ప్రపంచంలో సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్నది. పరిశోధకులు, టెక్ సంస్థల అనేక నూతన ఆవిష్కరణలు మనిషికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అయితే, సదరు టెక్నాలజీ మనిషి పురోగతికి ఉపయోగపడాలి. కానీ, టెక్నాలజీని చెడు దారిలో ఉపయోగిస్తుండటంతో దాని ప్రతికూల ప్రభావం తిరిగి సమాజం పైనే పడుతున్నది. ఏఐతో రూపొందిస్తున్న డీప్‌ఫేక్ కంటెంట్ దీనికి ఉదాహరణ అని టెక్ నిపుణులు తెలుపుతున్నారు. భారత్‌లో వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు డీప్‌ఫేక్ వినియోగం అధికమైందని చెప్తున్నారు.

ఆంగ్ల వార్త సంస్థ దర్యాప్తు ప్రకారం.. నోయిడాలోని ది డిజిటల్ పబ్లిసిటీ వ్యవస్థాపకుడు రోహిత్ పాల్‌తో విచారణ ప్రారంభమైంది. ఆయన 2024 ఎన్నికలకు బరిలో ఉండగలికే అభ్యర్థులను గుర్తించటం, వారి ప్రచారాలను వ్యూహాత్మకంగా ప్లాన్ చేయడం వంటి తన కార్యకలాపాలను వివరించాడు. ప్రత్యర్థులను కించపరిచేలా డీప్‌ఫేక్ వీడియోలను రూపొందించటంపై పాల్ ప్రాథమిక దృష్టి ఉన్నది. "మేము ఆన్‌లైన్ చిత్రాలను మెరుగుపర్చి వాటిని సానుకూల చిత్రాలుగా రూపొందిస్తాం. యానిమేటెడ్ వీడియోలను తయారు చేస్తాం. ఇతర పార్టీల అభ్యర్థుల తప్పులను ప్రదర్శిస్తాం. వారిని మూర్ఖులుగా చూపుతాం" అని ఆయన అన్నారు. ఈ ఏఐ రూపొందించిన వీడియోల గుర్తింపు గురించి అడిగినప్పుడు.. "వ్యక్తులు కంటెంట్‌ను నకిలీ అని గుర్తించడం సవాలుతో కూడుకున్నది. సగటు వ్యక్తి దానిని గుర్తించలేరు. ఇది పూర్తిగా ప్రామాణికమైనదిగా కనిపిస్తుంది" అని తెలిపారు. డీప్‌ఫేక్ మెటీరియల్‌ని రూపొందించడానికి ఎంత సమయం ...3లో



బీఆర్ఎస్ తాత్సారం చేయలే.. కేంద్రానిదే వివక్ష

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విభజన హామీల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్కడా తాత్సారం చేయలేదనీ, కేంద్ర ప్రభుత్వమే తెలంగాణపై వివక్ష చూపిందని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోడీని కేసీఆర్ ...13లో

కరెంట్ బిల్లులు కట్టొద్దు

కాంగ్రెస్ హామీలను సద్వినియోగం చేసుకోవాలి

- నిరుద్యోగభృతి ఊసేదీ..? : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ-సిరికొండ

కాంగ్రెస్ పార్టీ 200 యూనిట్లు ఉచిత కరెంటు ఇస్తామని హామీనిచ్చిన నేపథ్యంలో వచ్చే జనవరి నెల నుంచి ప్రజలెవరూ కరెంట్ బిల్లు చెల్లించొద్దని, హామీలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోని ది లివింగ్ క్రైస్ట్ చర్చ్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా చూసిందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీకి రెండు శాతం ఓట్లు మాత్రమే తేడా ఉందని తెలిపారు. గత ప్రభుత్వంలో రూ.2వేలు పెన్షన్ తీసుకున్న 44 లక్షల మందికి ఎలాంటి అప్లికేషన్ తీసుకోకుండా, వచ్చే జనవరి నుంచి రూ.4వేలు ఇవ్వాలని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రభుత్వం కొత్తగా అప్లికేషన్ తీసుకోవడంతో ఎంతో మందికి ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఆరు గ్యారంటీల అప్లికేషన్‌లో నిరుద్యోగ భృతి కాలమ్ ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుబంధు అర్హులైన రైతులకు వారి ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయాలని కోరారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఊసే లేదని, వారికి వెంటనే రూ.4000 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు మాన్‌సింగ్, సుమనారెడ్డి, ఎంపీపీ సంగీత రాజేందర్, మాజీ జెడ్పీటీసీ అయిత సుజ ఫిలిప్, మాజీ ఎంపీపీ మంజుల, మండల అధ్యక్షులు శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఇక భారత్ బియ్యం

కిలో పాతిక రూపాయలకు విక్రయం

- బియ్యం ధరలు నియంత్రించలేక ఎన్నికల వేళ మోడీ ప్రభుత్వం జిమ్మిక్కులు
- మూన్నాళ్ల ముచ్చటేనంటున్న పరిశీలకులు



ఆలులేదు..చూలు లేదు..కొడుకు పేరు సోమలింగం అన్నతీరులో వ్యవహరిస్తోంది కేంద్రంలోని బీజేపీ . భారత్ ఆటా, పప్పులను తక్కువ ధరకే ప్రజలకు విక్రయిస్తున్నామంటూ కొంతకాలంగా ప్రచారం చేసుకుంటోంది. కానీ.... వాస్తవానికి మార్కెట్‌లో భూతద్దం పెట్టి వెతికినా..అవి ఎక్కడా కనిపించవు. పోనీ ఎక్కడ అమ్ముతారు...? రాష్ట్రాలకు ఎంతమేర సరకులను పంపిందో కూడా తెలియదు. ఇదిలా ఉండగానే తాజాగా భారత్ బియ్యం అంటూ బీజేపీ ప్రభుత్వం మరో కొత్త ఎత్తుగడను తెరపైకి తెచ్చింది. కిలో రూ. 60 పెడితే కానీ బియ్యం దొరకని కాలంలో... భారత్ బియ్యాన్ని కిలో..రూ.25 కే విక్రయిస్తామంటోంది. ఇది ఎన్నికల వేళ భారత్ సెంటిమెంట్‌తో సార్వత్రికంలో ఓట్లు రాల్చుకోవడానికి మోడీ ప్రభుత్వం వేస్తున్న సరికొత్త పాచిక అని విశ్లేషకులు అంటున్నారు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మరో ప్రచారాస్త్రాన్ని సంధించింది. ఇప్పటికే గోధుమ పిండిని భారత్ అట్టా, పప్పులను భారత్ దాల్ పేరుతో విక్రయిస్తున్న ప్రభుత్వం తాజాగా తగ్గింపు ధరతో భారత్ బియ్యాన్ని అమ్మేందుకు సన్నాహాలు చేస్తోంది. భారత జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్), భారత జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య లిమిటెడ్ (ఎన్‌సీసీఎఫ్), కేంద్రీయ భాండార్ ఔట్‌లెట్లు, మొబైల్ వాహనాల ద్వారా కిలో బియ్యాన్ని ఇరవై ఐదు రూపాయలకు విక్రయిస్తారని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు తెలిపారు.

ఇప్పటికే దేశంలో 50-60 రూపాయలు పెట్టందే కిలో బియ్యం రావడం లేదు. బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయే తప్ప తగ్గుతున్నది లేదు. దేశంలోని పలు రాష్ట్రాలలో ధాన్యం దిగుబడులు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ బియ్యం ధరలు మాత్రం దిగిరావడం లేదు. పోనీ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అవుతున్న బియ్యాన్ని వండుకుందామని అనుకుంటే అది నాసిరకంగా ఉంటోంది. ఒక్కోసారి తినడానికి కూడా పనికిరావడం లేదని పేదలు వాపోతున్నారు. మరోవైపు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నాసిరకం బియ్యం తప్పించి మరేదీ సరఫరా కావడం లేదు. గతంలో బియ్యంతో పాటు పప్పులు, చక్కెర, నూనె వంటి నిత్యావసరాలు కూడా సరఫరా చేసే వారు. అయితే కాలక్రమేణా బియ్యం మినహా ...13లో

సింగరేణిలో ఏఐటీయూసీ విజయం

- ఆద్యంతం ఉత్కంఠ

నవతెలంగాణ-కొత్తగూడెం/ సింగరేణి ప్రతినిధి/ నస్పూర్, మందమర్రి

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించింది. ఐఎన్‌టీయూసీ ఆరు ఏరియాల్లో గెలిచినా, అత్యధిక ఓట్లు ఏఐటీయూసీకి రావడంతో గుర్తింపు సంఘంగా ఎన్నికైంది. చివరి రౌండ్ వరకు రెండు సంఘాల మధ్య హోరాహోరీ పోరు కొనసాగింది. ఎట్టకేలకు ఐదు ఏరియాల్లో గెలిచినా,

ఎంఫిల్‌లో చేరొద్దు

- ఆ డిగ్రీలకు గుర్తింపులేదు: యూజీసీ



న్యూఢిల్లీ : ఎంఫిల్ డిగ్రీకి గుర్తింపులేదని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) బుధవారం పేర్కొంది. విద్యార్థులు ఈ డిగ్రీలో అడ్మిషన్‌లు తీసుకోవద్దని సూచించింది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఫిల్ అడ్మిషన్‌లు నిలిపివేయాలని అన్ని యూనివర్సిటీలను యూజీసీ సెక్రెటరీ మనీష్ జోషి ఆదేశించారు. ఎంఫిల్ అడ్మిషన్ కోసం పలు యూనివర్సిటీలు దరఖాస్తులు ...13లో

కాంగ్రెస్‌లోకి షర్మిల..

ఎన్నికలపై ఏపీ నేతలతో అధిష్టానం చర్చలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్‌లో చేరేందుకు మార్గం సుగుమం అయినట్లు తెలుస్తోంది. అందుకు కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఏపీ కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్, పీసీసీ అధ్యక్షుడు గిడిగు రుద్రరాజు, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరా రెడ్డి, మాజీ మంత్రి పళ్ళం రాజు, నేతలు చింతా మోహన్, కొప్పుల రాజు, హర్ష కుమార్, తులసి రెడ్డి, సుంకర పద్మ శ్రీ, మస్తాన్ వలి, మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన సమావేశంలో ఏపీ అసెంబ్లీ, ...13లో


ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్ పరీక్షలు!

మార్చి 18 వరకు నిర్వహణ

- అదేనెల 14 నుంచి టెన్త్ పరీక్షలు? : విద్యాశాఖ ప్రతిపాదన
- నేడో, రేపో షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వార్షిక పరీక్షలు-2024, ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు మార్చి 18 వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇంటర్ బోర్డు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్టు తెలిసింది. ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా, పరీక్షల నియంత్రణాధికారి జయప్రదబాయి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. గురు లేదా శుక్రవారం విద్యాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించే అవకాశమున్నది. అందులోనే ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్‌పై తుది నిర్ణయం తీసుకుని ప్రకటిస్తారని తెలుస్తున్నది. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 16 వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, ఫిబ్రవరి 29 నుంచి మార్చి 18 వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలను నిర్వహించాలని



అధికారులు షెడ్యూల్‌ను రూపొందించారు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 13 వరకు ఇంటర్ ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు జరుగుతాయని ...13లో

గ్రూప్-2 మరోసారి వాయిదా

- త్వరలో రాతపరీక్షల తేదీల ప్రకటన : టీఎస్‌పీఎస్సీ వెల్లడి

వివరాలు 13లో

ఫిబ్రవరి రెండోవారంలో ఎంసెట్ నోటిఫికేషన్!

- ప్రవేశ పరీక్షలపై విద్యాశాఖ కసరత్తు : ఉన్నత విద్యామండలి అధికారులతో సమావేశం

వివరాలు 13లో

నారగోని రాములు మరణం..

- సమాజానికి తీరని లోటు : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా, ఉప పర్యవేక్షణ అధికారిగా పనిచేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల మన్ననలు పొందిన నారగోని రాములు హఠాత్తుగా మరణించడం ఉపాధ్యాయ ఉద్యమానికి, సమాజానికి తీరని లోటు అని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అన్నారు. రాములు మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. గురువారం హైదరాబాద్‌లోని జామా ఉస్మానియాలోని రాములు స్వగృహం యందు ఆయన భౌతికకాయానికి టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్యతో కలిసి ఎమ్మెల్సీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లాలో ఉద్యమ విస్తరణకు కృషి చేసిన రాములు మరణం సంఘానికి తీరని లోటని, వారి మరణం పట్ల టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సంతాపాన్ని ప్రకటిస్తుందని తెలియచేశారు. రాములుకి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో యూటీఎఫ్ మాజీ నాయకులు మోతుకూరి నరహరి, రమణయ్య శాస్త్రి, మస్తాన్ రావు, దేవదాస్, వరప్రసాద్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సింహాచలం, జిల్లా అధ్యక్షులు రాజారావు, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్, జిల్లా కార్యదర్శి విశాలి, నల్లగొండ జిల్లా సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి తదితరులున్నారు.

మంత్రి పొంగులేటికి టీజీజేఎల్ఏ శుభాకాంక్షలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టీజీజేఎల్ఏ-475) అధ్యక్షులు వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ నేతృత్వంలో బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి గురించి ప్రత్యేకంగా చర్చిద్దామంటూ మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీజేఎల్ఏ వర్కింగ్ ప్రెసిడెంట్ కెపి శోభన్‌బాబు, ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్, మహిళా కార్యదర్శి సంగీత, విశాలాక్ష్మి, నాయకులు కె శ్రీకాంత్, కృష్ణార్జునరావు, బుర్ర విజయమోహన్, గణపతి, హరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వికాస్ భారత్ సంకల్ప్ యాత్రలో గవర్నర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికాస్ భారత్ సంకల్ప్ యాత్రలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ పాల్గొన్నారు. బుధవారం సికింద్రాబాద్, లాలాగూడలోని మున్సిపల్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాని మోడీ వర్చువల్ పద్ధతిలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం లబ్దిదారులు వికాస్ భారత్ తమ జీవితాల్లో తెచ్చిన మార్పుకు సంబంధించిన అనుభవాలను వివరించారు.

రాచకొండలో 6 శాతం పెరిగిన నేరాలు

25 శాతం పెరిగిన సైబర్ నేరాలు

- భూ కబ్జాదారులు, లోన్‌యాప్ ముఠాలపై ప్రత్యేక నిఘా
- మహిళల భద్రతకు పెద్దపీట
- వార్షిక నేర నివేదిక విడుదల చేసిన సీపీ సుధీర్‌బాబు



నవతెలంగాణ-హయత్ నగర్/ సిటీ బ్యూరో

రాచకొండ కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోలిస్తే ఈ సారి 6.86 శాతం నేరాలు పెరిగాయని సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. భూకబ్జాదారులపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. లోన్‌యాప్ ముఠాల ఆగడాలను అరికడతామని, మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామని చెప్పారు. సైబర్ నేరాలు 25 శాతం పెరిగాయని, మహిళలపై నేరాలు 6.65 శాతం తగ్గాయన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వార్షిక నేర నివేదికను హైదరాబాద్ నాగోల్‌లో జరిగిన దేవకి కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో సీపీ సుధీర్ బాబు విడుదల చేసి వివరించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో గతేడాది 30,148 కేసులు నమోదు కాగా 2023 కేసులను ఛేదించారు. ఈ ఏడాది 36,126 కేసులు నమోదు కాగా 27,210 కేసులను ఛేదించారు. ఇక 2,562 సైబర్ కేసులు నమోదయ్యాయి. మానవ అక్రమ రవాణాకు సంబంధించి 58 కేసుల్లో 163 మంది అరెస్టు చేశారు. ఈ ఏడాది మొత్తంగా 5,241 కేసుల్లో శిక్షలు ఖరారయ్యాయి. రోడ్డు ప్రమాదాలు పెరిగాయి.

నేరాల నివారణకు కమిషనరేట్ పరిధిలో కమ్యూనిటీ కెమెరాలు 14,710 ఉండగా, నేను సైతం కెమెరాలు 1,72,633 ఉన్నాయి. కమిషనరేట్ పరిధిలోని నేరాలకు సంబంధించి మొత్తం రూ.12.77 కోట్లు రికవరీ చేశారు. గతేడాదితో పోలిస్తే 2 శాతం రికవరీ రేట్ పెరిగింది. గేమింగ్ యాక్ట్‌పై 188 కేసులు నమోదు కాగా 972 మంది అరెస్టయ్యారు. 20 కేసుల్లో నిందితులకు జీవితఖైదు పడింది. అలాగే 2,900 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దయ్యాయి. గతేడాదితో పోలిస్తే 16 శాతం రోడ్డు ప్రమాద మరణాలు పెరిగాయి. ప్రమాదాల్లో 633 మంది మృతి చెందగా 3,205 మందికి గాయాలయ్యాయి. మానవ అక్రమ రవాణాకు సంబంధించి 56 కేసుల్లో 153 మంది అరెస్టయ్యారు. 71 మంది బాధితులకు విముక్తి కలిగించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పోలీసులకు పట్టుబడిన 271మంది జైలుకు వెళ్లారు. డ్రగ్స్‌కు సంబంధించి 282 కేసులు నమోదు కాగా 698 మందిని అరెస్ట్ చేశారు. 12మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. పేకాట, బెట్టింగ్‌లలో 188 కేసులు నమోదు కాగా 972 మందిని అరెస్ట్ చేశారు. ఆరుగురిపై పీడీ యాక్ట్ నమోదైంది. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన 8,758 ఫిర్యాదుల్లో 4,643 పరిష్కారమయ్యాయి.

పెరిగిన కిడ్నాప్‌లు, హత్యలు

రాచకొండ కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోల్చితే మహిళలపై నేరాలు 6.65 శాతం తగ్గినప్పటికీ కిడ్నాప్‌లు, వరకట్నం వేధింపులు, హత్యలు పెరిగాయి. గతేడాది వరకట్నం హత్యలకు సంబంధించి 5 కేసులు నమోదుకాగా, ఈ ఏడాది 6 కేసులు నమోదయ్యాయి. 2022లో నలుగురు మహిళలు హత్యకు గురికాగా, ఈ ఏడాది 12 మంది హత్యకు గురయ్యారు. గతేడాది 110 మంది మహిళలు కిడ్నాప్‌కు గురికాగా, ఈ ఏడాది 116 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. మహిళలపట్ల అసభ్యకరంగా వ్యవహరించిన కేసులు 673 కేసులు నమోదకాగా, ఈ ఏడాది 744కేసులు నమోదయ్యాయి. ఇక గత ఏడాది పోక్సో కేసులు 442 నమోదు కాగా ఈ ఏడాది 317 కేసులు నమోదయ్యాయి. ఈ సమావేశంలో అదనపు సీపీలు, నాలుగు జోన్ల డీసీపీలు, ఇద్దరు ఎస్ఓటీ డీసీపీలు, సైబర్ డీసీపీ, ఇద్దరు ట్రాఫిక్ డీసీపీలు, షీ టీం డీసీపీలతోపాటు ఏసీపీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బి నగర్‌లోని పీఎన్‌బీ శాఖ తరలింపు



హైదరాబాద్ : ఎల్‌బినగర్‌లోని ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను కొత్త ప్రాంతంలోకి మార్చారు. శివ గంగా కాలనీలోని శాఖను కొత్తగా మన్సూరాబాద్ మెయిన్ రోడ్‌లో ఏర్పాటు చేసింది. ఈ నూతన శాఖను బుధవారం పిఎన్‌బి హైదరాబాద్ జోనల్ హెడ్ దీపక్ కుమార్ శ్రీవాస్తవా లాంచనంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో సర్కిల్ హెడ్ ఎన్‌విఎస్‌పి రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ జివి వెంకన్న, ఇతర సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అ సందర్భంగా రూ.4 కోట్ల విలువ చేసే వివిధ రుణాలను శ్రీవాస్తవా గ్రహీతలకు అందజేశారు.

కొటాక్ మహీంద్రా బ్యాంక్ ఛైర్మన్‌గా సిఎస్ రాజన్



హైదరాబాద్ : కొటాక్ మహీంద్రా బ్యాంక్ నూతన పార్ట్ టైం ఛైర్మన్‌గా సిఎస్ రాజన్ నియామకానికి ఆర్‌బీఐ ఆమోదం తెలిపింది. ఆయన నియామకం 2024 జనవరి 1 నుంచి రెండేళ్ల పాటు అమల్లో ఉంటుంది. 1978 ఐఏఎస్ ఆఫీసర్ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం ఆ బ్యాంక్‌కు ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి

- డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్
- 17 ఎంపీ స్థానాలకు కొత్త ఇంఛార్జులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు బీఎస్పీ శ్రేణులు సిద్ధం కావాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 17 పార్లమెంట్ స్థానాలకు బుధవారం కొత్త పార్లమెంట్ ఇంచార్జీలను నియమించినట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

పార్లమెంట్ ఇంచార్జులు వీరే....

1.ఆదిలాబాద్ (ఎస్టీ) - సిడం గణపతి
2.పెద్దపల్లి (ఎస్సీ) - కాదాసి రవీందర్
3.కరీంనగర్ - దాసరి ఉష
4.నిజామాబాద్ - గైని గంగాధర్
5.మెదక్ - లింగంపల్లి యాదగిరి
6.జహీరాబాద్ - జంగం గోపి
7.మల్కాజిగిరి - గుండెల ధర్మేందర్
8.సికింద్రాబాద్ - పిట్ల బాల్‌రాజ్
9.హైదరాబాద్ - చాట్ల చిరంజీవి
10.చేవెళ్ల - బర్క కృష్ణ యాదవ్
11.మహబూబ్ నగర్ - బసిరెడ్డి సంతోష్ రెడ్డి
12.నాగర్‌కర్నూల్ (ఎస్సీ) - ఎం.సి.కేశవరావు
13.నల్గొండ - బొడిగె మల్లేష్ యాదవ్
14.భువనగిరి - కొండమడుగు రాజు
15.వరంగల్ (ఎస్సీ) - మంద శ్యామ్
16.మహబూబాబాద్ (ఎస్టీ) - డా.వెంకటేష్ చౌహాన్
17.ఖమ్మం- ఎం.పుల్లయ్య

ఐపీఎస్ నవీన్ కుమార్‌ను ప్రశ్నించిన సీసీఎస్ అధికారులు

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఇంటిని కబ్జా చేశాడని ఆరోపణలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రిటైర్డ్ సీనియర్ ఐఏఎస్ అధికారి భన్వర్‌లాల్ ఇంటిని కబ్జా చేశాడనే ఆరోపణపై రాష్ట్ర పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ నవీన్ కుమార్‌ను నగర నేర పరిశోధక విభాగం (సీసీఎస్) అధికారులు బుధవారం పిలిచి ప్రశ్నించారు. సీసీఎస్ డీసీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. రాష్ట్ర మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్, రిటైర్డ్ సీనియర్ ఐఏఎస్ అధికారి భన్వర్‌లాల్ ప్రశాసన్ నగర్‌లో నిర్మించుకున్న ఇంట్లో నవీన్ కుమార్ సోదరుడు సాంబశివరావు అద్దెకు ఉండేవాడు. దాదాపు రెండేండ్ల క్రితం అద్దెకు తీసుకున్న ఈ నివాసంలో తర్వాత నవీన్ కుమార్ కూడా చేరారు. అయితే, ఈ ఇల్లు తనకు అవసరం ఉన్నదనీ, వెంటనే ఖాళీ చేయాలని భన్వర్‌లాల్ నవీన్‌కుమార్‌ను కోరారు. అందుకు నిరాకరించిన నవీన్‌కుమార్ సోదరులు అద్దెను కూడా చెల్లించలేదనీ, పైగా ఆ ఇంటిని కబ్జా చేసుకోవటానికి నకిలీ పత్రాలను సృష్టించారని భన్వర్‌లాల్ ఆరోపిస్తూ నగర సీసీఎస్ పోలీసులకు నవంబర్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సీసీఎస్ పోలీసులు కేసును నమోదు చేసి ఇటీవలనే నవీన్‌కుమార్ సోదరుడిని అరెస్టు చేశారు. తాజాగా సీఆర్పీసీలోని 41 సెక్షన్ కింద నవీన్‌కుమార్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం సీసీఎస్ పోలీసుల ఎదుట నవీన్ కుమార్ హాజరుకాగా డీసీపీ శ్వేత పర్యవేక్షణలో సీసీఎస్ అధికారులు ఆయనను ప్రశ్నించారు. అనంతరం సాయంత్రం నవీన్‌కుమార్ ఇంటికి వెళ్లిపోయారు. కాగా, ఈ కేసులో నవీన్ కుమార్‌ను విచారించామనీ, ఇంకా ఈ విచారణ కొనసాగుతుందనీ, విచారణ ముగిశాక తేలే అంశాలను బట్టి నవీన్‌కుమార్‌పై చర్యలుంటాయని డీసీపీ శ్వేత తెలిపారు.

ప్రజాపాలనను పారదర్శకంగా అమలు చేయాలి

- సాంఘిక సంక్షేమశాఖకు తక్షణమే మంత్రిని నియమించాలి : కేవీపీఎస్ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరు గ్యారంటీల అమలుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి జనవరి 6వరకు చేపట్టే ప్రజాపాలనను పారదర్శకంగా నిర్వహించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్రస్థాయి సమావేశం జాన్ వెస్లీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో అమరులైన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జాన్ వెస్లీ, స్కైలాబ్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం దళిత బంధు, మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వంటి వాగ్దానాలు అమలు చేయలేకపోయిందని విమర్శించారు. వాటిని తిరిగి కొనసాగించి పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 54 లక్షల దళిత జనాభా ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలు అమలుకు వారిలో నూటికి 70 శాతం మంది నిజమైన అర్హులని చెప్పారు. దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలించి, అర్హులను గుర్తించి లబ్దిదారులను ఎంపిక చేయాలని చెప్పారు. ప్రజాపాలన దరఖాస్తులను అధికారులు నిశితంగా పరిశీలించి అవసరమైతే దళిత వాడల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఎస్సీల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. గతంలో కరోనా తదితర కారణాలతో దాదాపు ఒక లక్ష రేషన్ కార్డులు రద్దయ్యాయని తెలిపారు. వాటిని తిరిగి పునరుద్దరించాలని విజ్ఞప్తి చేశారు. దళిత బంధుకు బడ్జెట్ కేటాయించి గ్రౌండింగ్ చేయాలన్నారు. 300 యూనిట్ల వరకు దళితులకు ఉచిత కరెంట్ ఇవ్వాలని కోరారు. సాంఘీక సంక్షేమ శాఖకు మంత్రిని నియమించకుండా ఆలస్యం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. తక్షణమే నియమించాలని విజ్ఞప్తి చేశారు. జనవరి 3న సావిత్రిభాయి పూలే జయంతి సభలు, సెమినార్లు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్లు నిర్వహిస్తామని చెప్పారు.



గడీల పాలనను గ్రామాలకు తెచ్చాం

మాది ప్రజా ప్రభుత్వం

- పకడ్బందీగా ఆరు గ్యారంటీల అమలు చేసి తీరుతాం
- అభయ హస్తం లోగో, పోస్టర్, ధరఖాస్తు ఫారం ఆవిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ "నిస్సహాయులకు సహాయం అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం... సుదూర ప్రాంతాల నుంచి ప్రజాభవన్‌కు వచ్చి ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు ఇస్తున్నారు.. గత పదేళ్లలో ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో లేదు... అందుకు ప్రజావాణిలో వచ్చిన 24 వేల ఫిర్యాదులే ఉదాహరణ.. గత సర్కార్ హయంలో ప్రజలు తమ సమస్యలపై ప్రభుత్వం దగ్గరకు వస్తే గడీలు అడ్డుగోడలుగా ఉండేవి... కానీ ఇప్పుడు ప్రభుత్వమే ప్రజల వద్దకు నడిచి వెళ్తోంది...ప్రతి మండలాన్ని రెండు గ్రూపులుగా విభజించి ఒక గ్రూపునకు ఎంఆర్వో, మరో గ్రూపునకు ఎంపీడీవోను ఇన్‌చార్జిగా నియమించాం.. ప్రతీ అధికారి రోజుకు రెండు గ్రామాలను సందర్శించి గ్రామ సభల నిర్వహణను పర్యవేక్షిస్తారు.. జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాల్లో దరఖాస్తు స్వీకరణకు కౌంటర్లు పెంచుతున్నాం... గ్రామపంచాయతీ కార్యాలయాల్లోనూ దరఖాస్తులు స్వీకరించే సదుపాయాన్ని కల్పిస్తున్నాం.. జనవరి ఆరు తర్వాత కూడా దరఖాస్తులు స్వీకరిస్తారు... గడువు తరువాత ఎంపీడీవో, ఎంఆర్వో కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నాం... ఎవరూ ఆందోళన చెందొద్దు.. రేషన్ కార్డులు లేని వారి దరఖాస్తును కూడా స్వీకరిస్తాం...కొత్త రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ... గ్రామ సభల్లో అన్ని రకాల దరఖా స్తులను స్వీకరిస్తాం... జనవరి 7 లోపు లబ్దిదారుల వివరాలను సేకరిస్తాం" అని సీఎం వివరించారు. మహాలక్ష్మి పథకంతో ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లకు త్వరలో ఆర్థిక సహాయం ప్రకటిస్తామని తెలిపారు. మేడిగడ్డ ప్రాజెక్ట్‌పై విచారణ కొనసాగుతోందని, దోషులెవరిని వదలబోమని హెచ్చరించారు. రైతు బంధుపై ఎలాంటి సీలింగ్ పెట్టే ఆలోచన ప్రస్తుతానికి లేదనీ, మంత్రి వర్గంలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ డిసెంబర్ 20వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకు విడతల వారీగా రైతు బంధు డబ్బులు జమ చేస్తూ వచ్చారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పుడు ఎందుకు గాయ్ గాయ్ చేస్తున్నారంటూ కేటీఆర్, హరీశ్‌లను ఉద్దేశించి చురకలు అంటించారు. అర్హులైన ప్రతి రైతుకు రైతు బంధు పథకం డబ్బులు జమ అవుతాయని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన రాష్ట్ర వాటా కోసం ప్రధానితో పాటు ఎవరినైనా కలవడానికి సిద్ధంగా ఉన్నామనీ, తమకు బేషజాలు లేవని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను దివాళా తీయించిందని, దాన్ని అధిగమించేందుకు దుబారాను తగ్గించడంతో పాటు ఆర్థిక క్రమ శిక్షణ పాటిస్తామని తెలిపారు. మీడియా కోసం సచివాలయంలో ప్రత్యేక గదిని కేటాయించనున్నట్టు తెలిపారు. ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ప్రకటించారు.

కేసీఆర్ కుటుంబం ప్రజల రక్తాన్ని దోచుకుంది

కేసీఆర్ కుటుంబం ప్రజల రక్తం పిండి ఆస్తులు సంపాదించిందని సీఎం ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు ఉపయోగపడే భవనాలను కూల్చి కమీషన్ల కోసం కొత్తవి కట్టారని దుయ్యబట్టారు. దాన్ని ఆస్తులు సష్టించడంగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. ప్రజావాణిలో న్యాయం జరగలేదంటూ ఓ మహిళకు మాజీ మంత్రి కేటీఆర్ రూ.లక్ష అందించారని ప్రచారం చేసుకుంటున్నారనీ, అయితే ఆ మహిళకు లక్ష రూపాయలు ఇప్పించడంలో ప్రజావాణి విజయవంతమైందని సీఎం అన్నారు. కేటీఆర్ దోచుకున్న లక్ష కోట్లల్లో లక్ష రూపాయలే పంచారనీ, మిగతా డబ్బులు కక్కిస్తామని అన్నారు. 22 కొత్త ల్యాండ్ క్రూజర్ వాహనాలు కొని విజయవాడలో దాచిపెట్టారని విమర్శించారు. తమ ప్రభుత్వం చుట్టూ షాడో టీంలను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఓటమి జీర్ణించుకోలేక కేటీఆర్ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఐటీఐఆర్, సైనిక్ స్కూల్ గురించి అడగని వినోద్ కుమార్ బుల్లెట్ ట్రైన్ గురించి మాకు నీతులు చెబుతున్నారని విమర్శించారు.

త్వరలో జాబ్ క్యాలెండర్

ఎన్నికల ముందు తెలంగాణ యువతకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి, డిసెంబర్ 2024 కల్లా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం తెలిపారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యులు ఇప్పటికే రాజీనామా చేశారనీ, వారి రాజీనామాలను గవర్నర్ ఆమోదించిన మరుక్షణమే కొత్త చైర్మెన్, సభ్యులను నియమిస్తామని పేర్కొన్నారు. చైర్మెన్, సభ్యుల నియామకం తరువాత ఉద్యోగాల భర్తీ పారదర్శకంగా జరుగుతుందన్నారు. నిరుద్యోగులు ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. గ్రూప్-2 నిర్వహణపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

భారత్ న్యాయ యాత్ర

(మొదటిపేజీ తరువాయి)

సెక్రటరీ కెసి వేణుగోపాల్, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ తెలిపారు. దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం కోసం ఈ యాత్ర సాగుతుందని అన్నారు. డిసెంబర్ 21 న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఏకగ్రీవ తీర్మానం ప్రకారం రాహుల్ గాంధీ రెండో దశ యాత్ర జరుగుతుందని తెలిపారు. మణిపూర్ ప్రజల గాయాలను నయం చేసే ప్రక్రియలో భాగంగా ఈ యాత్ర ప్రారంభించాలని ఆయన అన్నారు.

మొదటి దశలో రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 12 రాష్ట్రాలను కవర్ చేస్తూ దాదాపు 4,500 కిలోమీటర్లు ప్రయాణించగా, ఈసారి 14 రాష్ట్రాలను కవర్ చేస్తూ 6,200 కిలోమీటర్లు ప్రయాణించనున్నారని తెలిపారు. యాత్ర మణిపూర్, నాగాలాండ్, అస్సాం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలో సాగనుందన్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఆర్థిక అసమానతలు, మతోన్మాదం, నియంతత్వం వంటి అంశాలను లేవనెత్తగా, న్యాయ యాత్ర దేశ ప్రజలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయంపై దృష్టిసారిస్తుందని తెలిపారు.భారత్ జోడో యాత్రతో ఐక్యత, ప్రేమ, సామరస్య సందేశాన్ని వ్యాప్తి చేసిన రాహుల్ గాంధీ ఈ యాత్ర ద్వారా దేశ ప్రజలకు న్యాయం కోరుతారని అన్నారు. ఈ యాత్రలో ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) పార్టీలు కూడా పాల్గొంటాయా అనే ప్రశ్నకు వేణుగోపాల్ సమాధానమిస్తూ, తుది వివరాలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నేతలు కూడా ఆ యాత్రలో పాల్గొన్నారని గుర్తు చేశారు.

స్వేద పత్రాలు కాదు.. సౌదాపత్రాలు రిలీజ్ చేయాలి

- ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తాం : రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

అప్పులపాలు చేసిన తెలంగాణపై స్వేదపత్రాలు కాదు.. కల్వకుంట్ల కుటుంబానికి.. ఆస్తులు ఎలా పెరిగాయో, ఫామ్‌హౌస్, ఇండ్ల విలువ వందల కోట్లు ఎలా వచ్చాయో సౌద పత్రాలు విడుదల చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని తిరుమల గార్డెన్స్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 రోజులు కాలేదని, అంతలోనే బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని స్వేదపత్రంతో విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 రోజుల్లో రెండు హామీలను నెరవేర్చామని అన్నారు. ప్రజాపాలనలో సమస్యపై దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ రసీదు తీసుకోవాలని తెలిపారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో పాటు ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచామన్నారు. నాలుగు కోట్ల మంది మహిళలు జీరో టికెట్‌తో ప్రయాణం చేశారన్నారు. మహిళలు ఊహించని విధంగా ఉచిత ప్రయాణంపై అనూహ్య స్పందన వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఉచిత ప్రయాణం అమలు చేశామన్నారు. కొన్ని రూట్లలో బస్సులు కావాలని నా దృష్టికి వచ్చిందని, త్వరలోనే కొత్త బస్సులు తీసుకొచ్చి అన్ని రూట్లలో బస్సులు వేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తెలంగాణ పరిస్థితి చూస్తే రూ.7 లక్షల కోట్ల అప్పులతో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. ఉద్యోగుల జీతాలు ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు తీసుకునే రోజులు వస్తున్నాయన్నారు. ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం కావాలంటే అధికారులు భాగస్వాములు కావాలన్నారు. స్వేచ్ఛ ఇస్తున్నామని.. మీకు ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పిసిసి సభ్యులు కేడం లింగమూర్తి, చిత్తారి పద్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీప్‌ఫేక్ పాలిట్రిక్స్

(మొదటిపేజీ తరువాయి)

పడుతుందో కూడా పాల్ చెప్పారు. " మొత్తం పనిని ఏఐ నిర్వహిస్తుంది కాబట్టి ఇది ఎక్కువ సమయం తీసుకోదు. మేము కేవలం ఆదేశాలను జారీ చేస్తాం. సాధనాలు వాటికవే మిగిలిన పనిని నిర్వహిస్తాయి" అని అతను స్పష్టం చేశాడు.ప్రతి అభ్యర్థి నెలకు రూ. 5 లక్షలు చెల్లిస్తాడని పాల్ చెప్పాడు. అభ్యర్థి ప్రత్యర్థుల ప్రతిష్టను దెబ్బతీసేందుకు డీప్‌ఫేక్ టెక్నాలజీని ఉపయోగించి ఇంటిమేట్ వీడియోలను రూపొందిస్తామన్నాడు. "మేము మొదట వాటిని సోషల్ మీడియాలో ఉపయోగించుకుంటాం. వ్యూహాత్మకంగా డీప్‌ఫేక్‌లు, కాల్ రికార్డింగ్‌లను ఎప్పుడు విడుదల చేయాలనే దానిపై మేము అభ్యర్థుల నుంచి ఆదేశాలు అందుకుంటాం" అని పాల్ వివరించారు. ఈ అప్‌లోడ్‌ల మూలాల గురించి ఆందోళనలు తలెత్తితే.. మేము భారత్‌లో పని చేస్తున్నప్పుడు యూఎస్‌లో ఉన్నాము అనే అభిప్రాయాన్ని సృష్టించటానికి మా ఐపీ చిరునామాను మారుస్తామని తెలిపాడు. ఎన్నికల సమయంలో ప్రత్యర్థి అభ్యర్థికి చెందిన వాయిస్ ఏదైనా సృష్టించగలమనీ, ఇది కచ్చితంగా సదరు అభ్యర్థి వాయిస్‌ను పోలి ఉంటుందని చెప్పాడు. ఇలాంటి టెక్నాలజీతో ఎన్నికల ప్రసంగాలను తారుమారు చేస్తున్నారని రోహిత్ వివరించాడు. ఇలాంటివి చాలా సులభమని చెప్పాడు.

పొలిటికల్ డీప్‌ఫేక్‌లకు డిమాండ్ ఎక్కువగా ఉన్నదన్నాడు. " విపక్షాలను మట్టికరిపించాలనే డిమాండ్ రాజకీయ పార్టీల్లో ఉన్నది. మీరు వేరొకరి వాయిస్‌ని ట్యాంపర్ చేస్తే, అది పట్టుకోవచ్చు. పూర్తిగా ఏఐతో రూపొందించిన వీడియోలను నకిలీవని గుర్తించటం అంత సులభం కాదు" అని ఆయన వివరించారు. ఈ డిజిటల్ మాయా విద్యకు సంబంధించి అనేక సంస్థలు పని చేస్తుండటం గమనార్హం.

మన పద్దులో వాస్తవికత ఉండాలి

అదే అసలైన బడ్జెట్

- కేంద్ర నిధులను నూటికి నూరు పాళ్లూ వాడుకోవాలి
- ప్రజలకు జవాబుదారీగా వార్షిక బడ్జెట్
- ఆర్థిక శాఖ సమీక్షా సమావేశంలో : సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సవాళ్లు, ప్రభుత్వం ముందున్న లక్ష్యాలకు సంబంధించి ఉన్నది ఉన్నట్టుగా ప్రజలకు చెప్పేద్దామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. అసలైన తెలంగాణ ఇప్పుడే వచ్చిందనుకుని బడ్జెట్ తయారు చేయాలంటూ ఆయన వారిని ఆదేశించారు. దుబారా చేయకుండా, వృధా ఖర్చులు తగ్గించాలని కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరపు వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ఆదాయ వ్యయాల వాస్తవికతను ప్రతిబింబించేలా రూపొందించాలని ఆయన సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్... ఆ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లను నూటికి నూరు పాళ్లూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేశారు. లేనిపోని గొప్పలు, ఆర్భాటాలకు పోకుండా వాస్తవిక బడ్జెట్‌ను రూపొందించాలని అన్నారు. వాస్తవంగా రాష్ట్ర ఆదాయమెంత..? ఉద్యోగుల జీతభత్యాలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, చేయాల్సిన పనులకు ఎంత ఖర్చవుతుందనే అంశాలపై పక్కాగా అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. అప్పులు, చెల్లించాల్సిన బకాయిలు, నెలవారీ ఖర్చులన్నింటిపై అధికారులకు స్పష్టత ఉండాలని అన్నారు. ఎలాంటి దాపరికం లేకుండా ఆదాయ వ్యయాల ముఖచిత్రం ప్రజలకు అర్థమయ్యేలా ఉండేలా జాగ్రత్త పడాలని సీఎం సూచించారు. ఎవరో కొందరు వ్యక్తులను సంతృప్తిపరచాల్సిన అవసరం లేదనీ, అయితే తెలంగాణ ప్రజలను సంతృప్తి పరచాల్సిన బాధ్యత మాత్రం ప్రభుత్వంపైన్నే ఉందని నొక్కి చెప్పారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలని రేవంత్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన గురుతరమైన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. అందుకే ప్రజా కోణంలో బడ్జెట్ ఉండేలా ప్రత్యేక కసరత్తులు చేయాలని కోరారు. గతంలో మాదిరిగా అప్పులు దాచి, ఆదాయ వ్యయాలను భూతద్దంలో చూపించాల్సిన అవసరం లేనే లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆదాయ స్థితిగతులపై ఉన్నది ఉన్నట్టుగా జనం ముందు ఉంచాలని సూచించారు. అడ్డగోలు ఖర్చులు, అనవసర వ్యయం, దుబారా లేకుండా చూడాలని కోరారు. తప్పనిసరైతే తప్ప ప్రభుత్వం తరపున ఇచ్చే ప్రకటనలు కూడా తగ్గించాలని కోరారు. కొత్త వాహనాలను కొనుగోలు చేయకుండా, ఇప్పుడు ఉన్న వాటినే వినియోగించుకోవాలని సీఎం ఆదేశించారు. గత ప్రభుత్వం ఎన్నికల్లో గెలవకముందే 22 ల్యాండ్ క్రూయిజర్లను కొనుగోలు చేసిన విషయం ఈ సందర్భంగా చర్చకొచ్చింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం నుంచి వీలైనన్ని గ్రాంట్లను రాబట్టేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని రేవంత్ ఆదేశించారు. వివిధ శాఖలు, స్కీముల వారీగా కేంద్రం అందించే మ్యాచింగ్ గ్రాంట్లను నూటికి నూరు పాళ్లా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొంతమేరకు రాష్ట్రం తన వాటాను చెల్లిస్తే కేంద్రం తన వాటాగా ఇచ్చే నిధులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవద్దని ఆయన అధికారులను అప్రమత్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి పేరు వస్తుందనో లేదా రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దగా పేరు రాదనే విధంగా బేషజాలకు పోవద్దని అన్నారు. తెలంగాణ అభివృద్ధి, ఇక్కడి ప్రజల సంక్షేమమే అంతిమ లక్ష్యంగా బడ్జెట్ కసరత్తులు చేపట్టాలంటూ సీఎం ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, కార్యదర్శి టీకే శ్రీదేవి, సంయుక్త కార్యదర్శి కె.హరిత, డిప్యూటీ సీఎం ఓఎస్డీ కష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.:

ఓటాన్ అకౌంట్‌కు రంగం సిద్ధం...

సీఎం రేవంత్ ఆర్థిక శాఖపై సమీక్ష నిర్వహించిన నేపథ్యంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు రంగం సిద్ధమైనట్టేనని ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. బడ్జెట్ ఎలా ఉండాలి? ఏయే ప్రాతిపదికల ఆధారంగా దాన్ని రూపొందించాలనే అంశంపై ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలిచ్చిన దరిమిలా వాటికి అనుగుణంగా పద్దును రూపొందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. పార్లమెంటు ఎన్నిలకు మార్చిలో నోటిఫికేషన్ రాబోతుందనే వార్తల నేపథ్యంలో అంతకుముందే ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఆ క్రమంలోనే సీఎం బడ్జెట్ రూపకల్పనపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

నేడు నాగ్‌పూర్‌కు సీఎం రేవంత్

- 80వేల మంది ర్యాలీలో పాల్గొంటారు : మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాగ్‌పూర్‌లో ఆ పార్టీ భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, ముఖ్యనేతలు బయలుదేరి వెళుతున్నారు. ఆ ర్యాలీని విజయవంతం చేసేందుకు రాష్ట్రం నుంచి భారీగా జనాన్ని తరలించేందుకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి 80వేల మందిని తరలిస్తున్నట్టు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ నవతెలంగాణకు చెప్పారు. జనసమీకరణ కోసం ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్నట్టు తెలిపారు. పార్టీ నేతలు మల్లు రవి, కుసుమ కుమార్, నిజాముద్దీన్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఇప్పటికే నాగ్‌పూర్‌కు చేరుకుని తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

కాంగ్రెస్ నాయకులు సంధాన కర్తలుగా ఉండాలి
టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న తరుణంలో ప్రజలకు, ప్రభుత్వానికి కాంగ్రెస్ నాయకులు సంధాన కర్తలుగా ఉండాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి. నిరంజన్ కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం మొదలైందనీ, ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఇప్పటికే బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాలతోపాటు రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పథకాలు అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి సహకారం అందించాలని కోరారు. మాజీ ఎంపీ వి హనుమంతరావు మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అమలులోకి రాబోతున్నాయన్నారు.

రైతులకు విత్తన కొరత లేకుండా చూడాలి

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతులకు ఎలాంటి విత్తన కొరత లేకుండా చూడాలనీ, ఇందుకోసం నిరంతర పర్యవేక్షణ ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను, విత్తన కంపెనీలను ఆదేశించారు. ఇందుకోసం డిమాండ్‌కు తగినట్టు అంచనాలు వేసుకోవాలని సూచించారు. విత్తన ఎగుమతులను తగ్గించి కొరత లేకుండా చూడాలని కోరారు. వచ్చే సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తన సరఫరా చేయాలన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నాణ్యమైన విత్తన సరఫరా, వాటి పర్యవేక్షణపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన సరఫరాలో తెలంగాణ రైతులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, మిగతా విత్తనాలను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసుకోవాలని కంపెనీలకు సూచించారు. బినామీ, సరైన మౌలిక సదుపాయాలు కల్పించని కంపెనీలను గుర్తించి వాటిని బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో నకిలీ విత్తనాల సరఫరా లేకుండా చూడాలన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాలతో రైతులకు నష్టం జరిగితే విత్తన కంపెనీలు తగిన నష్టపరిహారాన్ని చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ విత్తన రంగ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని వివరించారు. సమీక్షా సమావేశంలో తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ కేశవులు ఉన్నారు.

పత్తి మార్కెట్లలో తగిన సౌకర్యాలు కల్పించాలి

పత్తి కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసి మార్కెట్ యార్డుల్లో తగిన సౌకర్యాలు కల్పించాలని తుమ్మల ఆదేశించారు. పత్తి పండించే రైతుల నుంచే పత్తిని కొనుగోలు చేయాలన్నారు. ఆ సమాచారం లేని రైతుల వివరాలను ఏఈవోలు సేకరించాలని ఆదేశించారు. దేశంలోనే ఆదర్శంగా ఉండేలా కొత్త మార్కెట్లను నిర్మించాలన్నారు. పత్తి గింజల నుంచి నూనే సేకరించే యూనిట్లను స్థాపించేందుకు పరిశ్రమల శాఖతో సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

గ్రూప్స్ పరీక్షల గందరగోళంపై ప్రభుత్వం

- డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్స్ రాతపరీక్షల నిర్వహణ, పరీక్షల రీషెడ్యూల్, జాబ్ క్యాలెండర్ అంశాలపై నిరుద్యోగుల్లో నెలకొన్న గందరగోళంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్పష్టమైన ప్రకటన చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-1 పోస్టుల భర్తీ ప్రక్రియ లీకేజీ కారణంగా వాయిదా పడి కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని తెలిపారు. వచ్చేనెల ఆరు, ఏడు తేదీల్లో గ్రూప్-2 రాతపరీక్షలను నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించిందని పేర్కొన్నారు. చైర్మెన్, సభ్యుల రాజీనామాతో ఆ పరీక్షలు జరుగుతాయా? లేదా? అనే ఆందోళనలో నిరుద్యోగులున్నారని తెలిపారు. గ్రూప్-4 ఫలితాలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. అభ్యర్థుల్లో ఉన్న అనుమానాలను రాష్ట్ర ప్రభుత్వం నివృత్తి చేయాల్సిన అవసరముందని సూచించారు. గత ప్రభుత్వం మాదిరిగా తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.

ఆశాల పెండింగ్ పారితోషికాల చెల్లింపుపై కమిషనర్ హామీ

- మిగతా సమస్యలనూ పరిష్కరిస్తామని కృషిచేస్తామన్నారు : సీఐటీయూ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆశావర్కర్లకు నవంబర్ నెల పారితోషికం గురు, శుక్రవారాల్లో జమచేస్తామని వైద్యారోగ్య కమిషనర్ హామీనిచ్చారని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి తెలిపారు. బుధవారం ఈ మేరకు వారు వైద్యారోగ్య శాఖ కమిషనర్ కర్నన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అక్టోబర్ 9న హెల్త్ డైరెక్టర్ ఇచ్చిన హామీల గురించి కమిషనర్ వద్ద ప్రస్తావించారు. రూ.18 వేల వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపు, ప్రమాద బీమా రూ.5 లక్షల చెల్లింపు, రిటైర్డ్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, సంక్షేమ పథకాల వర్తింపు, తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఆరు నెలల ఏరియర్స్‌ను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. నవంబర్ నెల పారితోషికాలు వెంటనే అకౌంట్లలో వేస్తామనీ, ఇన్సూరెన్స్, తదితర డిమాండ్లను పరిశీలిస్తామనీ, వాటి పరిష్కారం కోసం కృషిచేస్తామని కమిషనర్ హామీనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.కవిత, ఏ. హేమలత, రాష్ట్ర నాయకులు ఎం.మీనా, ఎం.రేవతి, ఏ.శ్రీదేవి ఎస్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సంపాదకీయం

చీకటిపర్వం

పార్లమెంటు శీతాకాల సమావేశాలు షెడ్యూలు కంటే ఒకరోజు ముందుగానే గురువారం ముగిశాయి. హంగులతో అధునాతనంగా నిర్మించిన పార్లమెంటు నూతన భవన సముదాయంలో ఈ నెల 4న ప్రారంభమై 21 వరకు సమావేశమయ్యాయి. మూడు క్రిమినల్ బిల్లులు సహా మొత్తం 19 బిల్లులు ఉభయ సభల్లో ఆమోదం పొందాయి. లోక్‌సభ 74 శాతం, రాజ్యసభ 79 శాతం ఉత్పాదకత సాధించినట్లుగా ప్రభుత్వం ప్రకటించుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో మొట్టమొదటి సారిగా భారతీయత జోడించిన క్రిమినల్ చట్ట బిల్లులను ఆమోదింపజేసుకున్నామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి స్వీయభుజకీర్తులు తగిలించుకొని బాకాలూదారు. కానీ వాస్తవంలో జరిగిందేమిటో దేశమంతా చూసింది. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండగానే 2001 డిసెంబరు 13న పార్లమెంటు పాత భవనంపై ఉగ్రవాదులు దాడి జరిగింది. నాటి దాడిలో అమరులైన వారిని స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటిస్తున్న రోజే పార్లమెంటు కొత్త భవనంలోకి చొరబడి దుండగులు ఎంతటి భయోత్పాతానికి గురి చేశారో చూశాం. బాంబులతో రంగుల పొగ వదిలి అధునాతన భవనమని మోడీ సర్కార్ చెబుతున్న పార్లమెంటు భద్రతా ప్రమాణాల డొల్లతనాన్ని ఈ ఘటన రట్టు చేసింది. చొరబడిన దుండగులకు పాసులిచ్చిన బీజేపీ ఎంపీని కనీసం ప్రశ్నించేందుకు కూడా మోడీ సర్కార్ ఉపక్రమించడం లేదు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై అనర్హత వేటు వేయడంతో మొదలైన బీజేపీ అప్రజాస్వామిక ఎత్తుగడలు శీతాకాల సమావేశాల చివరిరోజు వరకు కొనసాగాయి. భారత పార్లమెంటు చరిత్రలోనే ఒకే సెషన్‌లో 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసి మోడీ సర్కార్ ఒక చీకటి పర్వాన్ని లిఖించుకుంది. నూతన పార్లమెంటు భవనం గాంఢ్రించే సింహతలాటం, రాజదండాలతో నిరంకుశ రాచరికానికి ప్రతిబింబంగా ఉందని, దాని ఆకారమే 'శవపేటికను తలపిస్తోందంటూ విమర్శకులు సంధించిన వ్యంగాస్త్రాలను రుజువు చేసేలా నిరంకుశ చర్యలతో ప్రజాస్వామ్య విలువలకు బీజేపీ ప్రభుత్వం ఈ శీతాకాల సమావేశాల్లో సమాధి కట్టేసింది.



ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తెలంగాణలో కాంగ్రెస్, మిజోరంలో జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ అధికారంలోకి రాగా మిగిలిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో పార్లమెంటు శీతాకాల సమావేశాలు వాడీవేడిగా జరుగుతాయని భావించినవారికి ఈ సెషన్ తీవ్ర అసంతృప్తిని మిగిల్చిందనే చెప్పాలి. భద్రతా వైఫల్యం, గంపగుత్తగా ప్రతిపక్షాల సభ్యులపై వేటు, క్రిమినల్ చట్టాలకు సంబంధించిన బిల్లులపై మాట్లాడేందుకు తమకు తగినంత సమయం ఇవ్వలేదని అధికారపార్టీ మహిళా ఎంపీలే నిట్టూర్చడం వంటి ఘటనలతో శీతాకాల సమావేశాలు వాస్తవ రూపు దాల్చిన పీడకలగా నిలిచిపోయాయి. ప్రభుత్వ దుర్మార్గపు చర్యలను నిరసిస్తూ పార్లమెంటు ఆవరణలోనే ప్రతిపక్షాలసభ్యులు నిరసన తెలియజేస్తే దానికి కూడా వక్ర భాష్యాలు అల్లేసి, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్‌కు అన్యాయం జరిగిపోయిందహో అంటూ పార్లమెంటులో బీజేపీ నేతలు చేసిన చేష్టలు విరక్తి పుట్టించే నాటకాన్ని తలపించాయి.

భారత శిక్షాస్మృతి, భారత నేర ప్రక్రియా స్మృతి, భారత సాక్ష్యాధారాల చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య సంహిత తీసుకొచ్చేందుకు ఉద్దేశించి మూడు బిల్లులను, టెలికమ్యూనికేషన్ల బిల్లును, భారత ఎన్నికల ప్రధాన కమిషనరు, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన సవరణ బిల్లును ఈ సెషన్‌లో ఆమోదింపజేసుకున్నారు. ఇవన్నీ కూడా భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే బిల్లులే. ప్రతిపక్షమంటే ప్రజల గొంతుక. ప్రజల సమస్యలను ప్రస్తావించేలా చట్టసభల అధిపతులు ప్రతిపక్షాల హక్కులను కాపాడి వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ పార్లమెంటు ఉభయ సభల అధిపతులూ ఈ బాధ్యతను నిర్వహించకపోవడమే గాకుండా ప్రభుత్వానికి వంత పాడి సభా సాంప్రదాయాలను సైతం మంటగల్పారన్న విమర్శలకు శీతాకాల సమావేశాలే తార్కాణం. ఈ నిరంకుశ చర్యలకు చరమగీతం పాడాలంటే మోడీ సర్కార్‌ను సాగనంపడమే మార్గం. ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఇదే లక్ష్యంతోనే ఐక్యం అవ్వాలి.

> భారత శిక్షాస్మృతి, భారత నేర ప్రక్రియా స్మృతి, భారత సాక్ష్యాధారాల చట్టాల స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య సంహిత తీసుకొచ్చేందుకు ఉద్దేశించి మూడు బిల్లులను, టెలికమ్యూనికేషన్ల బిల్లును, భారత ఎన్నికల ప్రధాన కమిషనరు, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన సవరణ బిల్లును ఈ సెషన్‌లో ఆమోదింపజేసుకున్నారు. ఇవన్నీ కూడా భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే బిల్లులే.



'న్యూస్‌క్లిక్'కు అండగా నిలవాలి

స్వతంత్ర వార్తా పోర్టల్ న్యూస్‌క్లిక్‌పై మోడీ ప్రభుత్వం వరుసదాడులు చేస్తున్న తీరు అత్యంత దుర్మార్గం. అక్టోబర్‌లో ఆ సంస్థ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్‌ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిని ఉపా చట్టం కింద అరెస్ట్ చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆ సంస్థ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసింది. ఏ మాత్రం ముందస్తు హెచ్చరికలు లేకుండా తీసుకున్న ఈ చర్యతో రోజువారీ వ్యవహారాలకు కూడా వెతుక్కోవాల్సిన దుస్థితి ఆ సంస్థకు ఏర్పడింది. ఇక పాత్రికేయులు, వీడియోగ్రాఫర్లు, కార్యాలయ సిబ్బంది, కంట్రిబ్యూటర్ల జీతాల సంగతి చెప్పనవసరం లేదు. నిజానికి వారికి చెల్లింపులు చేయడానికి ప్రయత్నిస్తున్న సమయంలోనే బ్యాంకు ఖాతాలను ఆదాయ పన్ను శాఖ అధికారులు ఫ్రీజ్ చేసిన విషయం వెల్లడైంది. తిరిగి ఖాతాలను ఎప్పటి నుండి పునరుద్ధరిస్తారన్న అంశాన్ని కూడా ఐటి అధికారులు చెప్పకపోవడంతో అగమ్యగోచర పరిస్థితి ఏర్పడింది. క్రిస్మస్, నూతన సంవత్సరంతో పాటు సంక్రాంతి పండగల వేళ మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య జీతాల మీదనే ఆధారపడి, బతుకులీడ్చే కుటుంబాల్లో ఏ స్థాయిలో బాధను నింపుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయినా ఈ షాక్ నుండి తొందరగానే బయటపడిన న్యూస్ క్లిక్ సిబ్బంది, ఈ తరహా చర్యలు తమ మనోధైర్యాన్ని, అంకితభావాన్ని అణువంత కూడా తగ్గించలేవని, తమ శక్తినంతా ఉపయోగించి చివరి వరకు పని చేస్తామని ప్రకటించడం స్ఫూర్తిదాయకం.

మోడీ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చినప్పటి నుండి న్యూస్‌క్లిక్‌పై దేశద్రోహ ముద్ర వేయడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉంది. 2021 లోనే ఇడి, ఇన్‌కంట్యాక్స్ అధికారులతో పాటు ఢిల్లీ పోలీసులనూ రంగంలోకి దించింది. రకరకాల ప్రభుత్వ ఏజెన్సీలు రోజుల తరబడి విచారణ చేశాయి. అయినా, చైనా నిధులంటూ చేస్తున్న ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం వీసమంత కూడా నిరూపించలేకపోయింది. న్యూయార్క్ టైమ్స్ అదే ఆరోపణ చేస్తూ ప్రచురించిన బూటకపు కథనాన్ని అడ్డు పెట్టుకుని ఉపా చట్టం కింద అరెస్టులు చేసింది. అరెస్టులు చేసి నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఛార్జిషీట్ కూడా దాఖలు చేయలేదు. మరోవైపు తనకు వచ్చే నిధులన్నీ భారతీయ చట్టాలకు లోబడి, రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం బ్యాంకు అకౌంట్ల ద్వారానే వస్తాయని న్యూస్‌క్లిక్ పదేపదే స్పష్టం చేస్తోంది. ఇప్పుడు ఆ ఖాతాలను స్తంభింపచేయడం ద్వారా గొంతు నులమడానికి మోడీ ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటివరకు దాడులు, అరెస్టులు జరిగినా న్యూస్‌క్లిక్ కార్యక్రమాలు స్థిరంగా సాగుతున్నాయి. ఉద్యోగులు మొక్కవోని దీక్షతో సంస్థను ఎప్పటి మాదిరే ముందుకు తీసుకువెళ్ళారు. కరడుగట్టిన ఆర్థిక నేరగాళ్ల విషయంలోనూ లేని విధంగా బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసే దుర్మార్గానికి మోడీ సర్కారు తెగబడింది. ప్రభుత్వం అనుకున్న విధంగా జరిగితే న్యూస్ క్లిక్‌కు ఇది ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీన్ని గుర్తించే ఆ సంస్థ ఉద్యోగులు తమకు అండగా నిలవాలని పౌర సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఆ దిశలో ముందడుగు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత.

దేశ వ్యాప్తంగా ఉన్న మేధావులను, ప్రజాతంత్ర వాదులను 'ఉపా' చట్టం కింద అరెస్ట్‌చేసి, నాలుగేళ్లుగా నిర్బంధంలో ఉంచినప్పటికీ ఇప్పటివరకు ఒక్క ఆధారాన్ని కూడా మోడీ సర్కారు చూపలేకపోయింది. అటువంటి కుట్రే న్యూస్‌క్లిక్‌పై కేంద్రం చేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 'ది ఎకానమిస్ట్' పత్రిక భారత ప్రజాస్వామ్య స్తంభాలను ఒక్కొక్కటిగా కూల గొడుతున్నారు' అని రాసింది. అది అక్షరాల నిజం! ఈ ధోరణిని ఇక ఏమాత్రం అనుమతించ కూడదు. ప్రత్యామ్నాయ మీడియా సంస్థలను అణచివేయడం ద్వారా ప్రజల గొంతు నొక్కడానికి, ప్రజాస్వామ్యాన్ని కూల్చడానికి జరుగుతున్న ప్రయత్నాలను గట్టిగా ప్రతిఘటించాలి.. తిప్పికొట్టాలి.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

విద్యుత్‌రంగ అభివృద్ధికి అంతర్గత సామర్థ్యమే మూలం



సారంపల్లి మల్లారెడ్డి
9490098666

21 డిసెంబర్ 2023న రాష్ట్ర శాసన సభలో విద్యుత్ రంగంపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేత పత్రాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పత్రంలో ప్రధానంగా విద్యుత్‌చ్ఛక్తి సంస్థ 31 అక్టోబర్ 2023 నాటికి రూ.81,516 కోట్లు రుణపడి ఉన్నదని నివేదించారు. ఈ బాకీలకు సంబంధించిన ఇచ్చిన వివరణలో డిస్కాంల రుణం-62,461 కోట్లుగా ఉంది. ఇవిగాక జెన్‌కో చేసిన ఉత్పత్తి కేంద్రాల బాకీ కూడా కలిపి చెప్పారు. డిస్కాంల బాకీలో ప్రభుత్వరంగ సంస్థలు రూ.28,842 కోట్లు గత పదేండ్లుగా బాకీ పడి ఉన్నాయి. ఈ బాకీలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలం చెందడంతో డిస్కాంల నిర్వహణలో లోపాలు జరుగుతున్నాయి. తలసరి విద్యుత్ 2014లో 1356 యూనిట్లు కాగా 2021-22 నాటికి 2126 యూనిట్లకు పెరిగినట్లు దేశంలో పదో స్థానంలోకి వచ్చినట్లు చెప్పారు. ఆస్ట్రేలియా తలసరి వార్షిక వినియోగం 9,614 యూనిట్లు, దక్షిణ కోరియా 11,705 యూనిట్లు, చైనా 5,331 యూనిట్లు వినియోగిస్తున్నారు. రాష్ట్రంలో తలసరి వినియోగం తగ్గినప్పటికీ ఈ రంగం గత పదేండ్లలో బాగా అభివృద్ధి చెందినట్లు మాజీ విద్యుత్‌శాఖ మంత్రి అసెంబ్లీలో వాదించారు. చివరికి యాదాద్రి, భద్రాద్రి, ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు చేసిన మూడు అంశాలపై న్యాయవిచారణకు మాజీమంత్రి జగదీష్‌రెడ్డి ఆహ్వానించడంతో దానిని కాంగ్రెస్ ముఖ్యమంత్రి అంగీకరించి న్యాయ విచారణకు ఆదేశించారు. ఈ చర్చలో వాస్తవాలు మాత్రం దృష్టికి రాలేదు.

> **కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన సందర్భంగా 4 వేల మెగావాట్లు ఉచితంగా నిర్మాణం చేసి ఇస్తానని చెప్పి మొదటి దశలో రామగుండంలో 1600 మెగావాట్లు నిర్మాణం పూర్తి చేసింది. రెండో దశలో మరో 800 మెగావాట్లు 2024కు పూర్తి చేస్తానని చెప్పింది. సౌర విద్యుత్ అభివృద్ధి కోసం సబ్సిడీ ఇచ్చినప్పటికీ నేటి వరకు 2,695 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి జరిగింది. కానీ, మరో 3 వేల మెగావాట్ల నిర్మాణాలు జరగాలి. ఇతర ప్రాంతాల నుండి 3000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాం. గ్యాస్ ద్వారా ఉత్పత్తి 2014లో 926 మెగావాట్లు కాగా నేడు 807 మెగవాట్లకు తగ్గింది. దేశవ్యాప్తంగా గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి తక్కువ ఖర్చుతో అవుతున్నది. అలాగే సౌరశక్తి, తదితర పద్ధతులను వినియోగించి ఉత్పత్తి ఖర్చును తగ్గించవచ్చు.**

రాష్ట్రంలో మొత్తం కనెక్షన్లు 1.96 కోట్లు ఉండగా, వ్యవసాయ రంగంలో 27.99 లక్షల కనెక్షన్లున్నాయి. మొత్తం విద్యుత్ వినియోగం 2023-24కు 84,156 మిలియన్ యూనిట్లు కాగా, వ్యవసాయరంగానికి 19,810 మిలియన్ యూనిట్లు వినియోగించాలి. దీనిని ఉపసంహరిపంచేయటానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. సకాలంలో విద్యుత్ సరఫరా లోపం వల్ల దాదాపు రాష్ట్రంలో విద్యుత్ సరఫరాపై ఆధారపడి ఉన్న మూడు లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. 24 గంటల కరెంటు సరఫరా చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారు. డిస్కాంల అస్తవ్యస్థ నిర్వహణ వల్ల ఏటా 700 మంది రైతులతో బాటు 1500 పశువులు మరణిస్తున్నట్లు "విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్" నివేదికలో వెల్లడిస్తున్నారు. ఇందులో దాదాపు సగం మంది తమ లోపాల వల్లనే చనిపోయారని వారికి పరిహారం ఇవ్వ డంలేదు. విద్యుత్‌రంగ బకాయిల గురించి చర్చించిన ప్రభు త్వం విద్యుత్ నిర్వహణలో అంతర్గత నైపుణ్యాన్ని పెంచుకోవ డానికి కనీస నిబంధనలు పాటించడం లేదు. 20, 30 సంవ త్సరాల క్రితం వేసిన కండక్టర్ వినియోగించడం వల్ల ప్రసా రంలో నష్టాలు వాటిల్లుతున్నాయి. సబ్ స్టేషన్‌లో నలుగురు సిబ్బంది పని చేయాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉంటున్నారు. రాష్ట్రంలో 8.79 లక్షల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా వాటి నిర్వహణ అధ్వన్నంగా ఉంది. మెజార్టీ ట్రాన్స్‌ఫార్మర్లకు ఒకటి ఎర్తింగ్, రెండవది ఏ.బి స్విచ్‌ల నిర్వహణ, మూడో ఫీడర్ కనెక్షన్లు సక్రమంగా లేకపోవడం. ఎప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోతుందో తెలియదు. పేలిపోయిన 15 రోజుల వరకు రిపేర్లు ఉండవు. డిస్కాంలలో అవినీతి పెద్ద ఎత్తున కొనసాగు తున్నది. కనెక్షన్ల కొరకు పెట్టుకున్న దరఖాస్తులు మంజూరీ కావడానికి 4,5 మాసాలు పడుతున్నది. 14 శాతం డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్ మిషన్ నష్టాలతో నిర్వహణ సాగుతున్నట్లు నివేదిక చెప్పున్నది. వాస్తవానికి వ్యవసాయానికి విద్యుత్ మీటర్లు లేకపోవడం వల్ల జరిగిన నష్టాలను వ్యవసాయరంగంపై తోసి వేస్తున్నారు. రాష్ట్రంలోని 3,221 సబ్ స్టేషన్‌లు (33/11 కె.వి) నిర్వహణ సక్రమంగా లేక చాలా సందర్భా లలో సబ్ స్టేషన్లు కాలిపోతున్నాయి. అయినా వాటిని సకాలంలో రిపేర్లు చేయడం లేదు.

విద్యుత్ కొనుగోలులో కుంభకోణం

2014 నవంబర్ 3న ఛత్తీస్‌గఢ్ నుండి 1000 మెగవాట్ల కొనుగోలుకు పరస్పర ఒప్పందం కుదిరింది. 2017 మే 6 నుండి విద్యుత్ చక్తి ఉత్పత్తి చేసి ప్రసారం చేయడం జరిగింది. సహజంగా విద్యుత్ జనరేషన్ కేంద్రాలలో 75 శాతం "ప్లాంట్ లోడ్ ప్యాక్టర్" (పిఎల్ఎఫ్) ఉత్పత్తి కావాలి. కానీ, ఛత్తీస్‌గఢ్‌లలో కొనుగోలు చేసిన 1000 మెగావాట్లలో 2017-18లో 72.51 శాతం, 2018-19లో 64.39 శాతం, 2019-20లో 27.33 శాతం, 2020-21లో 39.7 శాతం, 2021-22లో 19.71 శాతం మాత్రమే ఉత్పత్తి అయింది. ఏప్రిల్ 21 నుండి ప్రసారం మొత్తం ఆగిపోయింది. విద్యుత్ ఉత్పత్తి కాకున్న ఆ సంస్థకు రూ.638.50 కోట్లు చెల్లించడం జరిగింది. అలాగే యాదాద్రి (4000 మెగావాట్లు) ఉత్పత్తి కేంద్రానికి మూల ధన వ్యయం 2015 జూన్ 1న రూ.25,099 కోట్లు మంజూరీ చేయగా, నేటి వరకు రివైజ్డ్ చేసి రూ.34,543 కోట్లకు పెంచడం జరిగింది. ఒక మెగావాట్లకు మొదట రూ.6.27 కోట్లు కాగా, ప్రస్తుతం రూ.8.64 కోట్లకు పెంచారు. అదే సందర్భంలో ఎన్‌టిపిసి రామగుండంలో మెగావాటుకు రూ.7.63 కోట్లకు నిర్మాణం చేశారు. అలాగే భద్రాద్రి 4క్ష270 మెగావాట్లు,మెగావాటుకు రూ.9.74 కోట్లకు పెంచారు. ఏడేండ్లు గడిచినా ఇంత వరకు పూర్తి కాలేదు.

రాష్ట్ర ఉత్పత్తి మొత్తం 6,485 మెగావాట్లు కాగా, వినియోగం 21,988 మెగావాట్లకు పెరిగింది. మన ఉత్పత్తి పోగా మిగిలిన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నాం. ఈ రోజు బహిరంగ మార్కెట్‌లో యూనిట్ రూ.3.64 రూపాయల నుండి రూ.4 లకు లభ్యం అవుతున్నది. కానీ, గత రాష్ట్ర ప్రభుత్వం 5,6 రూపాయల చొప్పున యూనిట్ కొనుగోలు చేసింది. ఒప్పందం కుదుర్చుకున్న తరువాత విద్యుత్ సరఫరా కాకున్న ఒప్పందం ప్రకారం కంపెనీలకు చెల్లించడం జరిగింది. రైతులకు, గృహాలకు సబ్సిడీ ఇవ్వడం ద్వారానే నష్టం జరుగుతున్నట్లు ప్రభుత్వం చెప్పింది. వాస్తవానికి వంద యూనిట్ల లోపు వాడకం దారులకు రూ.1,381 కోట్లు, రైతులకు 7,743 కోట్లు మొత్తం 9,124 కోట్లు మాత్రమే సబ్సిడీ చెల్లించారు. అయినా ప్రతియేటా 12వేల కోట్లు ఆదాయ వ్యయాలలో తగ్గుదల ఉన్నట్లు డిస్కాంలు బహిరంగ విచారణలో నివేదికలు ఇస్తున్నాయి. రెగ్యులేటరీ కమిషన్ ప్రతియేటా విద్యుత్ ఉత్పత్తిని, వినియోగాన్ని లెక్కగట్టి వినియోగదారుడు యూనిట్‌కు ఎంత చెల్లించాలో కెటగిరిల వారీగా నిర్ణయిస్తారు. ఆ నిర్ణయాన్ని డిస్కాంలు అమలు జరపాలి. డిస్కాంలకు వచ్చే ఆదాయం నుండి ట్రాన్స్ మిషన్‌కు, జనరేషన్‌కు ఇచ్చుకోవాలి. కానీ, డిస్కాంలకు వచ్చిన ఆదాయంలో తాము అదనంగా వాడుకుంటూ ట్రాన్స్ మిషన్‌లకు, జనరేషన్‌లకు బకాయిలు పెడుతున్నారు. 2018 నుండి 2022 మార్చి వరకు రెగ్యులేటరి కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహించలేదు. ఆ నాలుగేండ్లలో 36 వేల కోట్లు లోటు వచ్చినట్లు బాకీలు చూపుతున్నాయి.

ఒకవైపున విద్యుత్ కొనుగోలులో తక్కువ ధరకు వచ్చే విద్యుత్ కొనకుండా, విద్యుత్ జనరేషన్ కేంద్రాలలో సకాలంలో నిర్మాణం



> **ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు మాఫీ ప్రకటించింది. దాని వల్ల రాష్ట్రంలోని 1.05 కోట్ల కనెక్షన్లకు రూ.3,431 కోట్లు సబ్సిడీ చెల్లించాల్సి వస్తుంది. వీరికి 9,021 మిలియన్ యూనిట్లు అవసరం ఉంటుందని అంచనా వేశారు. అందువల్ల రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచడానికి, అంతర్గత సామర్థ్యాన్ని పెంచుకోవడానికి కృషి చేయకుండా రుణాలపైననే చర్చలు జరిపి సంతృప్తి చెందడం వల్ల ఉత్పత్తి పెరగదు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందదు. ఈ అంశాలను సమగ్రంగా చర్చించి ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.**

చేయకుండా ఉండడం వల్ల నేడు విద్యుత్ సంస్థ రుణాలు ఊహించనంతగా రూ.81,516 కోట్లకు పెరిగాయి. గతంలో కేంద్ర ప్రభుత్వ పథకాల వల్ల డిస్కాంల బాకీలను మాఫీ చేశారు. అయినా మరల బాకీలు పెరుగుతూనే ఉన్నాయి. విద్యుత్‌శాఖలోని 3 విభాగాలు అంతర్గత సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా రుణాలను చెల్లించడంతోపాటు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను ఇవ్వవచ్చు. శ్వేత పత్రంలో ప్రకటించినట్లు జన్‌కో-ట్రాన్స్‌కో డిస్కాంలకు ప్రస్తుతం ఉన్న అప్పులకు సమానంగా ఆస్తులు ఉన్నట్లు నివేదించారు. డిస్కాంల ఆస్తులు రూ.59,132 కోట్లు కాగా, అప్పులు కూడా అంతే ఉన్నాయి. జెన్‌కోకు రూ.53.963 కోట్లు ఆస్తులు కాగా, అప్పులు కూడా సమానంగా ఉన్నాయి. ట్రాన్స్‌కోకు రూ.24,476 కోట్లు ఆస్తులు ఉండగా అప్పులు సమానంగా ఉన్నాయి. 2014లో డిస్కాంల బాకీ 12,186 కోట్లు కాగా, 2023లో రూ.62,461 కోట్లకు పెరిగింది. నిర్వహణ లోపాలను ఈ అప్పులు స్పష్టంగా చెప్తున్నాయి. గత పదేండ్లలో రాష్ట్రంలో 2000 మెగావాట్ల విద్యుత్ మాత్రమే అదనంగా ఉత్పత్తి అయింది. నిర్మాణంలో ఉన్న ఉత్పత్తి కేంద్రాలు ఏళ్ళు గడిచినా పూర్తి కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన సందర్భంగా 4 వేల మెగావాట్లు ఉచితంగా నిర్మాణం చేసి ఇస్తానని చెప్పి మొదటి దశలో రామగుండంలో 1600 మెగావాట్లు నిర్మాణం పూర్తి చేసింది. రెండో దశలో మరో 800 మెగావాట్లు 2024కు పూర్తి చేస్తానని చెప్పింది. సౌర విద్యుత్ అభివృద్ధి కోసం సబ్సిడీ ఇచ్చినప్పటికీ నేటి వరకు 2,695 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి జరిగింది. కానీ, మరో 3 వేల మెగావాట్ల నిర్మాణాలు జరగాలి. ఇతర ప్రాంతాల నుండి 3000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాం. గ్యాస్ ద్వారా ఉత్పత్తి 2014లో 926 మెగావాట్లు కాగా నేడు 807 మెగవాట్లకు తగ్గింది. దేశవ్యాప్తంగా గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి తక్కువ ఖర్చుతో అవుతున్నది. అలాగే సౌరశక్తి, తదితర పద్ధతులను వినియోగించి ఉత్పత్తి ఖర్చును తగ్గించవచ్చు. తెలంగాణలో పారిశ్రామీకరణకు తగినంత విద్యుత్ సరఫరా చేయకపోవడం వల్ల పరిశ్రమల స్థాపనకు ఆటంకం ఏర్పడుతున్నది. వాటికి రూ.7-12ల వరకు యూనిట్ ధర నిర్ణయించడంతో ప్రభుత్వ సంస్థల నుండి కొనుగోలు చేయడానికి నిరాకరిస్తూ సొంత క్యాపిటేషన్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. క్రాస్ సబ్సిడీ లేకుండా వ్యవసాయం, 100 యూనిట్లలోపు వారికి సబ్సిడీ ఇవ్వడం సాధ్యం కాదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు మాఫీ ప్రకటించింది. దాని వల్ల రాష్ట్రంలోని 1.05 కోట్ల కనెక్షన్లకు రూ.3,431 కోట్లు సబ్సిడీ చెల్లించాల్సి వస్తుంది. వీరికి 9,021 మిలియన్ యూనిట్లు అవ సరం ఉంటుందని అంచనా వేశారు. అందువల్ల రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచడానికి, అంతర్గత సామర్థ్యాన్ని పెంచుకోవడానికి కృషి చేయకుండా రుణాలపైననే చర్చలు జరిపి సంతృప్తి చెందడం వల్ల ఉత్పత్తి పెరగదు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందదు. ఈ అంశాలను సమగ్రంగా చర్చించి ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

> **రాష్ట్ర ఉత్పత్తి మొత్తం 6,485 మెగావాట్లు కాగా, వినియోగం 21,988 మెగావాట్లకు పెరిగింది. మన ఉత్పత్తి పోగా మిగిలిన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నాం. ఈ రోజు బహిరంగ మార్కెట్‌లో యూనిట్ రూ.3.64 రూపాయల నుండి రూ.4లకు లభ్యం అవుతున్నది. కానీ, గత రాష్ట్ర ప్రభుత్వం 5,6 రూపాయల చొప్పున యూనిట్ కొనుగోలు చేసింది. ఒప్పందం కుదుర్చుకున్న తరువాత విద్యుత్ సరఫరా కాకున్న ఒప్పందం ప్రకారం కంపెనీలకు చెల్లించడం జరిగింది. రైతులకు, గృహాలకు సబ్సిడీ ఇవ్వడం ద్వారానే నష్టం జరుగుతున్నట్లు ప్రభుత్వం చెప్పింది. వాస్తవానికి వంద యూనిట్ల లోపు వాడకం దారులకు రూ.1,381 కోట్లు, రైతులకు 7,743 కోట్లు మొత్తం 9,124 కోట్లు మాత్రమే సబ్సిడీ చెల్లించారు.**

పథకాలు సరే! కొనుగోలు శక్తి పెంచేదెప్పుడు?



గీట్ల ముకుందరెడ్డి
94900 98857

అందరికీ సుపరిచితమైన నాటి కిలో రెండు రూపాయల బియ్యం, నేటి ఒక రూపాయి కిలో బియ్యం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆసరా పెన్షన్లు, బీడీ కార్మికులకు జీవనభృతి, రైతుబంధు, దళిత బంధు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి మహిళకు నెలకు రూ.2500, రూ.500కే గ్యాస్ సిలిండర్, ల్యాడ్లీ బహన్, ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఉచిత విద్యుత్, గృహ వినియోగానికి 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ వంటి అనేక జనాకర్షణ పథకాలను రాజకీయ పార్టీలు ఎన్నికలలో వాగ్దానం చేస్తున్నది. ప్రజలు విశ్వసించి ఓట్లు వేసిన పార్టీ అధికారంలోకి వస్తున్నది. కొన్ని వాగ్దానాలు అమలు చేయడం కొన్ని విస్మరిస్తున్నది. ఈ పథకాలతో లాభ పడుతున్నది పేద వర్గాలుగా కనబడుతున్నప్పటికీ పరోక్షంగా లాభపడుతున్నది ధనిక వర్గాలే. సంక్షేమ పథకాలు ప్రజా తిరుగుబాట్లు రాకుండా ఉపయోగపడటమే కాదు, పాలకవర్గ బూర్జువా, భూస్వామ్య పార్టీలు ఓట్లు, సీట్లు పొందడానికి, పెట్టుబడిదారీ వర్గాలు తమ దోపిడీని తీవ్రం చేయడానికి ఉపయోగ పడుతున్నాయి. ఉచితాలు అనుచితం అంటూ, పప్పు బెల్లంలా పంచి పెడుతున్నారంటూ దోపిడీ వర్గాలే గగ్గోలు పెడుతున్నాయి. ప్రభుత్వ ఖజానాకు వస్తున్న పన్నులు, రాయితీల రాబడిలో ఎనభై శాతం సామాన్యులదే.

ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాల వలన కార్పొరేట్ హాస్పిటల్స్, ఇంజనీరింగ్ విద్యాసంస్థలు లబ్ధిపొందాయి. ప్రభు త్వాలు చెల్లింపులను బకాయిలు పెడితే సేవలు నిలిపివేస్తున్నారు. ఇవే డబ్బులతో ప్రభుత్వమే నాణ్యమైన, ప్రామాణికమైన విద్యా వైద్య సౌకర్యాలు ప్రజలకు కల్పించవచ్చును. అందులో పని చేసే డాక్టర్లకు, ఫ్యాకల్టీకి, సిబ్బందికి మంచి వేతనాలు, సౌకర్యాలు కల్పించవచ్చును. ఈ పనిని ప్రభుత్వాలు ఎందుకు చేయడం లేదు? ఆలోచిస్తే సమాధానం తేలికే. కార్పొరేట్ల ప్రయోజనం కోసమేనన్నది వాస్తవం. రేషన్ బియ్యం మనిషి ఆహారానికి కొంతమేరకు ఉపయోగపడుతుంది. అదే సమయంలో తక్కువ జీతానికి, కూలికి మనుషులు దొరకడానికి పరోక్షంగా ప్రయోజనం చేకూర్చుతున్నది. ఈ స్కీం లేకుంటే పరిశ్రమల యజమానులు, భూస్వాములు, వ్యాపార, వాణిజ్య వర్గాలు రోజుకు రూ.50 పైనే అదనంగా చెల్లించవలసి వస్తుంది. ఉచిత బస్సు సౌకర్యం మహిళల సాధికారతకు దోహదం చేసేదే. దీనివల్ల శ్రామిక మహిళలకు నెలకు రూ.300 నుండి 600 వరకు పొదుపు అవుతున్నాయి. కానీ ముందు యజమానులు చెల్లించే వేతనాల్లో దీన్ని గమనంలో ఉంచుకునే వారి జీతాలు నిర్ణయించే అవకాశాలున్నాయి.

వ్యవసాయంలో వ్యయం, ఇతరులకు సాయం తప్ప రైతులకు ఆదాయం లేక ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, యంత్రాలు వంటి ఇన్‌పుట్స్ ఖర్చులు పెరుగుతున్న క్రమంలో ఈ పథకాలు వచ్చాయి. రైతుల చేతిలో వ్యవసాయం ఉన్నం తవరకు వ్యవసాయ ఉత్పత్తులు తక్కువ ధరలకే లభించాలి. ఇది పరిశ్రమల, వ్యాపార, వాణిజ్య అధిపతుల పాలసీ. ఆహార ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉంటేనే తమవద్ద పనిచేసే ఉద్యోగ, కార్మికులకు తక్కువ జీతాలు ఇవ్వడానికి ఉంటుంది. తమ పరిశ్రమలకు రా మెటీరియల్‌గా ఉపయోగపడే పత్తి, చెరుకు, రబ్బర్ వంటి ఉత్పత్తులను తక్కువ ధరకు రైతుల నుండి పొంది, తమ ఉత్పత్తులను ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు రైతుల ఆదాయం పెంచే విధంగా ఉండాలి. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి. దళిత బంధు పథకం లబ్ధిదారులు తమ తమ ఆసక్తిగల ఉత్పత్తి యూనిట్లను, వ్యాపార, వాణిజ్య రంగాల పెట్టుబడి పెట్టి స్వయం ఉపాధి పొందే ఉద్దేశంతో ఈ స్కీమ్‌ను తీసుకువచ్చారు. మార్కెటింగ్ సమస్యను ఎదుర్కొంటున్నారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతం పెరిగింది. ఆధిపత్య భావజాలంగల సమాజంలో స్కీమ్‌పై వ్యతిరేక ప్రచారం నిర్వహించడంలో పాలకవర్గాలు జయప్రదమయ్యాయి. ఆసరా పెన్షన్‌లు పొందేవారిలో వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత వృత్తుల వంటి వారు ఉన్నప్పటికీ ప్రధానంగా వృద్ధాప్య పెన్షన్లు పొందుతున్న వారే అధిక భాగంగా ఉన్నారు. పనిచేసే వయస్సులో వీరంతా రకరకాల ఉత్పత్తుల్లో పాల్గొన్నారు. అయినా సరే తమ జీవిత చరమాంకంలో వినియోగించుకునేందుకు ఆదాయాన్ని సమకూర్చుకోలేకపోయారు. వారి శ్రమకు తగిన ఫలితం దక్కకపోవడమే దీనికి కారణం. పిల్లలు వారి వద్ద తల్లిదండ్రులను పోషించుకోలేకపోతున్నారు. వీరు కూడా తమ శ్రమకు తగిన ప్రతిఫలం పొందడం లేదు. కన్నవారు పరాయివారుగా పాలకులను పెద్దకొడుకుగా, కన్నవారి కంటే ఎక్కువగా ప్రచారం చేసుకుంటున్నారు. శ్రమకు తగిన ఫలితం కాదు కదా కనీస వేతనం కూడా నిర్ణయించి అమలు చేయకుండా దోపిడీ వర్గాల ప్రయోజనాలను బూర్జువా రాజకీయ పార్టీలు కాపాడుతున్నాయి.

రాష్ట్రంలో కోటి మంది శ్రామికులకు ప్రయోజనం కల్పించే 73 షెడ్యూల్ పరిశ్రమల కనీస వేతనం జీవోలను గత పదిహేనేండ్లుగా సవరించ లేదు. కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాల్సి ఉండగా సగటున 12 గంటలకు పని చేయించుకొని రూ.8 వేల నుండి 12వేలు మాత్రమే ఇస్తున్నారు. కనీస వేతనాల సలహా బోర్డు సూచన మేరకు కార్మిక శాఖ నెలకు రూ.18 వేల కనీస వేతనంతో కూడిన జీవోలను ఐదు రంగాలలో ఇచ్చినప్పటికీ, ఫైనల్ గెజిట్ ఇవ్వకుండా రెండేండ్లకు పైగా ముఖ్యమంత్రి కార్యాలయం నిలిపివేసింది. పది మంది మ్యాన్‌పవర్‌తో పనిచేస్తున్న వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు వారి ప్రొడక్ట్, సర్వీస్‌లలో ఉపయోగిస్తున్న సాంకేతిక, పని



> **తెలంగాణ తలసరి ఆదాయం రూ.3 లక్షల 10 వేలుగా చెప్పబడుతున్నది. ఒక కుటుంబం ఇద్దరు పిల్లలు, ఇద్దరు పెద్దలు అంటే ఏడాదికి రూ.12 లక్షల 40 వేలు. ఎన్ని కుటుంబాలు ఈ ఆదాయాన్ని పొందగలుగుతున్నాయి. శ్రామికుల శ్రమతో సృష్టించబడుతున్న సంపద పెట్టుబడి దారుల వద్ద పోగుపడుతున్నది. ఇది పంచబడాలి. అప్పుడు ప్రజల ఆదాయం, ప్రభుత్వ ఖజానాకు ఆదాయం పెరుగుతుంది. అప్పుడు మరిన్ని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేయగలం.**

సామర్థ్యాన్ని బట్టి నెలకు రూ.2 లక్షల నుండి 10 లక్షల లాభం పొందగలుగుతున్నారు. ప్రభుత్వ ఖజానాపై భారం పడకుండా ప్రజల ఆదాయం పెరిగేందుకు తోడ్పడే కనీస వేతనాలు పెంపు జీవోలను ప్రభుత్వాలు ఎందుకు విడుదల చేయడం లేదు. పైగా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. అభివృద్ధికి, అవసరమైన ప్రజానీకానికి సంక్షేమ పథకాలు చేపట్టడానికి ఆర్థిక ఇబ్బందులు ఉండవు.

స్వాతంత్ర్య తొలినాళ్లలో స్వయం సమృద్ధి దిశగా భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలు నెల కొల్పడం, ఉన్నత సాంకేతిక విద్య రీసెర్చ్ కేంద్రాలు వంటి అనేక రంగాల్లో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టింది. నీటి పారుదల ప్రాజెక్టుల వలన లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చాయి. ఆహారం ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించాము. ప్రజల ఆదాయం కొనుగోలు శక్తి పెరిగింది. హైదరాబాద్ కేంద్రంగా నిర్మించబడిన బీహెచ్‌ఈఎల్, ఐసిఐఎల్, బిడిఎల్, బిఈఎల్, మిధాని, ఐడిపిఎల్, హెచ్‌ఎంటి, ఆల్విన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, వాటికి అనుబంధంగా నిర్మించబడిన అనేక చిన్న పరిశ్రమలతో పెద్ద ఎత్తున శాశ్వత ఉద్యోగాలు లభించాయి. మరోవైపు సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ రంగంలో పెద్ద ఎత్తున ఉపాధి కల్పించబడింది. ప్రభుత్వరంగ సంస్థల ఉద్దేశం ఎక్కువ మందికి మంచి వేతనంతో కూడిన ఉపాధి కల్పించడం. వాటి ఉత్పత్తులను, సేవలను ప్రజలకు తక్కువ ధరలకే అందించడం లక్ష్యంగా ఉండేది. గత రెండు దశాబ్దాల కాలంగా పరిస్థితి తిరగబడింది. ఈ సంస్థలలో పర్మినెంట్ ఉద్యోగిత తగ్గించారు. ఉత్పత్తి టార్గెట్లు పెంచారు. అరకొర వేతనాలతో కూడిన కాంట్రాక్టు కార్మికుల సంఖ్య అమాంతంగా పెంచేశారు. సుమారు పది లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న సాఫ్ట్‌వేర్ రంగంలో కూడా కాంట్రాక్టు ఉద్యోగాలు 30 శాతానికి చేరుకున్నాయని ఒక అంచనా. వీరు అసలు వేతనాల్లో 40 శాతం మాత్రమే పొందుతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉపాధి అవకాశాలు ఒక రాష్ట్రానికే పరిమితమైనవి కావు. దేశంలోని అనేక రాష్ట్రాల వాళ్లు ఉపాధి పొందుతున్నారు. దీనికి తోడు అనేక రంగాల్లోకి వలస కార్మికులు పెద్ద సంఖ్యలో ప్రవేశపెట్టబడ్డారు.

తెలంగాణలో వివిధ రంగాల్లో సుమారు 20 లక్షల మంది వలస కార్మికులు పనిచేస్తున్నారని అంచనా. వీరిలో 70 శాతం మంది యువకులు పెండ్లి కాని వారు. రోజుకు 12 గంటలు పనిచేస్తూ సగటున నెలకు రూ.12 వేల జీతం పొందుతున్నారు. రూ.రెండు వేలు లేదా మూడు వేలు ఇక్కడ ఖర్చు చేస్తున్నారు. మిగతావి తమ స్వగ్రామాల్లోని కుటుంబాలకు పంపిస్తున్నారు. వీటన్నిటి నేపథ్యంలో ప్రజల ఆదాయం కొనుగోలు శక్తి పడిపోయింది. ఆదాయమంటే ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయంగా మార్చేశారు. తెలంగాణ తలసరి ఆదాయం రూ.3 లక్షల 10 వేలుగా చెప్పబడుతున్నది. ఒక కుటుంబం ఇద్దరు పిల్లలు, ఇద్దరు పెద్దలు అంటే ఏడాదికి రూ.12 లక్షల 40 వేలు. ఎన్ని కుటుంబాలు ఈ ఆదాయాన్ని పొందగలుగుతున్నాయి. శ్రామికుల శ్రమతో సృష్టించబడుతున్న సంపద పెట్టుబడిదారుల వద్ద పోగుపడుతున్నది. ఇది పంచబడాలి. అప్పుడు ప్రజల ఆదాయం, ప్రభుత్వ ఖజానాకు ఆదాయం పెరుగుతుంది. అప్పుడు మరిన్ని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేయగలం.

ఆరు గ్యారంటీల
అమలు కోసమే ప్రణాళిక

- అంతిమ లబ్దిదారులు ప్రజలే
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రజా పాలనపై సమావేశంలో.. మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు

నవ తెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి



ఆరు గ్యారంటీల అమలు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికను రూపొందించిందని మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సముదాయ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో ప్రజాపాలన, అరుగ్యారంటీల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగమంతా సమాయాత్తం కావాలని ఆదేశించారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో ఆరు గ్యారంటీలపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించి, దరఖాస్తులు తీసుకోవాలని తెలిపారు. పథకాల రూపకల్పన, విధివిధానాలను ప్రభుత్వం రూపొందిస్తే వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. అంతిమ లబ్దిదారులు ప్రజలేనని, అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందినప్పుడే.. సార్థకత చేకూరుతుందని చెప్పారు. యావత్ తెలంగాణ ప్రజలు సంఘటితమై కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని, కాబట్టి వారికి ఇచ్చిన హామీలను అమలుచేసే బాధ్యత తమపై ఉందని, అందుకే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన కారక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి దరఖాస్తు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని, పోలీస్ యంత్రాంగం కూడా ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమం విజయవంతానికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



'ఉపాధి హామీ'కి డిమాండ్

వచ్చే ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగేనా?

న్యూఢిల్లీ : కరోనా వంటి మహమ్మారి విజృంభించి లాక్‌డౌన్ సమయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి కల్పించి బాసటగా నిలిచింది మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ). విపత్కర సమయంలో అనేక రంగాలు ప్రభావితమవుతుండగా కొంతలో కొంత ప్రజలకు ఆర్థికంగా బలాన్ని అందించగలిగింది.

ఇటు కేంద్రం ఈ పథకంలో పలు మార్పులను తీసుకొస్తున్నది. ఉపాధి కార్మికుల హాజరు, చెల్లింపులకు సంబంధించి కొత్త విధానాలను ప్రవేశపెడుతున్నది. ఇలాంటి తరుణంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏకు డిమాండ్ పెరగటంతో రాబోయే కేంద్ర బడ్జెట్ 2024-25 కోసం ఉపాధి హామీ పథకం కింద గణనీయమైన మొత్తాన్ని కేటాయించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

బడ్జెట్ కేటాయింపులు

బడ్జెట్ కేటాయింపులు 2019-20లో రూ. 71,002 కోట్ల వాస్తవ వ్యయంతో పోలిస్తే 2020-21లో రూ. 61,500 కోట్లకు పడిపోయాయి. అంటే 13 శాతం తగ్గుదల నమోదైంది. కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఈ పథకం కింద డిమాండ్ బాగా పెరిగింది. ఈ సంక్షోభ సమయంలో ఈ పథకానికి ఆత్మనిర్భర్ భారత్ ఉద్దీపన ప్యాకేజీ కింద దాని కేటాయింపును రూ.1.11 లక్షల కోట్లకు పెంచారు. 2022-23లో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏకు బడ్జెట్ కేటాయింపులు రూ. 89,400 కోట్లకు సవరించిన అంచనాల నుంచి 2023-24కి 33 శాతం తగ్గి రూ. 60,000 కోట్లకు పడిపోవటం గమనార్హం. అయితే, ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 'ఉపాధి హామీ'కి డిమాండ్ పెరిగింది. రుతుపవనాల అనిశ్చితితో పాటు పట్టణ ఉద్యోగాల్లో సంక్షోభం కూడా ఉన్నది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ గ్రామీణ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ.. మోడీ సర్కారుకు ఈ పథకంపై ఎప్పుడూ చిన్న చూపేనని విశ్లేషకులు చెప్తున్నారు. ఇందుకు గత కొన్నేండ్లుగా బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు, పథకంలో సంక్లిష్ట విధానాలు తీసుకురావటం వంటి వాటిని వారు ఉదహరిస్తున్నారు.

ఒకవేళ కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులు పెంచినా వచ్చే ఏడాది రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే చేస్తుందని తెలిపారు.

నేడు అమిత్‌షా రాక

- పార్లమెంట్ ఎన్నికలపై శ్రేణులకు దిశానిర్దేశం : ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ : జి. ప్రేమేందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మండలాధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర నాయకులతో బీజేపీ రాష్ట్రస్థాయి సమావేశాన్ని గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కొంగర కలాన్‌లో గల శోక్ష కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్టు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారని పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, రాష్ట్ర ఇన్‌చార్జులు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్, సహ ఇన్‌చార్జి అరవింద్ మీనన్, శాసనసభ ఎన్నికల ఇన్‌చార్జి, ఎంపీ ప్రకాశ్ జవదేకర్, తదితర నేతలు పాల్గొంటారని తెలిపారు. గురువారం ఉదయం అమిత్‌షా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరకుంటారనీ, అక్కడ నుంచి చార్మినార్ వద్దనున్న భాగ్యలక్ష్మి దేవాలయాన్ని సందర్శించుకుంటారని పేర్కొ న్నారు. ఆ తర్వాత కొంగరకలాన్‌లోని రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొంటారనీ, అసెంబ్లీ ఎన్నికలపై సమీక్షించి పార్లమెంట్ ఎన్నికలకు ఎలా సన్నద్ధం కావాలనే దానిపై దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. వికాసిత్ భారత్(సంకల్ప యాత్ర), అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ట(అయోధ్య సందర్శన) తదితర అంశాలపై చర్చిస్తారని పేర్కొన్నారు. అనంతరం బీజేపీ శాసనసభ్యులతో సమావేశమవుతారని తెలిపారు.

దిశ ఎన్‌కౌంటర్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ

నవతెలంగాణ -హైదరాబాద్

దిశ కేసు నిందితుల ఎన్‌కౌంటర్ కేసును హైకోర్టు బుధవారం విచారించింది. అందరి వాదనలు వినాల్సివుందని చెప్పింది. అందుకే పోలీసులకు, పోలీస్ ఆఫీసర్లకు నోటీసులు ఇస్తున్నట్టు చెప్పింది. గతంలో నిందితుల తరపున కుటుంబ సభ్యులను ప్రతివాదులుగా చేర్చి నోటీసులు ఇచ్చినట్టు తెలిపింది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై 302 సెక్షన్ కింద (హత్యానేరం) కేసు నమోదు చేయాలనీ, ఈ కేసును ప్రత్యేక దర్యాప్తు బందం (సిట్) నుంచి సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను చీఫ్ జస్టిస్ అలోక్ అరథే నేతత్వంలోని డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. సిట్ దర్యాప్తు చేసినందున, ఎఫ్ఐఆర్ కూడా దాఖలైనందున సీబీఐ దర్యాప్తు అవసరం లేదనీ, ఒకసారి దర్యాప్తు అయ్యాక సీబీఐ వేయడానికి వీల్లేదని పోలీసుల వాదన. సిట్ దర్యాప్తు చేసినా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించే అధికారం కోర్టులకు ఉంటుందని బెంచ్ స్పష్టం చేసింది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న వాళ్లపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చెల్లదనీ, ఇది సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌కు వ్యతిరేకమనీ, 302 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని పిటిషనర్ల తరపు లాయర్ వాదించారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు పోలీసులకు నోటీసులిచ్చింది. విచారణను జనవరి నెలాఖరుకు వాయిదా వేసింది.

సింగరేణి ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్‌కు నోటీసు

సింగరేణి కార్మిక గుర్తింపు సంఘానికి జరిగే ఎన్నికల్లో తమ సంఘానికి పోటీ చేసే అర్హత లేదంటూ ఎలక్షన్ ఆఫీసర్ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ తెలంగాణ రీజనల్ సింగరేణి కార్మిక సంఘం తరపున అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి నోటీసులు జారీ

శ్రీరాంపూర్ కాలనీలో సింగరేణి అక్రమ మైనింగ్

మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ కాలనీ ప్రాంతంలో సింగరేణి కాలరీస్ అక్రమంగా బొగ్గు తవ్వకాలు చేస్తోందంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు విచారణ చేపట్టింది. చట్ట వ్యతిరేకంగా మైనింగ్ చేయడంపై కౌంటర్ దాఖలు చేయాలని సింగరేణి కాలరీస్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసింది. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ మైనింగ్ కారణంగా పరిసర గ్రామాలు కాలుష్యమవుతున్నాయంటూ మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం రామారావుపేట సర్పంచ్ సత్యవతి మరో ఐదుగురు వేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ఆలోక్ ఆరాదే, జస్టిస్ జె. అనిల్ కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది.

వ్యూహం రిలీజ్ కాకుండా ఉత్తర్వులివ్వలేం : హైకోర్టు

రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో నిర్మించిన వ్యూహం సినిమా విడుదల కాకుండా స్టే ఆర్డర్ ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది, సెన్సార్ బోర్డు వాదనల తర్వాతే తగిన ఉత్తర్వులు వెలువరిస్తామని స్పష్టం చేసింది. అందుకే సినిమా రిలీజ్ తేదీ కంటే మరోసారి పిటిషన్‌ను గురువారం విచారిస్తామని చెప్పింది. శనివారం నాడు సినిమా రిలీజ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని పిటిషనర్ నారా లోకేష్ తరపు లాయర్ చెప్పారు. సెన్సార్ బోర్డు వాదనలు ఈ నెల 28న విన్న తర్వాతే తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని జస్టిస్ సూరేపల్లి నంద చెప్పారు.

ఆదాయం పెంపుపై దృష్టి సారించండి

- రిజిస్ట్రేషన్ల శాఖకు మంత్రి పొంగులేటి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రిజిస్ట్రేషన్ల శాఖ తన ఆదాయ పెంపుపై దృష్టి సారించాలని సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఆ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పని సమానంగా పంపిణీ జరిగేలా విభాగాలను ఒక క్రమపద్ధతిలో పునర్వ్యవస్థీకరించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా త్వరితగతిన, పారదర్శకంగా నాణ్యమైన రిజిస్ట్రేషన్ సేవలను అందించాలన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రాధాన్యతా క్రమంలో చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, అదనపు ఐజీ వెంకట్ రాజేష్, జాయింట్ ఐజీ శ్రీనివాసులు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల డిప్యూటీ ఐజీలు, జిల్లా రిజిస్ట్రార్లు తదితరులు ఎల్గొన్నారు.

టీజీవో కార్యవర్గం 31కి వాయిదా

ప్రజాపాలన ప్రారంభం నేపథ్యంలో నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాపాలన ప్రారంభమవుతున్న నేపథ్యంలో గురువారం నిర్వహించతలపెట్టిన టీజీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 31కి వాయిదా వేస్తున్నట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని పేర్కొన్నారు. ఆ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇందులో ఉద్యోగులు, అధికారులు బాధ్యతాయుతంగా పాల్గొనాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు అండగా నిలవాలని సూచించారు. ఈనెల 31న టీజీవో కార్యవర్గ సమావేశంలో కొన్ని కీలకమైన నిర్ణయాలపై తీర్మానం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, వారి ప్రతినిధులు, కేంద్ర కార్యవర్గ సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

నేటీ నుంచి ఐలు 14వ అఖిల భారత మహాసభ

- హౌరాలో మూడు రోజుల పాటు ...

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

అఖిల భారత న్యాయవాద సంఘం (ఐలు) 14వ అఖిల భారత మహాసభ నేడు ప్రారంభం కానుంది. నేటీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, న్యాయం, సామ్యవాదం లక్ష్యంతో దేశవ్యాప్తంగా 50,000కు పైగా న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు, న్యాయ అధ్యాపకుల సభ్యత్వం కలిగిన ఐలు 14వ అఖిల భారత మహాసభ పశ్చిమ బెంగాల్‌లోని హౌరా నగరంలో ప్రారంభమవుతున్నాయి. మతోన్మాదంపై పోరాటం, 'సేవ్ రాజ్యాంగం, సేవ్ ప్రజాస్వామ్యం' నినాదంతో ఈ మహాసభలు జరుగుతున్నాయి. అశోక్ బికాష్ మంచ్, నారా నారాయన్ గుప్తా నగర్‌లో మహాసభ జరగనుంది. ఈ మహాసభల ప్రారంభానికి సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దీపక్ గుప్తా, ఒరిస్సా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్. మురళీధర్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అశోక్ కుమార్ గంగూలీ పాల్గొంటారు. దేశంలో ప్రజాస్వామ్యం, సోషలిజం, చట్టబద్ధమైన పాలన, ఒకే నేషన్-ఒకే ఎలక్షన్ వంటి అనేక అంశాల మీద, రాజ్యాంగపరమైన అంశాలమీద చర్చించనున్నారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణ కోసం, న్యాయవాదుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ మహాసభలో చర్చించనున్నారు. ఐలు కొత్త కమిటీని ఈ మహాసభలో ఎన్నుకోనున్నారు. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి 600 మంది న్యాయవాదులు ప్రతినిధులుగా ఈ మహాసభలో పాల్గొననున్నారు. న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు, న్యాయ ఆధ్యాపకుల సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించేందుకు కూలంకషంగా ఈ మహాసభలో చర్చించనున్నారు. ఈ మహాసభని జయప్రదం చేయాలని అఖిల భారత న్యాయవాద సంఘం కార్యదర్శి నర్రా శ్రీనివాస రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మాధవరావు ఒక ప్రకటనలో కోరారు.

బెల్టుషాపులను ఎత్తేయాలి

- పీవైఎల్ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బెల్టుషాపులను ఎత్తేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీవైఎల్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. అనంతరం పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కెపిఎస్ ప్రదీప్, కార్యదర్శి వాంకుడోత్ అజయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బెల్టుషాపులను రద్దు చేస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. బెల్టుషాపులతో యువత మద్యం మత్తులో మునిగిపోతున్నదని తెలిపారు. దీంతో నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో తెలంగాణను మద్యం మత్తులో మునిగేలా చేసిందని పేర్కొన్నారు. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా అర్ధరాత్రి వరకు మద్యం షాపులు తెరిచి ఉంచడం సరైంది కాదని తెలిపారు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు.

బీఎండబ్ల్యూ కారులో ఒక్కసారిగా మంటలు

నవతెలంగాణ-బంజారా హిల్స్

రన్నింగ్‌లో ఉన్న ఓ బీఎండబ్ల్యూ కారులో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడిన ఘటన హైదరాబాద్‌లోని సచివాలయం వెనుక ఉన్న మింట్ కాంపౌండ్ వద్ద చోటుచేసుకుంది. అయితే డ్రైవర్ వెంటనే కారు దిగడంతో ప్రాణ నష్టం తప్పింది. వాహనాదారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మింట్ కాంపౌండ్ వద్ద రన్నింగ్‌లో ఉన్న బీఎండబ్ల్యూ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే కారు నిలిపివేసి బయటకు వచ్చేశాడు. నిమిషాల వ్యవధిలో కారు మొత్తం మంటలు వ్యాపించాయి. జీహెచ్‌ఎంసీ వాటర్ ట్యాంకర్, అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందుకుని అక్కడికి చేరుకునే లోపే వాహనం దగ్ధమైపోయింది. ఖైరతాబాద్ పోలీసులు మింట్ కాంపౌండ్ వద్దకు చేరుకుని కాలిపోయిన కారును పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని కారులో మంటలు రావడానికి గల కారణాలేంటి అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

క్యులినరీలో శిక్షణ పొంది ఉద్యోగాలు పొందటం ఆనందకరం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

క్యులినరీ అకాడమీలో శిక్షణ పొంది ప్రపంచ వ్యాప్తంగానూ మంచి ఉద్యోగాలు సంపాదించడం ఆనందకరమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇలాంటి స్కిల్ ఇనిస్టిట్యూట్‌లను రాష్ట్ర వ్యాప్తంగానూ ప్రోత్సహించాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో క్యులినరీ ఎడ్యుకేషన్ గ్లోబల్ బ్రాండ్ ఆధ్వర్యంలో స్వీట్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. కిలినరీ ఎడ్యుకేషన్ సంస్థ విద్యార్థులు తయారుచేసిన కొత్తరకం స్వీట్ వంటకాలను డిప్యూటీ సీఎం రుచి చూశారు. వాటి తయారీ వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రూపుమాపడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందనీ, అందుకోసం ఇలాంటి సంస్థలను అధ్యయనం చేసి, పలు రకాల స్కిల్ కోర్సులు ప్రవేశపెట్టి నిరుద్యోగ యువకులు దేశ విదేశాల్లోని ఉద్యోగాలు పొందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోడ్ చైన్ సిస్టంలో డెవలప్ చేసి వండిన ఆహార పదార్థాలు నిల్వ ఉంచడానికి కోల్డ్ స్టోరేజ్‌లను రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. క్యులినరి అకాడమీ ఆఫ్ ఇండియా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు.

ఎన్‌ఈపీతో ప్రమాదంలోకి విద్యావ్యవస్థ

- మోడీ సర్కారుపై పోరు
- జనవరి 12న చలో ఢిల్లీ
- ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షుడు విపి సాను

అల్లూరి సీతారామరాజు నగర్ నుంచి నవతెలంగాణ ప్రతినిధి

నూతన విద్యా విధానం (ఎన్‌ఈపీ)తో విద్యా వ్యవస్థ ప్రమాదంలో పడిందని ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షుడు విపి సాను విమర్శించారు. మోడీ సర్కార్ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విద్యార్థి సంఘాలన్నీ ఐక్య పోరుకు సిద్ధమయ్యాయని తెలిపారు. బుధవారం నాడిక్కడ ఎస్‌ఎఫ్‌ఐ ఆంధ్రప్రదేశ్ 24వ రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న ఆయన నవతెలంగాణకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలను వెల్లడించారు. 2016లోనే తాము నూతన విద్యా విధానంపై హెచ్చరించామనీ, కానీ మోడీ సర్కార్ పట్టించుకోకుండా విద్యారంగాన్ని సర్వనాశనం చేసి ఎన్‌ఈపీని అమలు చేస్తున్నారని విమర్శించారు. 'కొఠారి కమిషన్ తరువాత చాలా ఏండ్లకు విద్యా విధానం తీసుకొచ్చారు. ఆ విద్యా విధానం విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఉండాలి. కానీ ఆ రకంగా కాకుండా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉంది. డ్రాఫ్టుల వంటి కీలకమైన అంశాలపై ఎస్‌ఎఫ్‌ఐ సలహాలిచ్చింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలూ కొన్ని సలహాలనిచ్చాయి. కానీ వాటిని మోడీ ప్రభుత్వం పెడచెవినపెట్టింది. డ్రాఫ్టుల వంటి కీలకమైన అంశాలపై ఎన్‌ఈపీలో ఎటువంటి పరిష్కారం చూపలేదు. రాజ్యాంగంలోని కీలకమైన ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, లౌకికవాదం, సామ్యవాదం వంటి లక్ష్యాలపై ఎన్‌ఈపీ మౌనంగా ఉంది. కరోనా కాలంలో కేంద్ర మంత్రి వర్గం ఆమోదంతోనే ఎన్‌ఈపీని అమలులోకి తెచ్చారు. కనీకసం పార్లమెంట్‌లో కూడా చర్చించలేదు' అని వివరించారు.

ఇండియాను ఎందుకు మార్చాలి?

'మోడీ సర్కార్ అమలు చేస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని ఎన్‌సీఈఆర్‌టీ మరింత వేగవంతం చేస్తున్నది. ఇండియా స్థానంలో భారత్‌ను ప్రయోగిస్తుంది. భారత్‌కు మేం వ్యతిరేకం కాదు. కానీ ఉన్న ఇండియాను ఎందుకు మార్చాలి. వాళ్లు (కేంద్ర ప్రభుత్వం) ఇండియాను తీసేసే ప్రయత్నం చేస్తున్నారు. మహాత్మా గాంధీని గాడ్సే హత్య చేశారనేదాన్ని పూర్తిగా పుస్తకాల నుంచి తొలగించారు. మొఘల్స్, అబ్దుల్ కలాం అజాద్, అశోకుడు, అక్బర్ వంటి వారి చరిత్రలు తొలగించారు. ఇలాంటివి అనేకం ఉన్నాయి' అని తెలిపారు.

నాణ్యమైన విద్యా కొరత

'దేశంలో నాణ్యమైన విద్యా కొరత ఉంది. ప్రపంచంలోని



మొదటి 50 యూనివర్సిటీల్లో మన దేశ యూనివర్సిటీలు ఒక్కటీ లేదు. ఇతర దేశాల్లోని విద్యా సంస్థల్లో నాణ్యత ఏడాదికేడాదికీ పెరుగుతున్నది. మన దేశంలోని విద్యా సంస్థల్లో నాణ్యత దిగజారుతున్నది.

అలాగే మన దేశం నుంచి ఇతర దేశాలకు చదువు నిమిత్తం వలస వెళ్లే విద్యార్థుల సంఖ్యా పెరుగుతున్నది. అమెరికా ఒక్క దేశానికే 96,970 మంది విద్యార్థులు వెళ్లారు. మోడీ మోడల్‌గా చెప్పుకుంటున్న గుజరాత్ నుంచే ఎక్కువ మంది ఇతర దేశాలకు వెళ్తున్నారు. చదువు, ఉపాధి నిమిత్తం 60 లక్షల మంది ప్రజలు మన దేశ సిటిజన్ షిప్‌ను వదులు కున్నారు" అని తెలిపారు.

స్కాలర్‌షిప్స్, ఫెలోషిప్స్ కోత

'మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత పేద, దళిత, గిరిజన, మైనార్టీ విద్యార్థులకు ఇచ్చే ఫెలోషిప్‌లు, స్కాలర్‌షిప్‌లు కోత విధించింది. కొన్ని ఫెలోషిప్‌లు పూర్తిగా తొలగించారు. దీనివల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే ప్రవేశపరీక్షలు, ఫెలోషిప్‌లకు అర్హత పరీక్షలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పరిధిలోకి వచ్చిన తరువాత ప్రాంతీయ భాషలను తొలగించారు. కేవలం హిందీ, ఇంగ్లీష్ భాషల్లోనే పరీక్షలు జరుగుతున్నాయి. దీంతో వెనుకబడి, గ్రామీణ, గిరిజన, దళిత విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. విద్యా సంస్థల్లో ఖాళీలు నాణ్యమైన విద్యకు ఆటంకంగా ఉన్నాయి. ఈ సమస్యలన్నింటిపై జనవరి 12న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నాం. అన్ని విద్యార్థి సంఘాలన్నీ ఒకే వేదికపైకి వచ్చి పోరాటం చేస్తున్నాం' అని తెలిపారు.

ఉత్తేజభరితంగా ప్రారంభమైన ఎస్‌ఎఫ్‌ఐ 24వ మహాసభ



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం (ఎన్‌ఈపీ) విద్వేషాన్ని నింపే విధంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రమణ్యం ధ్వజమెత్తారు. సమాన, నాణ్యమైన విద్యను అందించడంలో ఎన్‌ఈపీ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎస్‌ఎఫ్‌ఐ 24వ రాష్ట్ర మహాసభలు అల్లూరి సీతారామరాజు నగర్, ధీరార్ రాజేంద్రన్ ప్రాంగణం (అంబేద్కర్ భవన్)లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న కుమార్ అధ్యక్షతన జరిగిన ప్రారంభసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడారు. 145 కోట్ల ప్రజలున్న చైనాలో పేదలు లేరని, 35 కోట్ల ఉన్న అమెరికాలో పేదల సంఖ్య ఏడాదికి ఏడాది పెరుగుతుందని అన్నారు. సంపద పెరగడం ముఖ్యం కాదని, పెరిగిన సంపద పంపిణీ చేయడం ముఖ్యమన్నారు.

ఎయిడెడ్ విద్యా వ్యవస్థ నిర్వీర్యం

రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని, ఉన్న కాలేజీలను మూసివేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ పోరాడుతుందని, దాన్ని కొనసాగించాలని సూచించారు. ఏడాదిలోనే ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారి సంఖ్య 3.56 లక్షల మంది తగ్గిపోయారని తెలిపారు. రాష్ట్రంలో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టిన తరువాత, పిల్లల చదువులు దెబ్బతిన్నాయని అంతర్జాతీయ సంస్థలు చెబుతున్నాయని ఉటంకించారు.

కేరళలో ప్రత్యామ్నాయ విద్యా విధానం

కేరళలో ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని అక్కడి వామపక్ష ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ క్లాస్ రూమ్‌లు, పూర్తి స్థాయి ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలు వంటి ఉన్నాయని, కాలేజీల్లోనూ, యూనివర్శిటీల్లోనూ ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. అలాంటి రాజకీయ వ్యవస్థ కావాలని, అందుకోసం పోరాటం చేయాలని అన్నారు.

కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఎన్‌ఈపి వ్యతిరేకించాయి. దేశంలో ప్రశ్నిస్తే వారిపై దాడులు చేయడం, జైల్లో పెట్టడం ప్రభుత్వానికి పరిపాటిగా ఉందని విమర్శించారు. ప్రశ్నించే గొంతెలను నొక్కే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పిలుపు ఇచ్చారు.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు - 63,820 ▲ 110

22 క్యారెట్లు - 58,500 ▲ 100



చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	85
రిటైల్ (లైవ్)	రూ.	107
స్కిన్‌తో	రూ.	155
స్కిన్‌లెస్	రూ.	177

కాలపరిమితి నిర్ణయించండి

గిరిజన గ్రామాల అభివృద్ధిపై పార్లమెంటరీ కమిటీ సూచన



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి ఆది ఆదర్శ్ గ్రామ యోజన (పీఎంఏఏజీవై) పథకం అమలు కోసం కాలపరిమితిని నిర్ణయించాలని, సమస్యలకు పరిష్కారాలు సాధించాలని పార్లమెంటరీ కమిటీ కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సూచించింది. ఈ ప్రాజెక్ట్ కింద గత రెండు సంవత్సరాల కాలంలో గుర్తించిన 36,428 గ్రామాలలో కేవలం 24% గ్రామాలకు మాత్రమే అభివృద్ధి ప్రణాళికలు ఆమోదం పొందాయని తెలిపింది. దేశంలోని 36 వేలకు పైగా గిరిజన గ్రామాలలో అవసరమైన ప్రాథమిక వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించారు. గత సంవత్సరం ఈ పథకం పేరును మోడీ ప్రభుత్వం 'గిరిజన ఉప పథకానికి ప్రత్యేక కేంద్ర సాయం'గా మార్చింది.

సామాజిక న్యాయం, సాధికారతపై ఏర్పాటు చేసిన కమిటీ తన నివేదికను పార్లమెంటుకు సమర్పించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సంబంధించిన గ్రాంట్ల డిమాండ్లను ఈ కమిటీ మదింపు చేసింది. పథకం అమలు నత్తనడక నడుస్తుండడంపై మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణను కమిటీ అంగీకరించలేదు. సమస్యల పరిష్కారానికి మంత్రిత్వ శాఖ అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని కమిటీకి నేతృత్వం వహించిన బీజేపీ ఎంపీ రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. ఆచరణ సాధ్యమైన పరిష్కారాలు కనుగొని, వాటి అమలుకు కాలపరిమితి నిర్ణయించాలని సూచించారు.

ఈ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా నిధులు అందజేస్తుంది. అభివృద్ధి పనుల నిమిత్తం ప్రతి గ్రామానికి రూ.20.38 లక్షలు అందజేస్తారు. దశలవారీగా గ్రామాలను గుర్తించి, అభివృద్ధి పనులు చేపడతారు. మొత్తం గ్రామాలలో ప్రతి సంవత్సరం ఐదో వంతు గ్రామాలను ఎంపిక చేస్తారు. ఈ పథకం కింద మొత్తం 36,428 గ్రామాలను గుర్తించగా తొలి రెండు సంవత్సరాలలో 16,554 గ్రామాలను (52%) ఎంపిక చేశారు. ఈ సంవత్సరం ప్రారంభం నాటికి 8,707 గ్రామాలకు గ్రామాభివృద్ధి ప్రణాళికలను ఆమోదించారు. రెండు సంవత్సరాల కాలంలో సమీకృత అభివృద్ధి ప్రణాళిక కింద గుర్తించిన గ్రామాలలో 24% గ్రామాలకు మాత్రమే అనుమతి ఇచ్చారని కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది.

కాలుష్య నియంత్రణ చేపడదాం

- ఉద్యోగులతో మంత్రి కొండ సురేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాలుష్య నివారణ కోసం ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఉద్యోగులు సహకరించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు. బుధవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగులు సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమది ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పారు. ప్రజలందరికీ ఆరు గ్యారెంటీలు అందిస్తామన్నారు. సమ్మక్క సారక్క జాతరలో ప్లాస్టిక్ కాలుష్యం లేకుండా చర్యలు తీసుకుంటామనీ, నాలాల్లో చెత్త పడేయకుండా ప్రజల్లో చైతన్యం తేవాలని అన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల డైరీకి ఆమె సందేశం అందించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం కార్యనిర్వహక సభ్యులు శ్రీవాత్సవ, కపానంద్, నరేందర్ గిసా స్వప్న పాల్గొన్నారు.

రేపు మేడిగడ్డకు మంత్రుల బృందం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కుంగిన మేడిగడ్డ బ్యారేజ్‌ను శనివారం మంత్రుల బృందం పరిశీలించనుంది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో ఈ బృందం అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌లను కూడా పరిశీలిస్తుంది. మేడిగడ్డ కుంగుబాటుకు దారితీసిన పరిస్థితులతో పాటు అన్నారం, సుందిళ్ల సహా మొత్తం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మేడిగడ్డ బ్యారేజ్ వద్దే పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వాలని ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను మంత్రి కోరారు. దానికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కవరేజ్ కోసం మీడియా బృందాన్ని హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సుల్లో మంత్రులు తమ వెంట తీసుకెళ్తున్నారు.

ఎల్ఐసీకి బంఫర్ లాభాలు

బిజినెస్

- ఈక్విటీల్లో రూ.2.3 లక్షల కోట్ల రాబడి
- 2023లో అనేక స్టాక్స్‌లో రెండంకెల రిటర్న్స్

ముంబయి : ప్రభుత్వ రంగ దిగ్గజ బీమా సంస్థ ఎల్ఐసీ అదిరిపోయే లాభాలను సాధించింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ల పోర్టుపోలియోలో పెట్టిన పెట్టుబడులపై 2023లో ఏకంగా రూ.2.8 లక్షల కోట్లు ఆర్జించింది. ఇటీవల దలాల్ స్ట్రీట్ దూసుకుపోతున్న నేపథ్యంలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) లాభాలు కూడా అమాంతం పెరిగాయి. గతేడాది డిసెంబర్ ముగింపు నాటికి ఎల్ఐసీ మార్కెట్ హోల్డింగ్ పెట్టుబడులు రూ.9.61 లక్షల కోట్లుగా ఉండగా.. అవి ప్రస్తుతం రూ.11.89 లక్షల కోట్లకు చేరుకున్నాయని ఏస్ ఈక్విటీ గణంకాలు వెల్లడించాయి. 260 లిస్టెడ్ కంపెనీల్లో ఎల్ఐసి పెట్టుబడులను కలిగి ఉంది. ఎల్ఐసి వాటా, స్టాక్‌ల ప్రస్తుత మార్కెట్ ధర ఆధారంగా మార్కెట్ విలువ లెక్కించబడిందని ఏస్ ఈక్విటీ పేర్కొంది.

ఏడాదికేడాదితో పోల్చితే ఈ ఏడాదిలో నిఫ్టీ-50 ఏకంగా 19 శాతం రిటర్న్‌లు ఇచ్చింది. మార్చిలో దాదాపు 52 వారాల కనిష్టానికి పడిపోయినప్పటికీ.. ఆ తర్వాత 28 శాతం ర్యాలీ చేసి బుధవారం 21,655 పాయింట్లకు చేరింది. 2023లో ఇప్పటి వరకు ఎల్ఐసి నిఫ్టీ 50 స్టాక్స్‌లో 40 సూచీలు కూడా 86 శాతం వరకు రెండంకెల లాభాలతో రిటర్న్స్‌ను ఇచ్చాయి. కోల్ ఇండియా, లర్సన్ అండ్ టర్బో, బజాజ్ ఆటో, టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ స్టాక్స్ అధిక లాభాలను అందించిన వాటిలో ఉన్నాయి.

ఎన్‌టీపీసీ..

దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎన్‌టీపీసీలో ఎల్ఐసీ పెట్టుబడులను రూ.2,400 కోట్లు పెంచింది. ఈ సూచీ 86 శాతం లాభపడింది. ప్రభుత్వ రంగ సూచీల్లో భారీ ర్యాలీ చేసి.. డిసెంబర్‌లో ఆల్‌టైం గరిష్ట స్థాయికి చేరింది. బొగ్గు ఉత్పత్తి దిగ్గజ సంస్థ కోల్ ఇండియా సూచీ 63 శాతం పెరిగింది. ఇందులో ఎల్ఐసి పెట్టుబడుల విలువ ఒక సంవత్సరంలోనే 58 శాతం పెరిగి రూ.24,087 కోట్లకు చేరుకుంది.

ఎల్‌అండ్‌టీ మద్దతు

ఎల్ఐసి ఖజానా నింపిన స్టాక్స్‌లో లర్సన్ అండ్ టర్బో (ఎల్‌అండ్‌టీ) మూడో స్థానంలో ఉంది. ఈ దిగ్గజ మౌలిక వసతుల కంపెనీ షేర్ 2023లో 67 శాతం పెరిగింది. ఇందులో ఎల్ఐసి హోల్డింగ్ విలువ 46 శాతం పెరిగి రూ.52,786 కోట్లకు చేరింది. ఎల్ఐసి అధిక లాభాలందించిన స్టాక్స్‌లో టాటా మోటార్స్ కూడా ఉంది. 2023లో ఈ సూచీ 85 శాతం లాభపడింది. ఈ స్టాక్‌లో ఎల్ఐసీ రూ.13,519 కోట్ల పోర్టుపోలియో పెట్టుబడులు కలిగి ఉంది.


మరో 21 స్టాక్స్‌ల్లో..

ఎల్ఐసీ పెట్టుబడులు కలిగిన మరో 21 స్టాక్స్ 2023లో 328 శాతం రాబడులను ఇచ్చాయి. బీఎస్ఈలో పలు స్టాక్స్ మూడు రెట్లు పెరిగాయి. ఆ సూచీల్లోని ఎల్ఐసి పెట్టుబడులకు భారీగా రిటర్న్స్ వచ్చాయి. స్మాల్ క్యాప్ సెగ్మెంట్‌లో సుజ్లాన్ ఎనర్జీ 250 శాతం పెరిగింది. ఇందులోనూ ఎల్ఐసీ పెట్టుబడులు మూడు రెట్లు పెరిగి రూ.519 కోట్లకు చేరాయి. రైల్ వికాస్ నిగమ్ సూచీ 160 శాతం పెరగ్గా.. ఇందులో ఎల్ఐసి హోల్డింగ్స్ 2 రెట్లు పెరిగి రూ.2,076 కోట్లకు చేరాయి. 2024లోనూ భారీ లాభాలు కొనసాగవచ్చని అనేక ఫండ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

అపర్ణ 17 డిగ్రీస్ నార్త్ క్లబ్‌లో వేడుకగా క్రిస్మస్

హైదరాబాద్ : ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ తన 17 డిగ్రీస్ నార్త్ క్లబ్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించినట్టు తెలిపింది. లైవ్ కన్సర్ట్‌తో ఒక కొత్త వేదికను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ వేడుకల్లో 17 డిగ్రీస్ నార్త్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఆపరేషన్స్ రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ క్లబ్ కేవలం మరో రొటీన్ క్లబ్ కాదని.. కొత్త జీవన విధానానికి నాంది అన్నారు. అత్యంత ప్రముఖ వ్యక్తులతో జాగ్రత్తగా ఏర్పాటుచేసిన కమ్యూనిటీ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఇప్పటికే పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్టు వివరించారు.

టెక్నో స్మార్ట్‌ఫోన్‌ల బ్రాండ్ అంబాసిడర్‌గా దీపికా



న్యూఢిల్లీ : ప్రీమియం గ్లోబల్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ అయిన టెక్నో కొత్తగా సూపర్ స్టార్ దీపికా పదుకొణెని తన బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. తమ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నవీన ఆవిష్కరణలను తీసుకురావాలనే నిబద్దతో పాటు తమ బ్రాండ్ బలోపేతానికి ఇది దోహదం చేయనుందని టెక్నో మొబైల్స్ సీఈఓ అరిజీత్ తలపాత్ర పేర్కొన్నారు. టెక్నోతో భాగస్వామ్యం సంతోషంగా ఉందని దీపిక పేర్కొంది.

ఒకే వేదికపై 500పైగా రకాల స్వీట్స్

- కలనరీ అకాడమీలో ప్రదర్శన



హైదరాబాద్ : ఒకే వేదికపై దాదాపు 500పైగా రకాల భారతీయ స్వీట్స్‌ను ప్రదర్శించారు. నగరంలోని బేగంపేటలోని కలనరీ అకాడమీ ఆఫ్ ఇండియాలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా భారీ స్థాయి లో స్వీట్స్‌ను తయారు చేసి వీక్షకులను ఆశ్చర్యపోయేలా చేశారు. 350 మంది విద్యార్థులు, పాకశాస్త్ర నిపుణులు 72 గంటల పాటు శ్రమించి వీటిని తయారు చేశారని కలనరీ అకాడమీ ఆఫ్ ఇండియా చెఫ్ అక్షయ్ కులకర్ణి తెలిపారు.

చివరి ఇంటి వరకు పథకాలు చేరుస్తాం

- గత ప్రభుత్వం అనేక హామీలను ఎగ్గొట్టింది
- ప్రజా పాలనలో గ్రామాల చెంతనే అధికారులు

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని తప్పకుండా నెరవేరుస్తామని, ప్రతి చివరి ఇంటి వరకు ప్రభుత్వ పథకాలు చేరే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. రాష్ట్రంలో నూతన ప్రజా పాలన ప్రారంభమైందని ప్రజల సర్వతోముఖాభివృద్ధి కోసమే ఈ నెల 28 నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నామని చెప్పారు. బుధవారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆమె కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం అనేక హామీలు గుప్పించి వాటిని ఎగ్గొట్టిందని విమర్శించారు. నిరుద్యోగభృతి, పోడు భూములకు హక్కుపత్రాలు, అసైన్డ్ భూములకు హక్కులు, రుణమాఫీతో పాటు కేంద్రం చెప్పిన 2కోట్ల ఉద్యోగాలు అమలు చేయలేదని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జోడెద్దుల్లా పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. ఎన్నికల వరకే రాజకీయాలు అని.. ప్రస్తుతం ప్రభుత్వానికి ప్రజలంతా ఒకటేనని స్పష్టంచేశారు. ప్రభుత్వం గురువారం నుంచి ప్రజాపాలన పేరిట ఆరు గ్యారంటీ పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటుందని చెప్పారు. అధికారులే గ్రామాలకు వచ్చి ప్రజల నుంచి వీటిని స్వీకరిస్తారని, దరఖాస్తులు ముందుగానే పూరించి అధికారులకు అందజేస్తే బాగుంటుందని వివరించారు. ఎవరైనా తమ గ్రామానికి రాలేదని ఇబ్బందులు పడకూడదని, మండల కార్యాలయాల్లోనూ అందజేసేందుకు వీలుంటుందని చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే సమస్యలు గుర్తించామని, వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆదివాసీల పోడు భూములకు హక్కుపత్రాలు అందిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

విలేకరులు ఉద్యమకారులే..!

విలేకరులు కూడా ఉద్యమకారులేనని, వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క చెప్పారు. జర్నలిస్టులకు సంబంధించి 250 గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం పరిశీలన చేస్తోందని వివరించారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, గడ్డం వినోద్, ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీని ప్రకటించాలి

- శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కు డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంత్రులు డి శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని తెలిపారు. మిగిలిన 15 వేలు పోస్టులను కలిపి 20 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని ప్రకటించాలని కోరామన్నారు. మెగా డీఎస్సీ ప్రతిపాదన ప్రభుత్వం దృష్టిలో ఉందనీ, కొంత సమయం తీసుకుని నోటిఫికేషన్‌ను జారీ చేస్తామంటూ మంత్రులు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం సభ్యులు హరీశ్, ఆదిత్య శ్రీనివాస్, శ్రీనునాయక్, స్వప్న, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి వినతి

15 వేల ఉపాధ్యాయ పోస్టులను కలిపి డీఎస్సీ అనుబంధ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కోరుతూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనను బుధవారం తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాతపరీక్షల తేదీలను ప్రకటించాలనీ, ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోరారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులతో ముడిపెట్టకుండా మెగా డీఎస్సీని ప్రకటించాలని సూచించారు. డీఎస్సీపై ప్రభుత్వంలో చర్చలు జరుగుతున్నాయనీ, ముఖ్యమంత్రితో సమీక్ష తర్వాత నిర్ణయం తీసుకుంటామని బుర్రా వెంకటేశం హామీ ఇచ్చారని తెలిపారు.

రెజ్లర్లతో రాహుల్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం ఉదయం హర్యానాలోని ఝజ్జర్ జిల్లాలోని వీరేంద్ర ఆర్య అఖారాలో పర్యటించారు. అక్కడ బజరంగ్ పునియాతో సహా మల్లయోధులతో సంభాషించారు. రెజ్లింగ్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఎఫ్ఐ)పై తాజా వివాదం మధ్య ఆయన పర్యటించటం గమనార్హం..

డబ్ల్యూఎఫ్ఐ కొత్త అధ్యక్షుడు సంజయ్ సింగ్ ఈ ఏడాది చివరి నాటికి అండర్-15, అండర్-20 నేషనల్స్‌కు ఆతిథ్యం ఇస్తున్నట్టు ప్రకటించిన తర్వాత క్రీడా మంత్రిత్వ శాఖ డబ్ల్యూఎఫ్ఐని సస్పెండ్ చేసింది. డబ్ల్యూఎఫ్ఐ మాజీ ప్రెసిడెంట్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన రెజ్లర్లు సంజయ్ సింగ్ బ్రిజ్ భూషణ్‌కు చాలా సన్నిహితుడు కాబట్టి సంజయ్ సింగ్ ఎన్నికపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా సాక్షి మాలిక్ రెజ్లింగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు. బజరంగ్ పునియా అతని పద్మశ్రీని వాపసు చేశారు. వినేష్ ఫోగట్ సైతం ఆమె ఖేల్ రత్న, అర్జున అవార్డును తిరిగి ఇస్తున్నట్టు ప్రకటించారు. రాహుల్ గాంధీ తనతో వ్యాయామం చేశారనీ, కుస్తీ పట్టేందుకు ప్రయత్నించారని బజరంగ్ పునియా చెప్పారు. రాహుల్ గాంధీ తమతో యూట్యూబ్ ఛానెల్ కోసం అకారా వద్ద వీడియోను చిత్రీకరించారనీ, మల్లయోధుడి రోజువారీ జీవితం ఎలా ఉంటుందో చూడటానికి ఆయన వచ్చాడని తెలిపారు.

రాహుల్ గాంధీ ఉదయం 6.15 గంటలకు అఖారాకు చేరుకున్నారని కోచ్ వీరేంద్ర ఆర్య చెప్పారు. రాహుల్ గాంధీ పర్యటన గురించి తమకు తెలియదన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించండి

- ఉప ముఖ్యమంత్రికి టీపీజేఎంఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ ప్రయివేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాల సంఘం (టీపీజేఎంఏ) అధ్యక్షులు గౌరి సతీశ్ నేతృత్వంలో కలిశారు. రాష్ట్రంలో ఫీజు బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సమీక్ష నిర్వహించి బకాయిలను విడుదల చేసేందుకు ప్రయత్నిస్తామంటూ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీజేఎంఏ హైదరాబాద్ నాయకులు అహ్మద్, పహిల్వాన్, అక్రం తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశ్‌ను గౌరి సతీశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంటర్మీడియెట్ విద్యావ్యవస్థ, ప్రయివేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాల సమస్యలపై చర్చించామని తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

ముఠా నాయకుడిలా రేవంత్‌రెడ్డి మాటలు

ఆరు గ్యారంటీలపై చిత్తశుద్ధి ఏదీ? : దాసోజు శ్రవణ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రేవంత్‌రెడ్డి సీఎంలాగా కాకుండా ఓ ముఠా నాయకుడిలా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ ఆరోపించారు. గత ప్రభుత్వం ఏడుపు ఆపి ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా పాలన పేరిట కొత్తగా దరఖాస్తుల స్వీకరణ టైంపాస్ కోసమేనని విమర్శించారు. తెల్లరేషన్ కార్డులున్నవారికే సంక్షేమ పథకాలు అని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు.ఖజానాలో లంకె బింద ఉండదదనీ, తెలంగాణ మొత్తం లంకె బిందనే అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేతపత్రాలు పెట్టి అబాసుపాలైందని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలపై ఆరోపణలు చేసేముందు తాము అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ ఎన్ని లక్షల కోట్ల రూపాయలు వెనక్కి వేసుకున్నారని నిలదీశారు.

జస్టిస్ కొండా మాధవ రెడ్డి జీవితం యువతరానికి స్ఫూర్తిదాయకం : ఉపరాష్ట్రపతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దివంగత జస్టిస్ కొండా మాధవ రెడ్డి జీవితం యువతరానికి స్ఫూర్తిదాయకమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ తెలిపారు. దివంగత జస్టిస్ కొండా మాధవరెడ్డి 100వ జయంతిని పురస్కరించుకుని ఆయన గౌరవార్థం ప్రత్యేక పోస్టల్ కవర్‌ను హైదరాబాద్‌లోని గగన్‌మహల్‌లో ఏవీ కళాశాలలో బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, పుదుచ్చేరి గౌరవ లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ మాట్లాడుతూ కొండా మాధవరెడ్డి ఆంధ్రప్రదేశ్, బాంబే హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా పని చేశారని తెలిపారు. ఆయన్ను ఎప్పుడూ కలవకపోయినా ఆయన గురించి బాగా తెలుసన్నారు. న్యాయ, విద్యా వ్యవస్థలో శాశ్వతమైన కృషి చేసిన దూరదృష్టి కలిగిన వ్యక్తి అన్నారు. మృదుస్వభావి, ఆలోచనాపరుడని పేర్కొన్నారు. విలువలతో జీవించాలి, విలువలను సృష్టించాలని తన జీవితం ద్వారా చాటారన్నారు. న్యాయ వ్యవస్థతో ఉన్న అనుబంధం కారణంగానే కాకుండా తన మూలాలను మరచిపోని వ్యక్తిగా చరిత్రలో నిలిచారన్నారు. సేవ, న్యాయం, కరుణ.. ఇవి సమగ్ర సమాజం, శక్తివంతమైన ప్రజాస్వామ్యానికి పునాది అని ఉపరాష్ట్రపతి తెలిపారు. దశాబ్ద కాలంగా న్యాయవ్యవస్థ గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ ద్వారా డిజిటలైజేషన్‌తో పారదర్శకత పెరిగి పెండింగ్ కేసుల తగ్గుదలకు దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే, భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి, తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ రాంచంద్రారెడ్డి, వీఆర్ రెడ్డిబీ జస్టిస్ ఎంఎస్కే జైస్వాల్, జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఛైర్మెన్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పలువురు సిట్టింగ్, రిటైర్డ్ న్యాయమూర్తులు, న్యాయవాద సంఘాల సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

వందమందికో కౌంటర్...

- ప్రజాపాలన సక్సెస్ చేయండి
- కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి టెలికాన్ఫరెన్స్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలు, 3,626 మున్సిపల్ వార్డులు సహా మొత్తం 16,395 ప్రదేశాలలో ప్రజాపాలన సదస్సులు నిర్వహించేందుకు 3,714 బృందాలను ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. బుధవారంనాడామె కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాపాలన సక్సెస్ చేసేందుకు ఉద్యోగులంతా సంపూర్ణంగా సహకరించాలని చెప్పారు. గ్రామ సభలు ఉదయం 8 గంటలకే ప్రారంభమయ్యేలా.జాగ్రత్తలు తీసుకోవాలనీ, మహిళలు, పురుషులకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి వందమంది దరఖాస్తుదారులకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేయాలన్నారు.

పథకాలు అందరికీ చేరువయ్యేందుకే..

- వికసిత్ భారత్ సంకల్ప యాత్ర
- గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్



నవతెలంగాణ-ఓయూ

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ చేరువచేసేందుకే వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్టు గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. బుధవారం తెలంగాణలోని వివిధ జిల్లాల్లోని పట్టణ ప్రాంతాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభమైంది. ఈ మేరకు తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ హైదరాబాద్‌లోని లాలాపేట్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందించే వీడియో వ్యాన్‌ను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు కష్ట పడకుండా ఉండాలని పీఎం ఉజ్వల యోజన ద్వారా వంట గ్యాస్, ఆయుష్మాన్ భారత్ ద్వారా నిరుపేదలకు ఉచితంగా వైద్య సదుపాయం కల్పించారన్నారు. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వ సమాచారంతో కూడిన ఐఈసీ మెటీరియల్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. లాలాపేట్ మున్సిపల్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన వివిధ కేంద్ర ప్రభుత్వ స్టాళ్లను గవర్నర్ సందర్శించారు.

నిజామాబాద్ నుంచి.. ప్రధాని పోటీచేస్తే ఆహ్వానిస్తా

- బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్

నవతెలంగాణ-ఆర్మూర్

నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పోటీ చేస్తే ఆహ్వానిస్తానని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో రైల్వే పనులను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై వచ్చిన ఆరోపణలు నిజమైతే తప్పకుండా జైలుకు పంపిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ఓబీ పనులకోసం కేంద్ర ప్రభుత్వం డిపాజిట్ చేసిన రూ.15 కోట్ల నిధులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని ఆరోపించారు.

సరకు రవాణాలో రికార్డు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే రికార్డు సాధించింది. కేవలం 8 నెలల 26 రోజుల్లో వంద మిలియన్ టన్నుల లోడింగ్‌ను అధిగమించినట్టు ఆ సంస్థ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆపరేషన్స్ అండ్ కమర్షియల్ విభాగం ఉద్యోగులను అభినందించారు.

ఫిబ్రవరిలో తెలుగు వర్సిటీ 16వ స్నాతకోత్సవం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవాన్ని ఫిబ్రవరి మూడో వారంలో నిర్వహించనున్నట్టు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్, వర్సిటీల చాన్సలర్ తమిళిసై సౌందరరాజన్ పాల్గొంటారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ సందర్భంగా విద్యార్థులకు ఎంఫిల్, పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేస్తారని తెలిపారు. ఆయా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలను అందిస్తారని పేర్కొన్నారు. ఈ స్నాతకోత్సవంలో గత మూడేండ్లలో వర్సిటీ నిర్వహించిన వివిధ కోర్సుల పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు డిగ్రీ సర్టిఫికెట్లు పొందుతారని తెలిపారు.

డీఎంకే నేత వ్యాఖ్యలు సరిగాదు

- దేశ సమైక్యతను అస్థిరపరిచే యత్నం : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యూపీ, బీహార్ నుంచి హిందీ మాట్లాడేవాళ్లు తమిళనాడుకు టాయిలెట్లు కడిగేందుకు వస్తారని డీఎంకే నేత వ్యాఖ్యానించడం అత్యంత దురదృష్టకరమనీ, ఆక్షేపణీయమని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. అవకాశం దొరికినప్పుడల్లా భారతదేశ సమైక్యతను అస్థిరపరిచేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి ప్రయత్నిస్తూనే ఉందని విమర్శించారు. సనాతన ధర్మానికి, హిందుత్వం, హిందీ మాట్లాడే ప్రజలకు కాంగ్రెస్ నేతృత్వంలోని పనికిరాని కూటమి ప్రమాదకరంగా మారుతోందని విమర్శించారు. బుధవారం ఈ మేరకు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖను విడుదల చేశారు. మొదటి నుంచీ కాంగ్రెస్ ఇదే ధోరణితో ముందుకెళ్తున్నదని పలు ఉదహరణలతో వివరించారు.

క్యులినరీలో శిక్షణ పొంది ఉద్యోగాలు పొందటం ఆనందకరం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

క్యులినరీ అకాడమీలో శిక్షణ పొంది ప్రపంచ వ్యాప్తంగానూ మంచి ఉద్యోగాలు సంపాదించడం ఆనందకరమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇలాంటి స్కిల్ ఇనిస్టిట్యూట్‌లను రాష్ట్ర వ్యాప్తంగానూ ప్రోత్సహించాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో క్యులినరీ ఎడ్యుకేషన్ గ్లోబల్ బ్రాండ్ ఆధ్వర్యంలో స్వీట్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. కిలినరీ ఎడ్యుకేషన్ సంస్థ విద్యార్థులు తయారుచేసిన కొత్తరకం స్వీట్ వంటకాలను డిప్యూటీ సీఎం రుచి చూశారు. వాటి తయారీ వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రూపుమాపడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందనీ, అందుకోసం ఇలాంటి సంస్థలను అధ్యయనం చేసి, పలు రకాల స్కిల్ కోర్సులు ప్రవేశపెట్టి నిరుద్యోగ యువకులు దేశ విదేశాల్లోని ఉద్యోగాలు పొందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కోడ్ చైన్ సిస్టంలో డెవలప్ చేసి వండిన ఆహార పదార్థాలు నిల్వ ఉంచడానికి కోల్డ్ స్టోరేజ్‌లను రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. క్యులినరి అకాడమీ ఆఫ్ ఇండియా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు.

నవతెలంగాణ

7

ఎల్బీనగర్ -మహేశ్వరం- చార్మినార్

గురువారం | డిసెంబర్ 28, 2023 | www.navatelangana.com

నేడు డయల్ యువర్ డీఎం



నవతెలంగాణ - హయత్ నగర్
ఆర్టీసీ ప్రయాణికుల నుండి సలహాలు, సూచనలు, సమస్యలు వినేందుకు గాను నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ హయత్ నగర్ -2 డిపోలో ఈ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం 4:00గంటల నుండి 5:00గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంట్లో హయత్ నగర్, ఎన్జీవోస్ కాలనీ పరిసర ప్రాంత ప్రయాణికులు పాల్గొని, ఫోన్ నెంబర్ 9959226419ను సంప్రదించి, విలువైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలసిన కొసనం



నవతెలంగాణ - హయత్‌నగర్
ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి మూడో సారి దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా హస్తినాపురంలో బుధవారం కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. మన్సూరాబాద్ బీఆర్ఎస్ మహిళ అధ్యక్షురాలు కొసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి..ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటా

• ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి
ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించిన ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ ఆధ్వర్యంలో ఆర్కేపురం కార్యకర్తలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను దశల వారీగా పూర్తి చేస్తానని భరోసా ఇచ్చారు. వారంలో మూడు రోజులు కార్యకర్తల ఇంటి వద్దకు వెళ్లి, వారిని కలుసుకొని సమస్యలను తెలుసుకుంటానని చెప్పారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి, భారీ మెజార్టీతో గెలిపించుకుందామని అన్నారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, లింగ స్వామి గౌడ్, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, జాహిద్, జగన్, బాలు శ్రీ, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, వాజిద్ పటేల్, రమేష్, శ్రీకాంత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

మహాపడి పూజలో మేయర్ పారిజాత



నవతెలంగాణ- బడంగ్ పేట్
మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని 2వ డివిజన్ కార్పొరేటర్ జెనిగే పద్మ ఐలయ్య స్వగృహంలో బుధవారం అయ్యప్పస్వామి మహాపడి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలో కార్పొరేటర్లు నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, ముత్యాల లలిత కృష్ణ, బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి, సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి, గౌర రమాదేవి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



నవతెలంగాణ - హస్తినాపురం
హస్తినాపురం డివిజన్ పరిధిలోని హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట చంపాపేట్ కార్పొరేటర్ వంగ మధు సూదన్ రెడ్డి, స్థానిక నాయకులు గోపి రెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి, రామచందర్ నాయక్‌లు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ - బడంగ్‌పేట్
మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న శ్రీ విద్యా టౌన్ షిప్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిగిరింత నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. కాలనీలోని ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ పరిశీలనలో కందుకూరు మండల వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్ రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-సీటీ బ్యూరో
వికాసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళసై సౌందర్య రాజన్ ప్రారంభించారు. ఈ మేరకు బుధవారం గవర్నర్‌ను ఆయుష్మాన్ భారత్ స్టాల్ వద్ద ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ నరేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ జైశ్రీ, శ్రీకల, డిస్టిక్ మేనేజర్ ఆరోగ్య మిత్ర టీం తదితరుల పాల్గొన్నారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

• ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ -ఎల్బీనగర్
అభయహస్తం 6 గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఈ నెల 28(నేటి) నుంచి జనవరి 6 వరకు ఉంటుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తంలో భాగంగా బుధవారం జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఆరు పథకాల్లో భాగంగా మహాలక్ష్మీ, గృహజ్యోతి, రైతు భరోసా, యువ వికాసం, చేయూత, ఇందిరమ్మ ఇండ్లు పథకాల కోసం తెల్ల రేషన్ కార్డు ఉన్న వారు, లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. కావున అర్హులైన ఎల్బీనగర్ పేద ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్ల కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులు, పలు విభాగల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ స్తంభాలు వేయాలని వినతి



నవతెలంగాణ - ధూల్‌పేట్
విద్యుత్ ఇనుప స్తంభాలు మార్చి సిమెంట్ స్తంభాలు వేయాలని రవీందర్ నాయక్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ కృష్ణ నాయక్ కోరారు. ఈ మేరకు బుధవారం బంజారా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఫలక్‌నూమ ఏడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవీందర్ నాయక్ నగర్ కాలనీలో కొన్ని ఇనుప స్తంభాలు అప్పుడప్పుడు కరెంట్ షాక్ వస్తున్నాయన్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని స్తంభాలు పడిపోయే స్థితిలో ఉన్నాయని, వాటిని తొలగించాలని కోరారు. అధికారులు వెంటనే స్పందించి..సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కిషన్, శ్రీను, చత్రు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులు విధిగా దరఖాస్తు చేసుకోవాలి

కార్పొరేటర్ సుజాతా నాయక్



నవతెలంగాణ - హస్తినాపురం
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారు విధిగా దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేటర్ బి.సుజాతా నాయక్ అన్నారు. ఈ మేరకు బుధవారం కార్పొరేటర్ మాట్లాడుతూ నేటి నుండి జనవరి 6 వరకు ప్రజల నుండి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీ కమ్యూనిటీ హాల్ ఏఈ హేము నాయక్, పిండి నారాయణరెడ్డి కాలనీ కమ్యూనిటీ హాల్ టి.పి.ఎస్ శ్రీదేవి, అనుపమ నగర్ కమ్యూనిటీ హాల్ ఈ.ఈ కనకయ్య, నందనవనం డబ్లు.ఏ.ఓ విగ్నేశ్వర్‌లు ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు.. మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు అందుబాటులో ఉంటారని వివరించారు.



నవతెలంగాణ - చైతన్యపురి
శ్రీ సాయి శాంతి సహాయ సేవా సమితి, శ్రీహస్తిన మహిళా మండలి చైర్‌పర్సన్ ఎర్రం పూర్ణ శాంతి గుప్త ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన క్యాలెండర్‌ను బుధవారం సీల్ వెల్ కంపెనీ అధినేత బండారు సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ చొకాస్ కంపెనీ అధినేత్రి హిమ బిందు పాల్గొన్నారు.

ప్రజా పాలన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ- బడంగ్‌పేట్
మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఈ నెల 28 నుండి తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న ప్రజాపాలన ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందితో కలిసి మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేవిధంగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ సుమన్ రావు, డీఈఈ జ్యోతి రెడ్డి, ఏఈఈ వినీల్ గౌడ్, మేనేజర్ నగేష్ బాబు, ఆర్.ఓ. చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చలో పార్లమెంట్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - తుర్కయంజాల్
దేశ విద్యారంగ పరిరక్షణ కోసం చలో పార్లమెంట్ వాల్ పోస్టర్‌ను రగన్నగూడలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించినట్లు ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి. శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 12న దేశవ్యాప్తంగా 16 విద్యార్థి సంఘాలను కలుపుకొని చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దేశంలో విద్యారంగ పరిరక్షణకు విద్యారంగాన్ని కాపాడాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, అందరికీ విద్య, ఉపాధి కల్పించాలని ,జాతీయ స్థాయి మెడికల్ టెస్ట్ నీట్ రద్దు చేయాలని కోరారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం..
కేంద్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తుందని రద్దు చేయాలని, జాతీయస్థాయి పోటీ పరీక్షలను ఈ సంస్థ నిర్వహించడం ద్వారా విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

ప్రభుత్వ యూనివర్సిటీలను నీరు కార్చే కుట్ర..
దేశంలోని కేంద్ర విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాలు కల్పనకు కనీసం నిధులు కేటాయించడం లేదన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా బహుళ జాతి కంపెనీ ప్రైవేట్ యూనివర్సిటీలను ఆహ్వానిస్తూ.. ప్రభుత్వ యూనివర్సిటీలను నీరు కార్చే కుట్ర చేస్తుందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 7800 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్, ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్‌కు డైట్ బిల్లులు సకాలంలో ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ



విమర్శించారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో మతోన్మాద భావజాలాలను జొప్పిస్తూ విద్యారంగాన్ని కాషాయికరణ చేస్తుందని ఆరోపించారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాలల్లో జాతీయ ఉద్యమ నాయకుల చరిత్రను తొలగించి.. జాతీయ ఉద్యమంతో సంబంధంలేని గాడ్సే, వీడి సావర్కర్ చరిత్రలను పొందపరుస్తున్నారని ఆరోపించారు. జ్యోతిష్యం, వాస్తు వంటి ఆశాస్త్రీయ భావజాలాలను విద్యార్థుల మెదడులో ఎక్కిస్తూ మొద్దు పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ఎన్‌టీఏ వంటి సంస్థలను యూనివర్సిటీకి సరిపడా నిధులు కేటాయించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల ఆకాంక్షకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. గత ప్రభుత్వం మాదిరిగానే నియంతృత్వ పోకడలకు పోతే విద్యార్థులు సరైన రీతిలో స్పందించి తీరుతారని హెచ్చరించారు. ఈ ఆవిష్కరణలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం చరణ్, జిల్లా కమిటీ సభ్యులు మీసాల స్టాలిన్, తరంగ్, వేణు, నాయకులు వంశీ పాల్గొన్నారు.

'మలబార్ గోల్డ్'లో డైమండ్ షో ప్రారంభం



నవతెలంగాణ - చైతన్యపురి
దిల్‌సుఖ్‌నగర్‌లోని మలబార్ గోల్డ్ డైమండ్ షోరూంలో డైమండ్ షోను బుధవారం మలబార్ గోల్డ్ డైమండ్స్ ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం హెడ్ రదిష్ కుమార్ మాట్లాడుతూ ఈ డైమండ్ షోలో రోజు ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు, ప్లాటినం ఆభరణాల సముదాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27 నుండి 31 వరకు ప్రత్యేక వజ్రాభరణ ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో భాగంగా పాత డైమండ్ ఆభరణాల మార్పిడిపై వినియోగదారులు 100 శాతం విలువని పొందవచ్చని, కొత్తగా కొనుగోలు చేసిన డైమండ్ విలువపై 25 శాతం వరకు తగ్గింపు లభిస్తుందని తెలిపారు. 22 క్యారెట్ల పాత బంగారం మార్పిడి పై జీరో శాతం తగ్గింపును పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో అమూల్య, పూజ, ఇంద్రజ, ఝాన్సీ, చందన, పుష్ప, మార్కెటింగ్ హెడ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనను విజయవంతం చేయాలి



• చైర్మన్ అబ్దుల్లా సాది

నవతెలంగాణ - బడంగ్‌పేట్
రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరిగే ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది కోరారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది అధ్యక్షతన బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం 6 గ్యారెంటీలను అమలు చేయడానికి గ్రామ సభలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వసంత, డీఈఈ వెంకన్న, ఏఈ, వైస్ చైర్మన్ సయ్యద్ యూసుఫ్ పటేల్, కౌన్సిలర్లు, మేనేజర్ సుదర్శన్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ జూబ్లీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చదువుకున్న అటామిక్ ఎనర్జీ సెంట్రల్ స్కూల్స్‌లో నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ కార్యక్రమానికి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్‌సీ చీఫ్ కోమల్ కపూర్, ఈసీఐఎల్ కంపెనీ చీఫ్, స్కూల్ యాజమాన్యం, టీచర్స్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత ఆశీర్వాదం తీసుకున్న లలితాయాదవ్



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్ నగర్ కార్పొరేటర్ మేక లలితాయాదవ్ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్సీ కవితను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. బుధవారం కార్పొరేషన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డిని కలిశారు. వారు లలితాయాదవుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ..ప్రజా సేవతోనే ఆత్మభిమానం పెరుగుతుందని, కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు.

నిర్మలా నగర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని నిర్మలానగర్ కాలనీకి 24ఈ,37 నెంబరు గల బస్సు సేవలను పునరుద్ధరించాలని సీపీఐ కాప్రా సమితి ఆధ్వర్యంలో కుషాయిగూడ బస్ డిపో సూపరింటెండెంట్ బాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీ.ఎస్. బోస్ మాట్లాడుతూ నిర్మలానగర్ కాలనీకి బస్సు రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిర్మలానగర్‌కు గత కొంత కాలంగా ఆర్టీసీ బస్సును నడపడం లేదన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, నిర్మలానగర్ స్థానికులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

ఆధ్యాత్మికతతోనే ప్రతీ విషయంలో సానుకూల దృక్పథం బలపడుతుందని, దీనికి కేంద్రాలైన ఆలయాలను అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మౌలాలి కృష్ణానగర్‌లోని శ్రీరంగగిరి రంగనాథ స్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాలకు ఆలయ ఫౌండర్ చైర్మెన్ ధనుంజయ ఆహ్వానం మేరకు బండారి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శ్రీరంగగిరిపై వెలసిన ఈ ఆలయంతో తమ కుటుంబానికి ఎంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. తన సోదరుడు బండారి రాజిరెడ్డి చొరవతోనే ఈ ఆలయం అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం బండారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆలయంలో మండపం విస్తరణ, శాశ్వత గోశాల నిర్మాణం అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చిన లక్ష్మారెడ్డికి ధనుంజయ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్లు ప్రభుదాస్, దేవేందర్ రెడ్డి, చేతన మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, జంపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో కాంగ్రెస్‌ను గెలిపిద్దాం : పరమేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి గడ్డపై మరోసారి కాంగ్రెస్ జెండా ఎగుం'వేద్దామని కాంగ్రెస్ ఉప్పల్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి గడ్డా.. కాంగ్రెస్ అడ్డా అని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం హెచ్ బీ కాలనీ డివిజన్ వెంకటేశ్వర నగర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి గెలిచిన సిట్టింగ్ స్థానం కావడంతో గెలుపు తథ్యం అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జలగం వెంకటేష్, సీతారాం రెడ్డి, కొలపాక అంజన్న, శ్రీనివాస్, శ్రవణ్ గౌడ్, వెంకట్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, సురేష్, వెంకటేష్, ఉదయ్, సురేష్ గౌడ్ ,అప్పారావు, శివ, నరేందర్, శ్రీకాంత్, వేణు పాల్గొన్నారు.

వికలాంగుల సమాఖ్యకు రూ.5వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాప్రా

ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాప్రా టౌన్ వికలాంగుల సమాఖ్య వారికి రూ.5వేలను అంకాలప్ప నర్సింహకు కమలానగర్ స్ఫూర్తి సభ్యులు పజ్జూరి పావనీరెడ్డి, వంజరి ప్రవీణ్ చేతుల మీదుగ అందజేశారు. వికలాంగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు.

ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణకు కార్యాలయాల ఏర్పాటు



- పరిశీలించిన కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, అధికారులు

నవతెలంగాణ-కాప్రా

నేటి నుంచి జనవరి 6 వరకు నిర్వహించబోయే ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణకు ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన కార్యాలయాలను కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ప్రజలు తమ దరఖాస్తులను ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.

నేటి నుంచి 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి
- ప్రతిపక్ష నేతలు సహకరిస్తారా..?
- విధివిధానాలపై అధికారుల సూచనలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోంది. ప్రజల వద్దకే పాలన అన్నట్టుగా ముందుకు సాగుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు సిద్ధమైంది. ఆరు గ్యారంటీల అమలుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నేటి నుంచి 'ప్రజాపాలన'కు అన్ని గ్రామ పంచాయతీలు, వార్డుల్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అందరూ ప్రతిపక్ష ప్రజాప్రతినిధులే ఉండటంతో వారు ఈ కార్యక్రమానికి సహకరిస్తారా..? లేదా..? అనే సందిగ్ధం నెలకొంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజవర్గాలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్ మినహా మిగతా నాలుగు నియోజవర్గాలు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నాయి. జిల్లాలో 13 మున్సిపాల్టీలు, 4 కార్పొరేషన్లు, 61 గ్రామ పంచాయ తీలు ఉన్నాయి. 'అభయ హస్తం' దరఖాస్తుల స్వీకరణలో భాగంగా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో వార్డులు, గ్రామ పంచాయతీల్లో వార్డుల్లో దరఖాస్తులు స్వీరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో సర్కిల్‌లో ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించారు.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నేటి నుంచి అభయహస్తం గ్యారంటీ పథకాల కోసం లబ్దిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రతి నెలా 18 ఏండ్లు నిండిన మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయంతోపాటు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించనున్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా రైతులకు ఎకరాకు రూ.15వేలు సాయం అందించనున్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకంలో భాగంగా ఇండ్లు లేని అర్హులైన కుటుంబాలకు సాయం, అమరవీరులు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వను న్నారు. గృహజ్యోతి పథకంలో భాగంగా ప్రతి నెలా కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వనున్నా రు. చేయూత పథకం కింద నెలకు రూ.4వేలు, వికలాంగుల ఫించన్ రూ.6వేలు పొందేందుకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు దాదాపు అధికారులందరూ దరఖాస్తుల స్వీకరణ పనిలోనే నిమగ్నమై ఉండనున్నారు.

ప్రజాప్రతినిధులు సహకరిస్తారా..?

జిల్లాలో దాదాపు ఎక్కువ శాతం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులే ఉన్నారు. కాంగ్రెస్ ఇటీవలే అధికారంలోకి రావడంతో స్థానిక సంస్థలు, మున్సిపాల్టీ, కార్పొరేషన్ ఎన్నికలు జరగకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లాలోని నియోజకవర్గాల్లో అందరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. 13 మున్సిపాల్టీలు, నాలుగు కార్పొరేషన్లలోనూ బీఆర్ఎస్ వారే చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు, మేయర్లు, డిప్యూటీ మేయర్లుగా కొనసాగుతున్నారు. జెడ్పీ చైర్మెన్ కాంగ్రెస్ వ్యక్తి కాగా.. వైస్ చైర్మెన్ మాత్రం బీఆర్ఎస్ పార్టీ వ్యక్తి. ఇక ఐదు మండలాలకు గాను ముగ్గురు బీఆర్ఎస్, ఇద్దరు కాంగ్రెస్ జెడ్పీటీసీలు ఉన్నారు. ఎంపీపీలు సైతం బీఆర్ఎస్ వారే ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో దాదాపు 60కి పైగా గ్రామ పంచాయతీలు ఉండగా.. 70 శాతానికిపైగా బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచులు, ఉప సర్పంచులే కొనసాగుతున్నారు. ఏ ప్రభుత్వ పథకమైనా విజయవంతం కావాలంటే అధికారుల పాత్ర ఎంత ఉంటుందో.. ప్రజాప్రతినిధుల సహకారం కూడా అంతే అవసరం. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఉంటే సంక్షేమ పథకాల గురించి అధికారులు, కింది స్థాయి పార్టీ కార్యకర్తలకు సూచనలు, సలహాలు ఇస్తూ ఉంటారు. పథకాల పరిశీలన కూడా సులభతరం అవుతుంది. కానీ జిల్లాలో ఒక్క అధికార పార్టీ ఎమ్మెల్యే కూడా లేకపోవడంతో ఈ 'ప్రజాపాలన' కార్యక్రమానికి ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు సహకరిస్తారో..? లేదో..? వేచి చూడాలి.

ప్రజల చెంతకు ప్రజా పాలన

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- మేయర్ వెంకటట్ రెడ్డి
- పలు కార్యాలయాల్లో అవగాహనా సదస్సులు


జవహర్‌నగర్‌లో..


బోడుప్పల్ ..

నవతెలంగాణ-బోడుప్పల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రజలందరికీ అందే లా ప్రజా పాలనను ప్రజల చెంతకు చేరేందుకు అధికారులు కృషి చేయాలని పీర్జాదీగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ప్రజా పాలనపై బుధవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ఇస్లావత్ నమ్య, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్‌ల ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన లబ్దిదారులు 6 గ్యారంటీలు పొందేందుకు వార్డులో ప్రత్యేక కౌంటర్లకు ఏర్పాటు చేశామని తెలిపారు. అక్కడ తమ విన్నపాలను అందించాలని సూచించారు. ఇప్పటికే అందుకు సంబంధించిన షెడ్యూల్డ్ సమాచారాన్ని ప్రజలకు తెలియజేశామ న్నారు. నగర పరిధిలో ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా సమర్థవంతంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుదారునికి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి రోజు రెండు షిఫ్టులలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణ, మహాలక్ష్మి రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ప్రతి వార్డులో అవసరమైన మేర ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ముందుగానే దరఖాస్తు నింపుకొని డివిజన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌కు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సదావకాశన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మేనేజర్ జ్యోతి, పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..

గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం ప్రజాపాలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ప్రజా పాలన దరఖాస్తులను నేటి నుంచి వచ్చే నెల జనవరి 6వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 15 వార్డుల్లో కౌంటర్లు ఏర్పాటు చేసి ఆరు గ్యారంటీలపై కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, టీం లీడర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ దామన్నగారి ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ వి.రాములు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


మేడ్చల్ ఎంపీడీవో కార్యాలయంలో..

ఎంపీడీవో కార్యాలయంలో..

మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీర్లపల్లి రజితారాజమల్లారెడ్డి అధ్యక్షతన బుధవారం ప్రజా పాలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన దరఖాస్తులు గురువారం నుంచి వచ్చే నెల జనవరి 6వ తేదీ వరకు స్వీకరించినట్లు తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీలను రెండు విభాగాలుగా విభజించి ఒక విభాగానికి ఎంపీడీవో మరో విభాగానికి తహశీల్దార్‌ను టీం లీడర్‌గా నియమించినట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 12వరకు తిరిగి మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినిగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ శైలజ, జడ్పీటీసీ శైలజ విజయానందరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశం ,ఏవో అర్చన, ఎంపీవో రవి, కార్యదర్శిలు, పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో..

జవహర్ నగర్‌లో ప్రజా పాలనను పకడ్బందీగా నిర్వహిస్తామని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మేయర్ మేకల కావ్య అన్నారు. బుధవారం డ్వాక్రా భవన్‌లో ప్రజాపాలన పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరే టర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, అంగన్వాడీ, డ్వాక్రా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శామీర్‌పేటలో..

ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులైన వారికీ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని శామీర్ పేట ఎంపీపీ దాసరి ఎల్లుభాయి బాబు అన్నారు. బుధవారం శామీర్ పేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ప్రజాపాలన కార్యక్రమంపై ప్రతేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు ప్రజా పాలన కార్యక్రమంలో ఈ నెల 28వ తేదీ నుండి వచ్చే నెల 6వ తేదీ వరకు అర్హులైన వారి నుంచి ధరఖాస్తులు స్వీకరించాలని పేద, మధ్య తరగతి కుటుంబలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ ప్రజా ప్రతినిధులను, అధికారులను కోరారు. ప్రభుత్వ గ్యారంటీలైన పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి, దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిదులు అందరూ కలిసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అనితలాలయ్య, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీఓ మంగతాయారు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.


మేడ్చల్‌లో..


శామీర్‌పేటలో...

యువతి వివాహానికి పుస్తెమెట్టెలు అందజేత



నవతెలంగాణ-మేడ్చల్

మండల పరిధిలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన మలిగే రవీందర్ కూతురు రేవతి వివాహం సందర్భంగా మాజీ ఎంపీపీ పద్మాజగన్ రెడ్డి దంపతులు బుధవారం వారి కుటుంబ సభ్యులకు పుస్తెమట్టెలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి మల్లారెడ్డిలను స్ఫూర్తిగా తీసుకొని, తమ వంతు సాయంగా ఆడపిల్లల పెండ్లీలకు పుస్తె మెట్టలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ముప్పు శ్రీనివాస్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. శ్రీనివాస్ రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మెన్ శరత్ చంద్రారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ జడ్పీటీసీ ముప్పు రాంరెడ్డి, పంగ సంతోష్ తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రావల్‌కోల్‌లో ఘనంగా అయ్యప్ప పడిపూజ



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రావల్‌కోల్ గ్రామంలోని మల్లన్న ఆలయం వద్ద ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మమిండ్ల రాహుల్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అయ్యప్ప పడిపూజ మహెూత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప మాలదారులకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణతో రావల్‌కోల్ గ్రామం మారుమోగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగమణి, గురు స్వాములు శ్రీనివాస్ యాదవ్, రాజు, రాము, ఆర్.మల్లారెడ్డి, బాబు, అర్జున్ గౌడ్, మల్లేష్, గోపి, రామకృష్ణ, జైపాల్, చాకలి నర్సింహ, రమేష్, రాంచందర్ రెడ్డి, నవీన్, నాగరాజుగౌడ్, శేషి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి సన్మానం



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని హెచ్ఎంటీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎంటీ నగర్‌లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. హెచ్ఎంటీ నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు తొందర్లోనే చేపడుతామని, చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీడీ కార్యదర్శి కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ జనార్దన్ రావు, బాబురావు, సతీష్, యాదగిరి రెడ్డి, బుచ్చయ్య తదితరులున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజక వర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి శుభకార్యాలకు ఆహ్వానిస్తూ ఆహ్వానం పలకడంతో పాటు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ ప్రజలకు మౌళిక వసతుల కల్పనలో, సంక్షేమ పథకాల అమలులో కుత్బుల్లాపూర్ ప్రజానీకానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు.

బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా, రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, పెద్దలు, శ్రీ కె.యం. ప్రతాప్‌ని, కుత్బుల్లాపూర్ మండలం రికగ్నైజడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు కలిసి శుభాకాంక్షలను తెలియజేశారు. బడ్జెట్ స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతాప్‌కి తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ బడ్జెట్ స్కూల్స్ సమస్యలను, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల రికగ్నైజేడు స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ చైర్మెన్ శివయ్య, అధ్యక్షులు ఆర్.వరప్రసాద్, మహేష్ కుమార్, చీఫ్ అడ్వైజర్ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్. మల్లేశం, బడ్జెట్ పాఠశాల కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మల్కాజిగిరి అభ్యర్థిని గెలిపించండి



- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చెయ్యాలని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మంగళవారం రాత్రి కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్ బీ కాలనీ రోడ్ నెంబర్ 1 లో సితార గ్రాండ్ హోటల్లో ఏర్పాటుచేసిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ రెండు మూడు నెలల్లోనే పార్లమెంటు ఎన్నికలు రాబోతున్నాయని మరోసారి మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇద్దామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. జరిగిన గత అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గం లో ప్రభుత్వ భూములు ఎక్కడ కబ్జాలు జరిగాయో వాటి పూర్తి వివరాలు సేకరించి నాయకుల కు కార్యకర్తలకు వివరించారు. అదే విధంగా 28వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ప్రతి డివిజన్లో జరుపుకొని కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేయాలని తెలిపారు. మూసాపేట మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉదయం 9:30 నిమిషాలకు భారీ ఎత్తున పార్టీ జెండా ఆవిష్కరించబోతున్నామని నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అదే రోజు మాజీ సీఎల్పీ నేత పి.జనార్దన్ రెడ్డి వర్ధంతి వేడుకలు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యం శ్రీరంగం, గాలి బాలాజీ, లక్ష్మయ్య, శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కుల వెంకటేశ్వరరావు, తూము వేణు, తూము సంతోష్, గోపాల్ రెడ్డి ముక్తార్, హైమద్ పాల్గొన్నారు.

సింగిరెడ్డిని సన్మానించిన శేరి సతీష్ రెడ్డి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని కూకట్‌పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛలతో ఘనంగా సన్మానించారు. అనంతరం శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బూతు స్థాయి నుంచి బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను నియోజకవర్గంలో అమలు చేసే విధానంపై, సంక్షేమ పథకాల విధివిధానాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఆరు గ్యారెంటీ పథకాలు అందే విధంగా కృషి చేస్తానని ఆయన స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. ఆరు పథకాలకు లబ్ధిదారులు ఓకే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులు కూడా త్వరలో అందరికీ అందుబాటులోకి రాబోతున్నాయన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే న్యాయం జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి వెంకటరమణ, కేపీహెచ్‌బీ కాలనీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, కూకట్‌పల్లి కాంగ్రెస్ యువజన నాయకులు అరవింద్ కిషోర్ నాయుడు, కిరణ్ గౌడ్, లడ్డు, శేఖర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చేయాలి



- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ డిప్యూటీ కమిషనర్లు మల్లయ్య, నాగరాణిల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో మున్సిపల్ అధికారులు ఇతర అన్ని డిపార్టుమెంట్ల అధికారులతో సమన్వయము చేసుకోవాలని విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా లబ్దిదారులకు సంక్షేమ పథకాల వివరించడంలో అధికారులు ఓర్పుతో వ్యవహరించాలన్నారు. దాదాపు తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ప్రజలందరూ వారి, వారి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలలో ఈనెల 28వ తేదీ నుంచి జనవరి 6 తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఈ సన్నాహక సమావేశంలో కార్పొరేటరు రావుల శేషగిరి, కూన పారిజాత గౌరీష్, బి.విజయ శేఖర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేసిన బండి రమేష్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి గిరిధర్ కృష్ణ 8సం॥ తండ్రి మధుసూదన్ రావు, కూకట్‌పల్లి నియోజకవర్గంలోని తులసి నగర్‌లో నివాసం ఉంటున్నారు. అకస్మాత్తుగా కుమారుడుకి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తన కుమారుని ఆసుపత్రిలోవైద్యం చూపించలేక తండ్రి మధుసూదన్ రావు ఇబ్బంది పడుతున్నాడు కూలిపని చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. ఒక్కసారిగా పెద్ద జబ్బు రావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న మధుసూదన రావు కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ను ఆశ్రయించారు. తన కొడుకు అనారోగ్యంతో బాధపడుతున్నారని విషయాన్ని బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి బండి రమేష్ సేవా సంస్థ తన ట్రస్టు ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. మియాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో చెక్కును మధుసూదన్ రావుకు అందజేశారు. పాల్గొన్న శేరి సతీష్ రెడ్డి, ముక్తార్, అందే శ్రీరామ్మూర్తి, ముఖేందర్ రెడ్డి, లక్ష్మయ్య, జోగు కృష్ణ, మల్లేష్, తుమ్ సంతోష్, అరవింద్ రెడ్డి పాల్గొన్నారు.

'ప్రజాపాలన'కు సంబంధించి సమీక్షలు



కూకట్‌పల్లి: మూసాపేట మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి సంబంధించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్ర నాయక్, నోడల్ అధికారి శంకరయ్య ఆధ్వర్యంలో, కూకట్‌పల్లి నియోజకవర్గం కార్పొరేటర్లు. మున్సిపల్ అధికారులు, పోలీస్, అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన కొరకు, దరఖాస్తు చేసుకోదలచిన వారు తమ డివిజన్లో ఏర్పాటు చేసిన కార్యాలయంలో వారికి కావలసిన పథకానికి సంబం ధించినవి దరఖాస్తు ద్వారా అక్కడికక్కడే అధికారులకు ఇచ్చి రసీదు పొందాలని సూచించారు. ఇందులో ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక పథకాలైన మహాలక్ష్మి పథకంలో గ్యాస్ సిలెండర్, 2500 నగదు, గృహ జ్యోతి కింద 200 యూనిట్ల కరెంటు రాయితీ, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత(ఫించన్లు) వంటి పథకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకోదలచినవారు, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒకే దరఖాస్తు ద్వారా తమ యొక్క పథకమును అప్లై చేసుకుని మీ యొక్క స్థానిక ప్రాంతాల్లో నియమించబడిన కార్యాలయాల్లో ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని డివిజన్ల కార్పొరేటర్లు, డీసీలు రమేష్, కృష్ణయ్య పోలీస్ జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయములో ప్రభుత్వము చేపట్టబడిన 'ప్రజా పాలన'లో భాగంగా MLA, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం, కార్పొరేటర్లు, స్పెషల్ ఆఫీసర్లు, ఉప కమిషనర్లు, మల్కాజిగిరి అల్వాల్ సర్కిల్ అధికారులతో ప్రతేక్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశ ముఖ్య ఉద్దేశ్యం ఏమనగా, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా ప్రారంభించిన "ప్రజా పాలనా"లో 6 పథకాల అమలు కార్యక్రమం గురించి ప్రణాళిక దరఖాస్తుల స్వీకరణ, తీసుకోవాలిసిన చర్యల ఏర్పాట్లు గురించి చర్చించారు. ఇట్టి కార్యక్రమములో మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో 6 వార్డులలో వార్డు చొప్పున 24 సెంట ర్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమము తేదీ 28.12.2023 నుంచి ప్రారంభంచి 06.01.2024 ఉదయం 8.00 గం. నుండి మధ్యాహ్నం 12.00 గం.ల వరకు, మధ్యాహ్నం 2.00 గం.ల నుంచి సాయంత్రం 6.00గం.ల వరకు నిర్వహించారు. కావున ప్రజలందరూ ఈ ఆవకాశం వినియోగించు కోవలసిందిగా ప్రజలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజిగిరి శాసన సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సే పరమావధిగా పని చేయాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు పంపిణీ చేసే క్రమంలో సమయ పాలన పాటించాలని (time bound) సూచించారు. ధరఖాస్తు చేసుకునే విధానం, అర్హతలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి ఎన్ని రోజులు సమయం పడుతుంది అనే వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు.



జగద్గిరిగుట్ట: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 138 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం నాడు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దూం నగర్‌లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు... పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న ఆరు గ్యారెంటీలను ప్రజలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గూడవరమ్మ కాంగ్రెస్ మహిళా నాయకురాళ్ళు, జె.మంగా, సులోచన రేవంత్ రెడ్డి యువసేన సాయి ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన'కు అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. నేటి నుంచి జనవరి 6 వరకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోని వార్డుల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తెలిపారు. తహసీల్దార్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో రెండు బృందాలను నియమించారు. వారి నేతృత్వంలో పథకాలకు సంబంధించిన వివిధ శాఖల మండల అధికారులు సభ్యులుగా ఉంటారని వారి నేపథ్యంలో సౌకర్యవంతంగా ఉండేలా షెడ్యూల్ రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఫతేనగర్ వార్డ్ ఆఫీస్, భరత్ నగర్ పార్క్ బిల్డింగ్, భగత్ సింగ్ పార్క్ కమ్యూనిటీ హాల్, ఇందిరా గాంధీపురం ఫంక్షన్ హాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించను నట్లు తెలిపారు. ఇందులో స్థానికులు హాజరై ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగ పరుచుకోవాలని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ కోరారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పొంచి ఉన్న ప్రమాదం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వెంకటాపురం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ పాఠశాలకు చెందిన ప్రహరీ గోడ పగుళ్లు ఏర్పడి ప్రమాద కరంగా మారింది. ఇక్కడే బాత్రూమ్ ఉండటంతో, వెళ్లిన సమయంలో ఈ గోడ, ఎప్పుడు కూలిపోతుందోనని పలువురు విద్యార్థులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చూపితే ఎలా..అనుకోకుండా పాఠశాలలో ఏదైనా ప్రమాదం జరిగితే దీనికి బాధ్యులు ఎవరు అని, విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత అధికారులు, పాలకులు ఏదో హడావిడి చేసే దాని కన్నా, ముందే మేల్కొనిచర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు కోరుతున్నారు.

పేద కార్మికులకు అండగా ఉంటా



- కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద కార్మికులకు అండగా ఉంటానని రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ బి. విజయ శేఖర్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని రంగా రెడ్డి నగర్ పారిశ్రామిక ప్రాంతంలో ఒక కంపెనీలో పనిచేసే రాజు అనే వ్యక్తికి ప్రమాదవశాత్తు నాలుగు వేళ్ళు తొలగిపోవడం తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో రాజ కుటుంబ సభ్యులు ఈ ప్రమాద విషయాన్ని తెలంగాణ ఉద్యమ నాయకులు, సంఘ సేవకులు, కాపా సుబ్బారెడ్డి తెలిపారు. దీంతో ఆయన సంబంధిత కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి అక్షరాల రూ.3 లక్షలు నష్ట పరిహారం.. ప్రమాదానికి గురైన వ్యక్తికి ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చారు. బుధవారం డివిజన్ కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ చింతల్ చంద్ర నగర్ లోని తన కార్యాలయంలో ప్రమాదానికి గురైన బాధిత కుటుంబానికి ఆయన చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బి.కార్తిక్ గౌడ్, బాధితుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ డివిజన్ గణేష్ నగర్‌లో అయ్యప్ప గురుస్వామి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శరణంటూ వేడిన ప్రతి ఒక్క భక్తుడిని కాపాడే దైవం హరిహరసతుడు అయ్యప్ప అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, భరత్, సీనియర్ నాయకులు మురళి యాదవ్, రేణు యాదవ్, ఎత్తరి మారయ్య, సిద్ధిక్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను మింగిన పాము కేసీఆర్



- పిడమర్తి రవి

నవతెలంగాణ-బాలానగర్

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులను మింగిన కుతెడ పాము మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మాదిగ సంఘాల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కేవలం తమ కుటుంబమే చేసిందని ప్రజలకు చెప్పే ప్రయత్నం చేస్తున్నాడని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో మాదిగలపై ఉన్న కేసులు వెలమలపై ఉన్న కేసులు చూస్తే ఎవరు తెలంగాణ రాష్ట్రం ఉద్యమం చేశారో ప్రజలకు తెలుస్తుందని అన్నారు. ఎంతోమంది ఉద్యమకారులను నమ్మించి మోసం చేసిన ఘనత మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ కే చెందుతుందని అన్నారు. ఉద్యమ కారులను అణిచివేయడంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు ముఖ్యపాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ ప్రజలు వారి కుట్రపూరితమైన వ్యూహాలను పసికట్టే కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారనిఅన్నారు. జనవరి 2 నుంచి అన్ని పార్లమెంటు స్థానాలలో బీజేపీ వక్రబుద్ధిని ఎండ కడతామన్నారు. జనవరి 2 నుంచి తెలంగాణలోని అన్ని పార్లమెంటు స్థానాలలో బీజేపీ ఇచ్చిన హామీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని మోసగించి, మళ్లీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో స్వయంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ మాదిగల ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌ను నేరవేరుస్తామని హామీ ఇచ్చి మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్న బీజేపీ కుట్రపూరితమైన వ్యవహారాన్ని అన్ని పార్లమెంటు స్థానాల్లో తిరిగి ఈ సమాజానికి చెబుదామని అన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో చలో ఢిలీ ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఫిబ్రవరి మొదటి వారంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడతామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి అన్నారు. చివరి పార్లమెంటు సమావేశాలలో వర్గీకరణ బిల్లు ప్రాయశపెట్టాలని ప్రధాన డిమాండ్‌తో మాదిగ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం ఉంటుందని అన్నారు. నేషనల్ దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుదాల బాబురావు, టీఎంఎస్-ఎస్ అధ్యక్షులు గద్ద యాదయ్య, ఎంహెచ్ పీఎస్ అధ్యక్షులు మైస ఉపేందర్, డీఎస్ఎస్ అధ్యక్షులు కనకం వంశీ, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, టీడీడీ రాష్ట్ర అధ్యక్షులు బచ్చలకూర బాలరాజు, మాదిగ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందరావు, కన్వీనర్ కుడారి దీరన్, నక్క మహేష్, జోగుగణేష్, రేవంత్, యాకన్న పాల్గొన్నారు.

కరోనా బారిన పడకుండా మాస్క్ ధరించాలి



- ప్రముఖ సంఘ సేవకులు సేర్ల అనిల్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



కరోనా కొత్త వేరియంట్ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ సంఘ సేవకులు సెర్ల అనిల్ అన్నారు. నేటి లక్ష్యం సర్వమత సేవా సమితి కార్యాలయంలో అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. అనంతరం మాస్క్ లు పంపిణీ చేసి, అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ సంఘ సేవకులు సేర్ల అనిల్ మాట్లాడుతూ.. కరోనా మహమ్మారి మళ్లీ వచ్చిందని, రోజు రోజుకు కేసులు పెరుగుతున్నందున, దీని బారిన పడకుండా ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, అహ్మద్, అమర్జీత్ సింగ్, ఎస్ రెడ్డి, గుర్మీత్ సింగ్, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

అమ్మ చల్లని ఒడిలా చేనేత

- నిజాంపేట్ మేయర్ నీలా గోపాల్ రెడ్డి
- కొలన్ రాఘవ రెడ్డి గార్డెన్స్ వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ హ్యాండ్ లూమ్ వస్త్ర ప్రదర్శన ఆరంభం



నవతెలంగాన-సీటీబ్యూరో

నిజాంపేటలోని కొలన్ రాఘవ రెడ్డి గార్డెన్స్ లో ఏర్పాటైన కృతి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ హ్యాండ్ లూమ్ వస్త్ర ప్రదర్శన నిజాంపేట మేయర్ నీలా గోపాల్ రెడ్డి తో పాటు టాలీవుడ్ నేపథ్య గాయని గాయత్రీ వేదాంతంలు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ నీలా గోపాల్ , గాయత్రీలు ఇక్కడి హాలులో కొలువు దీరిన చేనేత కారులు వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, చేనేత కారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలవడిగా తిరిగారు. భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని నీలా గోపాల్ అన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలెదన్నారు. నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. చేనేత అమ్మ చల్లని ఒడిలా అని ఆమె వర్ణించారు. నేపథ్య గాయని గాయత్రి మాట్లాడుతూ హ్యాండ్ లుమ్ ఉత్పత్తుల తయారీకి చేనేత కారులు శ్రమ వెల కట్టలేనిదన్నారు. ప్రతి ఒక్కరూ చేనేతను ఆదరించాలని, అప్పుడే చేనేత కారుల కష్టానికి తగ్గ ఫలితం పరోక్షంగా ఇవ్వగలమన్నారు.నిర్వాహకులు యలమంచిలి శ్రీలత మాట్లాడుతూ జనవరి 1వ తేదీ వరకు కొనసాగుతున్న ఈ ప్రదర్శనలో దేశంలోని 16 రాష్ట్రాల నుండి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
గురువారం | డిసెంబర్ 28, 2023 | www.navatelangana.com

అభివృద్ధి పనులపై సమీక్ష



నవతెలంగాణ-కాప్రా

నాచారం డివిజన్‌లో మంజూరైన నిధులు, కొత్తగా మంజూరు చేయించాల్సిన పనుల విషయమై కార్పొరేటర్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేకర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న స్థానంలో రూ.94 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించనున్న పనులు తొందరగా ప్రారంభించాలని, శాంతి గార్డెన్స్‌కు వెళ్ళే రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే కోటి 30 లక్షల టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకొని పనులు ప్రారంభానికి రెడీగా ఉన్నందున శంకుస్థాపన చేయాలని, ప్రజాపాలన కార్యక్రమానికి అధికా రులు సరైన ఏర్పాట్లు చేయాలని ప్రజలకు ఎక్కడ ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ లింగా రావు వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, గ్రేటర్ బారాస నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సాయిరాం నగర్ కాలనీలో అయ్యప్ప స్వామి దేవాలయం 5వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు గణపతి హెూమం, గణపతి సుబ్రహ్మణ్యేశ్వర స్వాములకు అభిషేకం అయ్యప్ప స్వామికి కోటి తులసి అర్చన అభిషేకం చేసిన తదుపరి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేలమంది అయ్యప్ప స్వాములు, భక్తులు, హరిహర భక్త బృందం, భజన నర్సింహారెడ్డి అశోకులు చుట్టు పక్క ప్రాంతం భజనతో మారు మ్మెగింది. కొమ్ము రవి అన్న ప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆలయ ట్రస్ట్ చైర్మన్ రేగళ్ల సతీష్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ హరినాథ్ రెడ్డి, జాయింట్ కేపిఎస్ ప్రసాద్, నిరంజన్ కమిటీ సభ్యులు పూజలో పాల్గొన్నారు. చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, గురు స్వాములు ఆం రెడ్డి, పాపిరెడ్డి, నాగేందర్, బైరి నవీన్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, బంక వెంకటేష్, రమేష్ నాయక్, శ్రీను, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు..

'జీవో నెంబర్ 46' వెంటనే ఎత్తివేయాలి

- జీవో నెంబర్ 46 బాధితుల డిమాండ్
- మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం



నవతెలంగాణ-ముషీరాబాద్

జీవో నెంబర్ 46ను వెంటనే ఎత్తివేయాలని కానిస్టేబుల్ అభ్యర్థులు జీవో నెంబర్ 46 బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం టీపీసీసీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ గాలే రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు దామోదర్ రాజేంద్రసింహ, పొన్నం ప్రభాకర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 46 కానిస్టేబుల్ బాధితులమైన మేము మారుమూల గ్రామీణ ప్రాంత విద్యార్థులం గత ప్రభుత్వం ఈ జీవో 46 ను స్టేట్ వైడ్ పోస్ట్ అయిన టీఎస్ఎస్‌పీ బెటాలియన్ పోస్ట్ కోడ్ నెంబర్ 24కు అప్లై చేయడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థుల మైన మేము చాలా అన్యాయానికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని అభివృద్ధి ప్రాంతమైన ఉమ్మడి హైదరాబాద్ కమీషనరేట్ల పరిధిలోని అభ్యర్థులకు ఎక్కువ పోస్టులు కేటాయించడం వల్ల గ్రామీణ ప్రాంత యువత తీవ్ర అన్యాయానికి గురవుతున్నామని తెలిపారు. ఉపాధి అవకాశాలు అక్షరాస్యత ఎక్కువగా ఉన్న రాజధాని ప్రాంతంలో 52, 60, 70 మార్కులకు ఉద్యోగాలు ఇచ్చారు. తక్కువ అక్షరాస్యత, తక్కువ ఉపాధి అవకాశాలు గల గ్రామీణ జిల్లాలైన మిగతా తెలంగాణ జిల్లాలలో 125 పైబడి మార్కులు తెచ్చుకున్న కూడా ఉద్యోగం రాని పరిస్థితి ఈ అన్యాయాన్ని ముందే గ్రహించిన గ్రామీణ ప్రాంత యువకులు హైకోర్టు ద్వారా గత ప్రభుత్వం తెచ్చిన ఈ జీవోను ప్రశ్నించారు. ఈ కేసు కోర్టులోనే ఉన్నప్పటికీ గత ప్రభుత్వం రాత్రికి రాత్రే ఫలితాలు ప్రకటించడం వల్ల కోర్టు ధిక్కరణ కూడా గురైందని గుర్తు చేశారు . కానిస్టేబుల్ మెయిన్స్ ఎగ్జామ్ లో నాలుగు తప్పు ప్రశ్నలకు మార్కులు కలపాలని కోర్టు చెప్పిన వినకుండా తర్వాత ప్రాసెస్ బోర్డు కంటిన్యూ చేస్తుందని దీనివల్ల కోర్టు ఆ తర్వాతే ప్రాసెస్ పై స్టే విధించింది. ఈ కేసు తీర్పు వెలువడే ముందే మాకు న్యాయం చేయగలరని కోరడం జరిగింది. తీర్పు వెలువడి స్టే ఎత్తివేస్తే తర్వాత విషయం చాలా ఇబ్బందికరంగా మారుతుందని కావున కోర్టు స్టే ఎత్తి వేయకముందే జీవో 46 బాధితులమైన మాకు న్యాయం చేసి మరల రిజల్ట్ ఇవ్వగలరని కోరారు.

ప్రజాపాలనలో ప్రజలు దరఖాస్తు చేసుకోవాలి

- డివిజన్‌ల వారీగా ప్రత్యేక వార్డులు ఏర్పాటు
- డీఎంసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజా పాలన లో ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని డివిజన్‌ల వారీగా ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశామని ముషీరాబాద్ సర్కిల్ 15 డీఎంసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల్లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలకు వీలుగా ప్రజా పాలన పేరుతో సంక్షేమ పథకాలు ప్రజల నుంచి దరఖాస్తులలో స్వీకరించేందుకు వీలుగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లో ప్రత్యేక ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెతకుండా ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

నియోజకవర్గంలోని ప్రజాపాలన కేంద్రాలు..

అడిక్ మెట్ డివిజన్ లో నాలుగు కమిటీ హాల్ లను ఏర్పాటు చేశామన్నారు. 1) అడిక్ మెట్ వార్డ్ కార్యాలయం, 2) ఎస్ఆర్‌టి కమ్యూనిటీ హాల్, 3) అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, 4) లలిత నగర్ కమిటీ హాల్ లలో ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. రాంనగర్ డివిజన్‌లో నెంబర్ వుడ్ కమ్యూనిటీ హాల్, ఎస్ఆర్‌టి పార్క్ కమ్యూనిటీ హాల్, పోచమ్మ గుడి, రాజీవ్ గాంధీ నగర్ కమ్యూనిటీ హాల్ లలో రాంనగర్ డివిజన్‌కు సంబంధించిన ప్రజలు తమ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ముషీరాబాద్ డివిజన్‌లో ముషీరాబాద్ వార్డు కార్యాలయం, మోహన్ నగర్ కమ్యూనిటీ హాల్, వెస్ట్ ఎం సి హెచ్ కాలనీ, బహదుర్య ఫంక్షన్ హాల్ లో ముషీరాబాద్ డివిజన్ కు సంబంధించిన ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. బోలక్‌పూర్ డివిజన్‌లో గంగపుత్ర సంఘం మహాత్మా గ నగర్ కమిటీ హాల్, అంజుమన్ స్కూల్, పద్మశాలి కాలనీ, అంజుమాన్ స్కూల్ గుల్షన్ నగర్, లకు సంబంధించిన ప్రజలు తమ దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందించి రిసిప్ట్ తీసుకోవాలని కోరారు. గాంధీనగర్ డివిజన్‌లో వివి నగర్ కమిటీ హాల్, జవహర్ నగర్ కమిటీ హాల్, చిక్కడపల్లి గాంధీనగర్ వార్డ కార్యాలయం, అశోక్ నగర్ సర్కిల్ అసోసియేషన్ లకు గాంధీనగర్ డివిజన్‌కు సంబంధించిన ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కవాడిగూడ డివిజన్ సంబంధించి కవాడిగూడ వార్డు కార్యాలయం, దోమలగూడ వార్డు కార్యాలయం, బండ మైసమ్మ నగర్ కమిటీ హాల్ ,అంగన్వాడి కేంద్రం ముగ్గు బస్తి కమిటీ హాల్, లో ప్రజల తమ దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఏ డివిజన్ కు సంబంధించిన ప్రజలు అదే డివిజన్ లో ఇబ్బందులు లేకుండా తమ దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందించాలని పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి తమ దరఖాస్తు ఫారం ను సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతచేసి వార్డు కార్యాలయంలో అందించాలన్నారు. ఈ ప్రజా పాలన ఏడవ తారీఖు వరకు కొన సాగుతుందని ప్రజలు ఎటువంటి ఆందోళన చెందకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలను దరఖాస్తు చేసుకొని సంక్షేమ పథకాలను పొందాలని కోరారు.

ప్రభుత్వ 'ప్రజాపాలన'ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ప్రభుత్వ ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. బుధవారం గోషామహల్ జీహెచ్ఎంసీ సర్కిల్ -14 లోని అబిడ్స్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం, రైతు భరోసా పథకం, గృహజ్యోతి పథకం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, చేయూత పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరణకు 24 టీంలను ఏర్పాటు చేశామని గోషామహల్ సర్కిల్ ప్రజా పాలన ప్రత్యేక అధికారిని బి.గీతా రాధిక తెలిపారు. సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో వివిధ కమ్యూనిటీ హాల్‌లు, జీహెచ్ఎంసీ ఆఫీస్‌లలో సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. పథకాలపై అవగాహన కల్పిస్తూ లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్, శశికళ, లాల్ సింగ్, జిహెచ్ఎంసి గోషామహల్ సర్కిల్ -14 డిప్యూటీ కమిషనర్ డి.బాలయ్య, నాంపల్లి మండల తహసిల్దార్ ప్రేమ్ కుమార్, జీహెచ్ఎంసీ ఏఎంసీ శైలజ, ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, యుసీడీపీఓ విద్యాసాగర్, జలమండలి జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్, అబిడ్స్ ఏసిపి చంద్రశేఖర్, పోలీస్ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు, ఆర్పీలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలి

కాంగ్రెస్ గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జి సునీతా రావు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

నేటి నుండి ప్రజలకు చేరువగా పాలనను అందించడానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంను రాష్ట్రంలోని అర్హులైన వారందరికీ ఆరు గ్యారెంటీల సంక్షేమ పథకాలను ప్రారంబిస్తున్నామని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ సునీతా రావు తెలిపారు. బుధవారం నియోజకవర్గంలో సునీత రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేటి నుండి ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో మహాలక్ష్మి పథకం, రైతు భరోసా పథకం, గృహ జ్యోతి పథకం, ఇందిరమ్మ ఇండ్ల పథకం, చేయూత పథకాల దరఖా స్తులను ప్రజలకు అందిస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, రెండు ఫొటోస్ దరఖాస్తు ఫామ్ కు జత చేయాలని సూచించారు. ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సంక్షేమ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గోషామహల్ నియోజకవర్గంలోని ప్రజలందరూ ఈ పథకాల ద్వారా లబ్ది పొందాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-ముషీరాబాద్

గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిక్కడపల్లి ఆర్టీసీ క్రాస్ రోడ్ సమీపంలో గుర్తు తెలియని యాచకుడు (45) మృతి చెంది పడి వున్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుని వివరాలకు దర్యాప్తు చేపట్టారు.



ఎనాన్స్ సెంటర్ వద్ద గల పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశించారు. కమిషనర్ వెంట చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ అబ్దుల్ వకీల్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

మిమిక్రీ శాస్త్రీయ కళగా ప్రాచుర్యం తెచ్చిన వేణు మాధవ్



నవతెలంగాణ-కల్చరల్

మిమిక్రీని శాస్త్రీయ కళగా తెలుగు విశ్వవిద్యాలయంలో బోధనాంశంగా నెలకొల్పేందుకు నేరెళ్ళ వేణుమాధవ్ చేసిన కృషి విస్మరించలేమని ప్రముఖ నటుడు మిమిక్రీ కళా కారుడు శివా రెడ్డి అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా దీక్షితులు కళా వేదిక పై మిమిక్రీ ఆర్టిస్ట్స్ వెల్ ఫేర్ అసోసియేషన్ గాన సభ సంయుక్త నిర్వహణలో విఖ్యాత మిమిక్రీ కళాకారుడు డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ జయంతి సందర్భంగా మిమిక్రీ పోటీలు నిర్వహించారు. సుమారు వందకు పైగా కళాకారులు పోటీలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా శివా రెడ్డి పాల్గొని తన నటనకు మిమిక్రీ దోహదపడిందని చెప్పారు. అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షుడు చంద్రముఖి చంద్ర శేఖర్ మాట్లాడుతూ నెరెళ్ల వేణుమాధవ్ ఎందరినో మిమిక్రీ కళలో ఉన్నతులుగా తీర్చిదిద్దారని.. వారు ఆ కళ ద్వారా ఉపాధి పొందుతున్నారని గుర్తు చేశారు. పోటీలో హరి ప్రసాద్, సందీప్ సాయి భార్గవి ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు పొందగా రాకేష్, కాపర్తి నరేష్ రెహమాన్‌లకు కాన్సోలేషన్ బహుమతులు అందజేశారు. విజేతలకు నగదు ప్రశంసా పత్రం అందజేశారు చొక్కాపు రమణ శ్రీనాథ్,రఘు నందన వెంకట్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తులు అరెస్టు

సొత్తు స్వాధీనం..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

అర్ధ రాత్రి దొంగతనానికి పాల్పడిన నిందితులను సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద సెల్ ఫోన్, నగదు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఇన్ స్పెక్టర్ కె.ముత్తు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట ప్రాంతానికి చెందిన నరేష్ ఈ నెల 19న అర్ధరాత్రి ఉస్మానియా మెడికల్ కాలేజ్ బస్ స్టాప్ దగ్గర నడుచుకుంటూ వస్తున్నాడు. మొహమ్మద్ ఫెరోజ్, అనిల్, 16 సంవత్సరాల మైనర్ బాలుడు కలిసి మోటార్ సైకిల్ పైన వచ్చి నరేష్ దగ్గర ఉన్న సెల్ ఫోన్, చేతికి ఉన్న సిల్వర్ బ్రాస్లెట్, రూ. 4వేల క్యాష్ రాబరీ చేసుకొని వెళ్లిపోయారు. దీంతో ఉదయం సంఘటన పై స్థానిక పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి సీసీల సహాయంతో దొంగతనానికి పాల్పడిన బాధితుల కదలికలు సేకరించి మొహమ్మద్ ఫిరోజ్‌ను, మైనర్ బాలుడిని ఈసామియా బజార్‌లో అదుపులోకి తీసుకొన్నారు. వారి దగ్గర నుండి సెల్ ఫోను, క్యాష్ ను రికవరీ చేసి మహమ్మద్ ఫెరోజ్ ను జైలుకి, మైనర్ బాలుని జువైనల్ హెూమ్ కి తరలించారు.

ప్రజా పాలన దరఖాస్తు స్వీకరణ కేంద్రాల వద్ద
జలమండలి తాగునీరు సరఫరా

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో దరఖాస్తులు స్వీకరించే వార్డు సభల వద్ద జలమండలి తాగునీరు సరఫరా చేయనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎండీ సుదర్శన్ రెడ్డి సంబంధిత జనరల్ మేనేజర్లను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేపటి నుంచి ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అభయ హస్తం కింద ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించిన దరఖాస్తుల్ని ప్రజల నుంచి స్వీకరించనుంది. ఈ కార్యక్రమం 28 నుంచి జనవరి 6 వరకు జరగనుంది.

సమాజాన్ని శాశ్వతంగా ప్రభావితం చేసిన బాపు



నవతెలంగాణ-కల్చరల్

కళలు మానవీయ విలువలు కనుమరుగైపోతున్న నేటి కాలంలో సినిమాలు సమాజాన్ని ప్రభావితం చేస్తా యని శాసన సభ తొలి సభాపతి మధుసూదనాచారి అన్నారు. బాపు దర్శకత్వం వహించిన ముత్యాల ముగ్గు, శ్రీ రామ రాజ్యం వంటి సినిమాలు తరతరాల పాటు ప్రజలను ప్రభావితం చేస్తాయని అయన పేర్కొన్నారు. శ్రీ త్యాగ రాయ గాన సభ ప్రధాన వేదికపై ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళా నిలయం నిర్వహణ లో విఖ్యాత దర్శకుడు చిత్ర కారుడు బాపు 90వ జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి ప్రముఖ చిత్ర కారుడు నత్య రూపకాలు రచయిత బిన్ను (భమిడి పల్లి నరసింహ మూర్తి)ను బాపు పరిచయం చేసిన నటుడు సుదర్శన్‌ను, నటుడు సమీర్‌ను సత్కరించి మాటాడారు. బాపు లాంటి దర్శకుల అవసరం నేడు ఉందన్నారు. అధ్యక్ష త వహించిన ప్రముఖ గాయని హైమవతి భీమన్న మాట్లా డుతూ తెలుగు చిత్ర పరిశ్రమలో బాపు విశ్వనాథ్ లది ప్రత్యేక యుగం అన్నారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామ రాజు మాట్లాడుతూ విభిన్న కార్యక్రమాలు చేయటంలో కళా నిలయం ప్రముఖమని చెప్పారు. వేదికపై దయానంద్ స్వామి,(బహ్మానందం, గంటి పిచ్చయ్య, మురళీధర్, వసంత రాయలు పాల్గొనగా సురేందర్ స్వాగతం పలుకగా కార్యదర్శి పుష్ప లత నివేదిక సమర్పిం చారు. తొలుత బాపి రాజు బందం పాడిన పాటలు అలరించాయి.

ప్రయివేటు విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కే.అశోక్ రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కే.అశోక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఇప్పటి నుంచే ప్రైవేటు, కార్పొరేటు ఇంటర్నేషనల్ స్కూల్‌లో అడ్మిషన్లు దాదాపు 90% పూర్తి అయ్యాయి. ఈ సంవత్సరం అన్ని విద్యా సంస్థలలో 10 నుంచి 20% ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులకి సర్క్యులర్ జారీ చేయడం జరుగు తుంది. ట్యూషన్ ఫీజుతో పాటు అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నారని, ఇంజనీరింగ్ చదువుతున్నటువంటి విద్యార్థులకు సంవత్సరానికి రూ. 35,000 నుంచి రూ. 70 వరకు ఫీజు ఉంటే ఎల్‌కేజీ, నర్సరీ విద్యార్థులకి సంవత్సరానికి మూడు లక్షల నుంచి 5 లక్షల వరకు ఫీజులు ఉన్నాయన్నారు. ప్రైవేటు కార్పొరేట్ స్కూల్‌లో, ఇంటర్నేషనల్ స్కూల్లో అడ్మిషన్ల దందా మొదలైన ఇప్పటివరకు విద్యాశాఖ అధికారులు ఏ ఒక్క స్కూల్ పై చర్యలు తీసుకోలేదు. వెంటనే అడ్మిషన్లు చేసినటువంటి స్కూల్‌లపై చర్యలు తీసుకోవాలని లేని పక్షాన అన్ని స్కూల్లో ముందు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సంతోష్ నగర్

కాంగెస్ పార్టీ అవతర దినోత్సవం సందర్భంగా బుధవారం కాంగ్రెస్ మలక్‌పేట్ డివిజన్ అధ్యక్షులు కొమ్మిల్లి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ క్యాలెండర్‌ను పి.వి. నర్సింహ్మారావు స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను, ప్రభుత్వా పథకాలను సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరుల పాల్గొన్నారు.



తొలి తెలుగు కవి పాల్కురికి సోమనాధుడు



నవతెలంగాణ-కల్చరల్

మహాభారతంను ఆంధ్రీకరించిన నన్నయను తెలి తెలుగు కవిగా ప్రచారం ఉన్నప్పటికీ తెలంగాణ ప్రాంతీయుడైన పాల్కురికి సోమనాధుడు బసవేశ్వర పురాణం స్వతంత్ర కావ్య రచనతో మొదటి తెలుగు కవిగా గుర్తింపు పొందారని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా పాల్కురికి సోమనాధుడు సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలుగు, కన్నడ, సంస్కృత, మరాఠీ భాషా పదాలను తన కావ్య రచనలో ఉపయోగించిన సోమనాధుడు నాటి శివ కవుల యుగానికి చెందిన వారన్నారు. ద్విపద పద్య శైలిలో బసవ పురాణం, అనుభవ సారం తదితర ఖండ కావ్య రచనలో దిట్ట అయిన సోమనాథుని కొన్ని రచనలు అందుబాటులో లేవని తెలిపారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై పూర్వ న్యాయమూర్తి మధుసూదన్, కవి మిద్దె సురేష్, గాన సభ పాలక మండలి సభ్యురాలు భమిడి ఉష పాల్గొన్నారు.

సన్నాహక సమావేశంలోనే ప్రోటోకాల్ రగడ



నవతెలంగాణ-అంబర్‌పేట

సన్నాహక సమావేశంలోనే ప్రోటోకాల్ రగడ ప్రారంభమైంది. బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ నేతల పంచాయితీ షురు అయింది. ప్రజాపాలన, అభయస్తాం గ్యారెంటీలకు శ్రీకారం చుట్టిన కార్యక్రమానికి బుధవారం చే నంబర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాలులో అధికార యంత్రంగం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో పాటు బీఆర్ఎస్ కార్పోరేటర్లు, బీజేపీ కార్పోరేటర్లను అధికారులు ఆహ్వానించారు. ఈ విషయం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ వి.హనుమంతురావుతో పాటు కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన రోహిన్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్లు హాజరయ్యారు. అంతా వేదికపైకి చేరుకున్నారు. ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం కోసం అధికారులు వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు వేదికపై మాట్లాడక కాంగ్రెస్ నేతలు వేదికపై మాట్లాడేందుకు ప్రయత్నించారు. దీనికి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అభ్యంతరం తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు కాకుండా సాధారణ నాయకులు గా ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం తలెత్తింది.

వేదిక కింద ఎమ్మెల్యే నిరసన..

కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున్న నినాదాలు చేసి వేదికపై మాట్లాడుతుడంతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన కార్పోరేటర్లు, నాయకులతో కలిసి వేదిక ముందు నిరసనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార యంత్రాంగం సాధారణ నాయకుని, మాజీ కార్పోరేటర్లు ఎలా వేదిక పంచుకుంటారని ఆయన ఆందోళన చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను సముదాయించారు. దీంతో ఎమ్మెల్యే వర్గం బయటకు వెళ్లింది. ఈ వివాదంపై మాజీ ఎంపీ వి.హనుమంతరావు కంటెస్టెడ్ ఎమ్మెల్యే రోహిన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు గడీల పాలన అనే భ్రమలో ఉన్నారని వాటి నుంచి బయటపడాలని హితవు పలికారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజా కార్యక్రమం అయినప్పటికి పార్టీ కార్యక్రమంలా నిర్వహించుకుని అందినకాడికి దోచుకున్నారని వారు విమర్శించారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా బీఆర్ఎస్ ప్రతి కార్యక్రమాన్ని ఏక్షపక్షంగా చేయడంతోనే వారిని ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టారని వారు ఎద్దేవా చేశారు. ప్రజాపాలన అనే కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతోనే కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తుందని అందులో భాగంగానే తాము పాల్గొన్నామని వారు తెలిపారు.

ఆ కూల్చివేతలకు 15 ఏండ్లు

- మంత్రుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం శూన్యం
- కొత్త ప్రభుత్వంలోనైనా న్యాయం జరిగేనా..?
- న్యాయం చేయాలంటూ ప్రజా వాణిలో బాధితుల మొర

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇల్లులేని ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీలు గుప్పించిన ప్రభుత్వాలు పేదల కొద్దిపాటి నీడను సైతం ధ్వంసం చేస్తున్నాయి. విద్వేష రాజకీయాలతో పేదలను రోడ్డున పడేస్తుండడంతో వారు తల్లడిల్లిపోతున్నారు. యథేచ్ఛగా కూల్చేస్తున్న ప్రభుత్వాలు వారికి



కావాల్సిన నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదే తరహాలో భీంరావ్ బాడాను ధ్వంసం చేసి 15 ఏండ్లు పూర్తయ్యాయి. పేదల ఆత్మగౌరవం, సంక్షేమం, అభ్యున్నతి అంటూ గొప్పలు పలికే పాలకులు నాడు సమైక్య పాలనలోని నగరంలోని నడిబొడ్డున కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం (గాంధీ భవన్ పక్కనున్న) భీంరావ్ బాడాను అప్పటి ప్రభుత్వం కూల్చేసింది. అక్కడ నివసిస్తున్న 95 కుటుంబాలను రోడ్డున పడేసి 15 ఏండ్లు గడిచినా, బాధితులకు ఇంకా న్యాయం జరగకపోవటం విచార కరం. ప్రత్యామ్నాయంగా సీతారాంబాగ్‌లో కేటాయించిన ఇండ్లలో అరకొర వసతుల మధ్యే జీవనం సాగిస్తున్నారు. తమ ఇండ్ల కోసం గత 15 ఏండ్లుగా బాధితులు పోరాడుతూనే ఉన్నారు. అయినా వారికి న్యాయం జరగడం లేదు.

తెల్లారే సరికల్లా రోడ్డున పడ్డ జీవితాలు

నాటి నిజాం ప్రభువు ప్రతీ రంజాన్, బక్రీద్ పండుగలకు వచ్చి పేదలకు ఇనాం ఇచ్చిన భీంరావ్ బాడాలోని 5 వేల చదరపు గజాల్లో ఇందిరమ్మ భవన్ నిర్మించాలన్న అప్పటి సర్కారు ఆలోచన జీవో నెం.76 కార్యరూపం దాల్చటంతో డిసెంబర్ 27, 2008 రోజున అర్ధరాత్రి పోలీసుల నిర్బంధంతో భీంరావ్ బాడా వాసులపై పోలీసులు విరుచుకుపడి, తెల్లవారే కల్లా వారి జీవితాలను రోడ్డు పాల్చేశారు. అప్పట్లో ఈ ఘటన జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. జాతీయ సామాజిక వేత్త మేధా పాట్కార్‌తో పాటు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, ప్రజాయుద్ధ నౌక గద్దర్‌తో పాటు కాంగ్రెస్ నేత పీ. జనార్థన్ రెడ్డి ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతూ, ఆ చర్యను తీవ్రంగా ఖండించారు. పీ. జనార్థన్ రెడ్డి, చంద్రబాబు నాయ్డుడు, మేధా పాట్కార్‌లు భీంరావ్ బాడా వాసులకు అండగా నిలిచి, వారి ఇండ్లను తిరిగి నిర్మించాలన్న డిమాండ్‌తో ధర్నాలు చేశారు. ఇదిలావుండగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలోనైనా న్యాయం జరుగుతుందని అప్పటి మంత్రి కేటీఆర్, సీఎం కేసీఆర్‌లతో పాటు పలువురు మంత్రుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా, ఫలితం దక్కలేదు. ఆ తర్వాత ఈ వ్యవహారం కోర్టుకు చేరింది. నేటికీ కోర్టు పరిశీలనలోనే ఉంది. ఈ వివాదం ఇంకా ఎటూ తెగకపోవటం పాలకుల ధోరణికీ ప్రత్యేక్ష నిదర్శనం. ప్రత్యామ్నాయంగా కొం దరు భీంరావ్ బాడా వాసులకు సీతారాంబాగ్‌లో జెఎన్ఎన్ యూఆర్ఎం ఇండ్లను కేటాయించినా, ఆ ఇండ్లకు కనీసం అప్రోచ్ రోడ్డుతో పాటు మౌలిక వసతుల్లేక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు బాడా బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

న్యాయం చేయాలని ప్రజావాణిలో వినతి

బీఆర్ఎస్ పార్టీకి నగర నడిబొడ్డున ఉన్న భీంరావుబాడా పేదలు కనిపించలేదని.. కనీసం వారిని పట్టించుకున్నపాపానా పోలేదని పలువురు విమర్శిస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో తమ ఇండ్లపై భీంరావ్ బాడా వాసులకు మళ్లీ ఆశలు చిగురించాయి. తమకు బాడా స్థలంలోనే ఇండ్లను నిర్మించి ఇవ్వాలని కోరుతూ ఈ నెల 22న ప్రజభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించినట్టు భీంరావ్ బాడా వాసుల లీడర్ కొమరయ్య తెలిపారు.

'మలక్‌పేట్'ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల
- పలు ప్రాంతాల పరిశీలన

నవతెలంగాణ-సంతోష్ నగర్



మలక్ పేట్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. ముసారంబాగ్ బ్రిడ్జి త్వరితగన పూర్తి చేసి ప్రజలకు అందించాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కాలనీ పరిశ్రమల ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు సమస్య తలెత్తకుండా అధికారులు త్వరతగతిన పరిష్కరించాలన్నారు. సీసీ రోడ్డు, డ్రయినేజీ, తాగునీటి సరఫరా, స్థానిక సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులదే అని తెలియజేశారు. స్థానిక సమస్యలు తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలనిఅధికారులను సూచించారు. వర్షాకాలంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, స్థానిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎక్కడలేని ఉద్యోగస్తులు నియోజకవర్గంలో పని చేస్తున్నారన్నారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు చెత్త చెదారం లేకుండా చూడవలసిన బాధ్యతలు చేపట్టాలన్నారు. డివిజన్ పరిధిలో అధికారులు సిబ్బంది చూసి చూడనట్టుగా వ్యవహరశిలి అరికట్టేయాలన్నారు. పాఠశాల విద్యార్థులకు రోడ్డుపై ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని గుర్తు చేశారు. అధికారులు సమన్వయంతో పరిశీలించి ఎప్పటికప్పుడు నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, కార్యకర్తలు, ఎంఐఎం యాక్టివ్ సభ్యులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా
కృష్ణ వేణి శత వసంత మహోత్సవం

- తెలంగాణ రాష్ట్ర సినీ అవార్డులు ఏర్పాటు చేస్తాం
- రాష్ట్ర టూరిజం సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు..



నవతెలంగాణ-సిటీబ్యూరో

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చే నంది అవార్డుల ప్రదానం ఆగిపోవడం బాధాకరమని, ముఖ్య మంత్రితో చర్చించి తెలంగాణ రాష్ట్రం తరఫున అవార్డులు ఇచ్చే విధంగా కృషి చేస్తానని తెలంగాణ టూరిజం సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు . బంజారా హిల్స్ లోని ప్రసాద్ లాబ్స్ ప్రివ్యూ థియేటర్ లో ప్రముఖ సాంస్కృతిక సంస్థ "ఆకృతి "ఆధ్వర్యంలో, సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సౌజన్యంతో సుప్రసిద్ధ సినీ నటి గాయని నిర్మాత సి. కృష్ణ వేణి వేణి వందవ సంవత్సరం లో పాదం మోపిన సందర్భంగా, ఆమె శత వసంత మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు.. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు శాలువాతో గజమాలతో, జ్ఞాపికతో ఘనంగా ఆమెను సత్కరించారు. తెలుగు చలన చిత్ర రంగానికి కృష్ణవేణి చేసిన విస్తృత సేవలను కొనియాడారు. ఎందరో మహా నటుల భవితవ్యాన్ని ఆమె తీర్చిదిద్దారు అంటూ ప్రస్తుతించారు. కృష్ణవేణి లాంటి ఒక సినీ దిగ్గజ నటిని సత్కరించడం చాలా ఆనందంగా ఉందన్నారు.. సినీ నటుడు మురళీ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున ఇచ్చే నంది అవార్డులు సినీ నటి నటులు ఎంతో గౌరవంగా భావిస్తామని, గత పదేండ్లుగా ఈ ప్రక్రియ ఆగిపోవడం బాధాకరమని, మంత్రి వర్యులు చొరవ తీసుకుని అవార్డులను పున: ప్రారంభం చేయాలని సినీ రంగం తరఫున అభ్యర్థించారు. ప్రముఖ నటి జయసుధ మాట్లాడుతూ కృష్ణ వేణి కుటుంబంతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి సారిపల్లి కొండలరావు అధ్యక్షత వహించారు. సినీ రోజా రమణి డా. కృష్ణక్క , నాగ సుశీల , సుప్రియ, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షులు దామోదర్ ప్రసాద్, సినీ నిర్మాత రామ సత్యనారాయణ, దర్శకులు శివ నాగేశ్వర రావు,మున్నగు వారు కృష్ణ వేణి సేవలను కొనియాడారు. ఆకృతి సుధాకర్ సమన్వయం చేశారు.

సందర్శకుల మన్ననలు పొందుతున్న హస్తకళా మేళా

నవతెలంగాణ-శేరిలింగంపల్లి



మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్స్ మేళ సందర్భంగా చేనేత హస్తకళా మేళాలోని వస్తువులు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సిల్క్, బనారసీ, బెంగళూరు సిల్క్, కలంకారీ కాటన్, సిల్క్, పైతాని, తంజావూర్ పెయింటింగ్స్, పటచిత్ర పెయింటింగ్స్, మధుబని పెయింటింగ్స్, శ్రీకాళహస్తి చెక్క విగ్రహాలు, తోలు బొమ్మలు, బెడ్ షీట్స్, డ్రెస్ మెటీరియల్స్, చిన్న పిల్లలకి పట్టు లంగాలు, ఫ్రాక్స్ సోఫా కవర్లు, లక్క గాజులు, మట్టి కుండలు, మట్టి పాత్రలు, ఎన్నో హస్తకళా ఉత్పత్తులు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. దుర్గేష్ నందిని శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో బ్రహ్మాంజలి, ముద్దుగారే యశోద, నాటేషకౌత్వం, జతిస్వరం, కాలభైరవాష్టకం అంశాలను ప్రదర్శించారు. కుమారి ప్రణవి తుమ్మటి శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో శ్రీవిఘ్న రాజాం, మానస స్తోత్రం, మూషిక వాహన, ముద్దుగారే యశోద, మరకత మణిమయ, రామదాసు కీర్తన, లింగాష్టకం, కృష్ణం కలయ సఖి, గరుడ గమన మొదలైన అంశాలను ప్రదర్శించి మెప్పించారు.

మాజీ ఎమ్మెల్యే కుమారుడిపై లుక్ అవుట్ నోటీస్ జారీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

బోధన్ మాజీ ఎమ్మెల్యే కుమారుడు సోహెల్‌పై పోలీసులు లుక్ అవుట్ నోటీస్ జారీ చేశారు. సోహెల్ పంజాగుట్టలో రాష్ డ్రైవింగ్ చేసి ప్రమాదానికి కారణమయ్యాడని... అయితే ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు తనకు బదులు డ్రైవర్ అబ్దుల్‌ను పోలీస్ స్టేషన్‌కు పంపించినట్టు తెలుస్తోంది. ముంబైకి వెళ్లిపోయిన సోహెల్.. అక్కడి నుంచి దుబాయ్‌కి వెళ్లినట్టు సమాచారం. ఈ క్రమంలో సోహెల్ కోసం పంజాగుట్ట పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. దుబాయ్‌లో ఉన్న సోహెల్‌ను రప్పించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు శుభాకాంక్షలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పౌర సరఫరాలశాఖ కమిషనర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన దేవేంద్ర సింగ్ చౌహన్‌ను తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్), కార్యదర్శి విక్రమ్ కుమార్, జిల్లా ఈసీ మెంబర్ బొల్లిగిద్ద శంకర్‌తో కలిసి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ దేవేంద్ర సింగ్ చౌహన్ ఆధ్వర్యంలో పౌర సరఫరాల శాఖ మరింత సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా పని చేస్తుందని ఆకాంక్షించారు. దేవేంద్ర చౌహన్ మాట్లాడుతూ తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ గురించి, సంఘ కార్యకలాపాల గురించి తనకు బాగా తెలుసని, అందరం కలిసి పని చేయాలని ఆయన కోరినట్టు ముజీబ్ తెలిపారు.



జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఫిలింనగర్‌లోని పటేల్ నగర్ బస్తీ ఇమాన్యుల్ చర్చిలో క్రిస్టియన్ సోదర సోదరీమణలకు స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ క్రిస్మస్ కానుకలను పంపిణీ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షామా మీనిస్ట్రీ అధ్యక్షులు పీటర్, చర్చి పాస్టర్ కృపారావు, శోభన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్



ప్రతి బస్తీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, న్యూ బోయిన్‌పల్లిలోని ప్రతీ బస్తీ, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని మిగితా వారికి స్ఫూర్తి కావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ కోరారు. చిన్నతోకట్ట నక్కలబస్తీలో ఏర్పాటు చేసిన ఐదు సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాల సంఖ్యా తగ్గిందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు రావాలని కోరారు. నక్కలా బస్తీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తనవంతుగా అర్థిక సహాయం అందించానన్నారు. ఈ కార్యక్రమంలో క్రాంతి, అరుణ్ యాదవ్, ముకేశ్, సీతారాం, బస్తీవాసులు పాల్గొన్నారు.



ప్రజా సేవకు అవకాశం ఇవ్వండి

- బండి సదానందం

నవతెలంగాణ-బంజారా హిల్స్


ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తాము పని చేశామని, పార్టీ అధికారంలోకి రావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలంగాణ ప్రజా వేదిక అధ్యక్షుడు బండి సదానందం అన్నారు. బుధవారం ఆయన న్యూ ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు, సీడబ్ల్యూసీ సభ్యుడు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఆఫీస్ ఇన్‌చార్జి సయ్యద్ నసీర్ హుస్సేన్‌ను కలిసి తనకు తెలంగాణ పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మెన్‌గా లేదా పర్యాటక శాఖతో పాటు ఇతర ప్రజా సేవ చేసే కార్పొరేషన్‌లు ఎన్నో ఉన్నాయని అందులోనైన అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజా వేదిక తరుపున తనతోపాటు నేతలంతా అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ముమ్మరంగా ప్రచారం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.పదేండ్ల తర్వాత తెలంగాణలో అసలైన ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని చెప్పారు. ఈసారి తమకు కార్పొరేషన్లలో చైర్మన్‌గా అవకాశం కల్పించడం ద్వారా తెలంగాణ ప్రజా వేదికకు న్యాయం చేసిన వారవుతారని అన్నారు. ఇందుకు నాసీర్ హుస్సేన్ సానుకూలంగా స్పందించారన్నారు. తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించేందుకు సహకారం అందిస్తామని తెలిపారన్నారు. ఈ విషయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.



ఎమ్మెల్యేను సన్మానించిన కాలనీవాసులు

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ శంకర్ ఎంక్లేవ్‌లో బుధవారం కాలనీవాసులు బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో కుకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును సన్మానించారు. ఎమ్మెల్యే మూడోసారి భారీ మెజార్టీతో గెలిచినందుకు కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కాలనీ అధ్యక్షులు, సెక్రటరీ పాల్గొని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల సంఘాలకు, నాయకులకు, నాయకురాళ్లకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు శాంక్షనయిన పనులకు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్ రావు, సీనియర్ నాయకులు నరేందర్ గౌడ్, కర్రె జంగయ్య, మొక్కల నర్సింగ్ రావు, బల్వంత్ రెడ్డి, సయ్యద్ అజాజ్, హరినాథ్ మన్నే, ఉదయ్ యాదవ్, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వూహాలకు అద్దం దేవుడు చేసిన బొమ్మ

నవతెలంగాణ-కల్చరల్

నేడు సాంకేతిక అభివృద్ధి చెంది కత్రిమ మేధ(అర్టిఫిసియల్ ఇంటెలిజెంట్) ప్రాచుర్యంలోకి వచ్చి వ్యక్తి ముఖాన్ని గొంతుని సష్టించడంతో పాటు ఆలోచనలను ప్రభావితం చేసే సష్టికి ప్రతి సృష్టి చేయగల శక్తిని మనిషి కనుగొన్నాడు. 2002 సంవత్సరం లోనే వంద సంవత్సరాలు తరువాత మార్పులను ఊహిస్తూ దేవుడు చేసిన బొమ్మ నాటకాన్ని శ్రీ శైల మూర్తి రాశారు. ఆ నాటకాన్ని మోహన్ సేనాపతి దర్శకత్వంలో ప్రముఖ నాటక సంస్థ రస రంజని కార్యశాలలో శిక్షణ పొందిన నటులచే రవీంద్ర భారతి ప్రధాన వేదికపై బుధవారం ప్రదర్శించారు. యంత్రం గా భావించే రోబో మనసు లేకున్నా ప్రేమతో ఎలా విరహం రొమాన్స్ వంటి భావాలు వ్యక్తం పరిచింది తెలుపుతూ కథాంశం తో దేవుడు చేసిన బొమ్మ నాటకం సాగింది. కె.కే.రెడ్డి, శ్రీ జ సాదినేని,శశిధర్, వెంకట రమణ మూర్తి, బాచి డొక్కాలు పాత్రోచిత నటనతో ఆకట్టుకున్నారు.



ఏడేండ్లయినా పూర్తి కాని డబుల్ ఇండ్లు

- సొంతింటికై నిరీక్షిస్తున్న లబ్దిదారులు
- ప్రభుత్వం మారింది వీరి తలరాతలు మారేనా ?
- అద్దె చెల్లించలేక అవస్థలు, ఆత్మహత్యలు
- ఇండ్ల నిర్మాణంలో నాసిరకంగా కిటికీ ఫ్రేమ్స్, నాణ్యత లేని ప్లైవుడ్ డోర్స్
- పట్టింపు లేని ప్రజాప్రతినిధులు, అలసత్వం వహిస్తున్న అధికారులు, బిల్స్ రాక పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- మార్చి వరకు పూర్తి చేసేందుకు చర్యలు : ఏఈ లలిత



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో తార్నాక డివిజన్ సాయి నగర్‌లో ప్రజాప్రతినిధుల పట్టింపుకరువై, అధికారుల అజమాయిషీ కొరవడి, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఫలితంగా నగరంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం ఏకంగా ఏడేండ్లు అయినా పూర్తికాలేదు. దాంతో ఉన్న గుడిసెలు పొగా సంవత్సరంలో నిర్మాణం పూర్తి చేసి ఇండ్లు ఇస్తాం అని చెప్పడంతో సాయి నగర్ వాసులు చుట్టుపక్కల ప్రాంతాల్లో అద్దె ఇండ్లలోకి వెళ్లారు. ఇటు ఇన్నేండ్లుగా ఇండ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో వారు అద్దె చెల్లించలేక, ప్రజాప్రతినిధుల చుట్టు తిరగలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రకాష్ అనే స్థానికుడు ఇక్కడే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా, ఇంకొందరు మంచాన పడి, ఇతర ఆర్థిక బాధలతో ఈ ఏడేండ్లలో సుమారు 15 మంది వరకు ఈ మరణించారని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ లబ్దిదారుల్లో 75 శాతం ఎస్సీ వారు కాగా, 10 శాతం బీసీ, మిగతా వారు 15 శాతం వివిధ వర్గాల వారుర ఉన్నారు.

జీహెచ్‌ఎంసీ హౌసింగ్ వారి ఆధ్వర్యంలో రూ. 8 కోట్ల 6 లక్షల వ్యయంతో మూడు బ్లాక్‌లలో జీ ప్లస్ 3తో 104 మంది లబ్దిదారులకు ఈ ఇండ్ల నిర్మాణం చేస్తున్నారు. ఒకవైపు రైల్వే అధికారులు చుట్టూ ప్రహరీ నిర్మాణం చేసి, ఇక ఉన్న దారులు మూసివేయడంతో లబ్దిదారులు అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కాంట్రాక్టర్‌కు సుమారు రూ. 55 లక్షల వరకు నిధులు విడుదల కావాల్సి ఉండటంతో పనులు నిలిపివేశారు. కాంట్రాక్టర్ విడుదల ఆయిన నిధుల మేరకే వర్క్ చేయడం, నిధులు విడుదల కానప్పుడు అసలు పనులు చేయక పోవడం ఈ పరిస్థితికి కారణం అంటున్నారు. అలాగే ఐరన్ కిటికీలు నాసిరకం ఉండగా,డోర్స్ ప్లైవుడ్ నీళ్ల పడితే అంతే అంటున్నారు స్థానికులు. ప్రజాప్రతినిధులు, అధికారులు వస్తున్నారు.. పరిశీలిస్తున్నారు తప్ప పని కావడం లేదని లబ్దిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న పనులు

టెర్రస్ ఫ్లోరింగ్, కొన్ని ఫ్లోర్‌లలో ప్లాస్టింగ్, ఫ్లోరింగ్ ? కిటికీ డోర్స్ ? డ్రయినేజీ నిర్మాణం చేయాల్సి ఉంది. దీనికి రైల్వే అధికారుల అనుమతి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.? విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్,మీటర్స్‌తో పాటుగా విద్యుత్ పనులు చేయాల్సి ఉంది.? 2వ, కోటింగ్ పెయింటింగ్‌లాంటి పనులు చేయాల్సి ఉంది.

30 ఏండ్లుగా ఇక్కడే ఉన్నాము



30 ఏండ్లుగా ఇక్కడే గుడిసెల్లో ఉన్నాము. మా పిల్లలకు పిల్లలు ఐయ్యారు. కిరాయిలు చెల్లించ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. చంద్ర బాబు నాయుడు హయాంలో శ్రీనివాస్ యాదవ్ పట్టాలు ఇచ్చారు.

- సి.యచ్.అంజమ్మ


ఇండ్లు కట్టిస్తాం అని గుడిసెలు పీకించారు



ఇక్కడ 30 ఏండ్లుగా ఉంటున్నాము. ఉన్న గుడిసెలు తొలగించారు.7 సంవత్సరాలుగా మా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణంలోనే ఉన్నాయి. ప్రశాంత్ నగర్‌లో నెలకు రూ. 10 వేలకు అద్దె ఇంట్లో ఉంటున్నాం. పద్మరావు వద్దకు ఎప్పుడు వెళ్లినా ఇదో ఇస్తాం అదిగో ఇస్తాం అంటున్నరే తప్ప నిర్మాణానికి ఏడేండ్లు పట్టింది. ఇక్కడ ఆర్థిక ఇబ్బందులతో ఆరుగురి వరకు మరణించారు. ఒకరు ఇక్కడే ఆత్మహత్య చేసుకున్నారు.

- చెన్న.దేవేందర్

పనికూడా దొరకడం లేదు



8 ఏండ్లు అయ్యింది, అయినా పని నడుస్తోంది. ఉప్పరి పనికి పోతా.. ఇప్పుడు పని కూడా దొరకడం లేదు. కిరాయి చెల్లించ లేక కుటుంభ పోషణ భారంగా ఉంది.

- ఎర్రగుంట.భాస్కర్

మమ్మల్ని భయబ్రాంతులకు గురి చేస్తున్నారు



నాడు ఇక్కడ గుడిసెలు వేసుకుంటే రైల్వే వారు వెళ్లగొట్టారు. మాకు నాటి ఎమ్మెల్యే సాయన్న సహాయం చేసిండు. మాకు ఇల్లు కావాలి. ఇతర పార్టీల వద్దకు పొద్దాం అంటే భయబ్రాంతులకు గురి చేస్తున్నారు. కిరాయి ఇంటిలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలి.కిటికీలు, నాసిరకం ఉన్నాయి. ఇక ప్లవుడ్ డోర్స్ కూడా అదే పరిస్థితి.

- నేతకార్ నర్సింగ్ రావు

డబ్బులు లేవని కాంట్రాక్టర్ పనులు చేయడం లేదు



బిల్లుల డబ్బులు రావడం లేదని కాంట్రాక్టర్ ఎన్నోసార్లు పనులు నిలిపివేశాడు. పనుల్లో నాణ్యత లేదు.పద్మరావు త్వరలోనే గృహప్రవేశం చేయిస్తా అంటారు తప్ప నిర్మాణం పనులు అక్కడే ఉన్నాయి. రైల్వే అధికారులు చుట్టూ దార్లు మూసివేసి కనీసం చోటు లేకుండా చుట్టూ ప్రహరీ నిర్మాణం చేశారు. ఇప్పటికే తిరిగి తిరిగి విసుగు వచ్చింది. ఇక తిరిగే ఓపిక లేదు.

- ఎండీ మౌలాలి

ఒక్క సంవత్సరం అని ఏడేండ్లు అవుతోంది



ఒక్క సంవత్సరంలో కట్టిస్తా అన్నారు.. ఏడేండ్లు అయినా నిర్మాణం చేస్తూనే ఉన్నారు. ఈ ఏడేండ్లలో మేము చెల్లించిన కిరాయి డబ్బులతో కనీసం ఇల్లు కొనుక్కునే వాళ్లం కొత్త ప్రభుత్వం స్పందించి నిర్మాణం పూర్తి చేయాలి. కిరాయిలు చెల్లించ లేక స్థానికుడైన ప్రకాష్ చెట్టుకు ఊరేసు కొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంక 10 వరకు మరణించారు.

- బి.మల్లేశం

మార్చి వరకు పూర్తి చేసేందుకు చర్యలు

వచ్చే ఏడాది మార్చి నెల వరకు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. సివరేజ్ పనులకు రైల్వే అనుమతుల కోసం ప్రయత్నాలు చేస్తున్నము. కాంట్రాక్టర్ కూడా బిల్స్ వస్తేనే పనులు చేస్తున్నారు.

- హౌసింగ్ ఏఈ పి.లలిత

ప్రజాపాలనలో సౌకర్యాలు కల్పించాలి

- ఎమ్మెల్యే దానం నాగేందర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ప్రజా పాలన కార్యక్రమానికి సంబంధించి విధివిధానాలపై మంగళవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ దత్తాత్రేయ ద్రోణ్రే , డీఎంసీలు సర్కిల్ 18, 17,నియోజకవర్గ అన్ని శాఖల అధికారులతో స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచనలు చేశారు. ముఖ్యంగా కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలకు అవగాహన కల్పించాల్సిందిగా అధికారులకు సూచించారు. వృద్దులు వికలాంగులకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి పి. విజయ రెడ్డి, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మాన్నే కవిత రెడ్డి, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో లక్షణాలు కనిపిస్తే నగరవాసులు ఆస్పత్రికి పరుగులు తీసి పరీక్షలు చేయించుకుంటున్నారు. నగరంలో ఫివర్ ఆస్పత్రిలో ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయించుకుంటున్న దృశ్యాలు.

వయసు్స 28.. చోరీలు 102

- సింగిల్ గా వస్తాడు,తాళం వేసిన ఇంటికి కన్నమేస్తాడు
- దొంగతనం చేసిన ప్రదేశంలో చోరీ చేసిన వస్తువుల వివరాలు రాసి చీటీ వదలడం అలవాటు
- సెంచరీ దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ, ఇన్‌స్పెక్టర్



నిందితుడు శంకర్

నవతెలంగాణ-ఓయూ

వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలు ప్రారంభించిన వ్యక్తి అనతి కాలంలోనే సెంచరీకి పైగా చోరీలకు పాల్పడ్డాడు. పీడీ యాక్టు పెట్టి సంవ త్సరం పాటు జైల్‌లో ఉంచినా ఆ యువకుని తీరు మారలేదు. ఆ కరుడుగట్టిన దొంగను ఉస్మానియా యూనివర్సిటీ క్రైమ్ పోలీసులు 22 రోజులు శ్రమించి మంగళవారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ పారుపల్లి ఆంజనేయులుతో కలిసి ఓయూ ఏసీపీ సుందరి. సైదయ్య వివరాలను వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా వీపనగండ్ల మండలం తుమ్మకుంట గ్రామం నాగర్లబండ తండాకు చెందిన రత్లావత్ శంకర్ నాయక్‌కు 28 ఏండ్లు. అతను గద్వాల్లో బీఫార్మసీ చదువుతుండగా ఓ హత్యాయత్నం కేసులో 2012లో జైలుకు వెళ్లివచ్చాడు. జైలు నుంచి విడుదలైన అనంతరం మద్యం, సిగరెట్లు, గంజాయి వంటి వ్యసనాలకు అలవాటు పడి, రాత్రుళ్లు బయట తిరిగేవాడు. అతడి జల్సాలకు తన సంపాదన సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో చోరీలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో రాజేశ్ రెడ్డి, రంగారావు, లియాజాఖాన్ తదితర పేర్లతో చలామణి అయ్యాడు. కాలనీలు, వివిధ ప్రాంతాల్లో పగలు తాళం వేసి ఉన్న ఇండ్లను గమనించి, రాత్రి సమయాలలో ఐరన్ రాడ్ సహాయంతో చాకచక్యంగా తలుపు తెరిచి దొంగతనానికి పాల్పడేవాడు. 2022 సెప్టెంబర్‌లో మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి పాల్పడి, పోలీసులకు చిక్కడంతో పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపారు. అప్పటికీ అతడు చేసిన చోరీల సంఖ్య 94. మూడు నెలల క్రితం జైలు నుంచి విడుదలైన శంకర్ నాయక్ తన వైఖరిని మార్చుకోక ఎనిమిది దొంగతనాలు చేశాడు. వాటిలో మూడు ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో కాగా, ఉప్పల్, కుషాయిగూడ, జడ్చర్ల టౌన్, సంగారెడ్డి రూరల్, నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్లలో ఒక్కొక్కటి చొప్పున ఉండడం గమనార్హం. ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 5లో నివాసముండే లగిశెట్టి రాజు తన కుటుంబంతో సహా గత సెప్టెంబర్ 17న స్వగ్రామానికి వెళ్లి, 20న తిరిగివచ్చే సమయానికి ఇల్లు తాళం తీసి ఉండడంతో పాటు సామాన్లన్నీ చిందం`వందరగా పడి ఉండడం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోని 19.1 తులాల బంగారు ఆభరణాలు, కొన్ని యూఎస్ డాలర్లు, కొంత నగదు చోరీకి గురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ కేసు విషయాన్ని సీరియస్ గా తీసుకున్న పోలీసులు నగర వ్యాప్తంగా సీసీ ఫుటేజీలను జల్లెడ పట్టి విచారణ జరిపారు. ఈ క్రమంలో నిందితుడు మంగళ వారం సాయంత్రం అమీర్ పేట్‌లో సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి, విచారించగా నేరాలను ఒప్పుకున్నాడు. అతడి నుంచి 20 తులాల బంగారు ఆభరణాలు, బైక్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

సింగిల్ గా విన్నూత చోరీలు

శంకర్ నాయక్ చోరీ విధానం చూసి పోలీసులు సైతం అవాక్కయిన ఘటన చోటు చేసుకుంది. తాను చోరీ చేసిన ప్రదేశంలో అక్కడ దొంగతనం చేసిన వస్తువుల వివరాలను ఒక చీటీలో రాసి అక్కడ వదిలేవాడు. చీటీ దొరకని పక్షంలో గోడపై వివరాలను రాసేవాడు. అంతేకాకుండా, అన్ని చోరీల వివరాలు, అక్కడ చోరీ చేసిన వస్తువుల వివరాలను తన వ్యక్తిగత డైరీలో ఎప్పటికప్పుడు పొందుపరచడం గమనార్హం. గతంలో ఒక చోరీ చేసిన సమయంలో అక్కడ ఏమీ లభించకపోయినా అయిదు తులాల బంగారు ఆభరణాలు పోయాయని ఇంటి యజ మాని ఫిర్యాదు చేయడం, పోలీసులు తన నుంచి రికవరీ చేయడంతో అప్పటి నుంచి ఈ అలవాటు చేసుకున్నానని శంకర్ నాయక్ చెప్పడం విశేషం.

విలాసవంతమైన జీవితం..ఖరీదైన వస్త్రాలు.

ఇలా చోరీలకు పాల్పడిన నగదు తో శంకర్ ముంబయి, గోవా, వైజాక్ లాంటి పట్టణాల్లో ఖరీదైన హెూటల్లో ఉంటాడు. ఇక అతను వాడే 3 సెల్ ఫోన్స్, వాడే వస్త్రాలు, చెప్పులు అన్ని కూడా అత్యంత ఖరీదైనవే.. ఇవన్ని తనకు ఇష్టమైన ఒక స్నేహితుని కోసమే చేసినట్టు తెలుస్తోంది. అతని కోసం నగరంలోని మూడు కమిషనరేట్ల పోలీసులు గాలించారు.

ఐఎఫ్‌ఎల్‌లో 10 తులాలు, కొల్లాపూర్ ఐఎఫ్‌ఎల్‌లో ఐదున్నర తులాలు, విజయవాడ మన్నిపురంలో 8 తులాలు బంగారం తాకట్టు పెట్టాడని వాటిని త్వరలోనే రివకరి చేసేందుకు కృషి చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.ఈ విలేకరుల సమావేశంలో ఓయూ డిఐ దొంగరి శ్రీనివా సరావు, ఎస్ఐ మాషీన్ షరీఫ్,వెంకటేష్, ప్రభాకర్, రమాకాంత్, కృష్ణ, సతీష్, ఈశ్వర్ పాల్గొన్నారు. దొంగను పట్టుకున్న టీంను ఏసీపీ అభినందించారు.

ఎమ్మెల్యే పద్మారావు ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూజ



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మోండా మార్కెట్‌లోని టకార బస్తీ నివాసం వద్ద అయ్యప్ప పడి పూజ ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్‌తో పాటు కంటోన్మెంట్, సనత్ నగర్ తదితర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకారంతో రూపుదిద్దుకున్న మహా పడి వద్ద భజనలు, ఆధ్యాత్మిక సంకీర్తనలు భక్తులను ఆనంద పారవశ్యంతో ముంచెత్తాయి.

ఘనంగా 33వ మహాపడి పూజ

లాలాపేట్ లక్ష్మి గణపతి సాయి అయ్యప్ప దేవస్థానం, అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో బుధవారం ఆలయంలో తెల్లవారుజామున నుంచి ప్రత్యేక పూజలు ఘనంగానిర్వహించారు. అనంతరం 33వ, మహాపడి పూజ సందర్భంగా అన్నదాన కార్యక్రమన్ని నిర్వహిం చారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.అన్నదాన కార్యక్రమంలో ఇటు స్వాములు ,భక్తులు 2010 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బుద్ద బలరాజ్ గుప్తా, చైర్మెన్ పరమేశ్వర్ గౌడ్‌తో పాటుగా ఆలయ కమిటీ, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.





పల్లవి మోడల్ హై స్కూల్ 30 వ వార్షికోత్సవం హరి హర భవన్‌లో బుధవారం కనుల పండుగగా జరిగింది. వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా పల్లవి మోడల్ స్కూల్ చైర్మెన్ కొమురయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థులను దేశం గర్వపడేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యాభ్యాసం తో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మిస్టర్ ఇండియా 17 అక్షయ నీలకంఠం, డాక్టర్ శివాని కోహ్లీ,పల్లవి మోడల్ హై స్కూల్ ప్రిన్సిపల్ రేణు చక్రవర్తి, విద్యార్థులు పాల్గొన్నారు

నవతెలంగాణ-బేగంపేట

కొత్త ఏడాది వస్తుందనగానే ప్రతి ఒక్కరిలోనూ కచ్చితంగా ఎంతో కొంత ఎగ్జైట్ మెంట్ అనేది కనబడుతూ ఉంటుంది. న్యూ ఇయర్ సందర్భంగా మనలో చాలా మంది డిసెంబర్ 31వ తేదీన అర్థరాత్రి కరెక్టుగా పన్నెండు గంటల సమయంలో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకుంటూ ఉంటారు. ఈ సమయంలో బేకరీలలో దొరికే కేకులకు మంచి డిమాండ్ ఉంటుంది. అయితే ఇంట్లోనే చాలా ఈజీగా అది కూడా అతి తక్కువ ఖర్చుతో న్యూ ఇయర్ కేకులని తయారు చేసుకోవచ్చు. అవేంటో చూద్దాం...

కేక్స్‌తో ఖుషీగా





ఆరెంజ్ కేక్

కావల్సిన పదార్థాలు : వెన్న - అరకప్పు, చక్కెర - ఒకటిన్నర కప్పు, గుడ్లు - ఆరు, ఆరెంజ్ - రెండు (తొక్కతీసి కట్ చేసిన పళ్ళు), కేక్ పౌడర్ - నాలుగు కప్పులు, అల్యూమినియం పేపర్ - చిన్నది, పాలు - పావు కప్పు, చక్కెర పొడి - ఒక కప్పు, కొబ్బరి తరుగు - ఇష్టం వుంటే.

తయారు చేసే విధానం : పదార్థాలన్నీ గది ఉష్ణోగ్రత వద్ద ఉండేలా చూసుకోవాలి. తర్వాత ఒక గిన్నెలో వెన్న వేసుకుని బాగా మిక్స్ చేయాలి. చక్కెర, గుడ్లు కూడా బాగా వేసి కలుపుకోవాలి. అందులో ఆరెంజ్ ముక్కలు కూడా వేసి బాగా కలపాలి. ఇందులో పాలు, పిండి నెమ్మదిగా వేస్తూ కలుపుకోవాలి. మిగిలిన పదార్థాలు కూడా వేసుకుని కలుపుకోవాలి. తర్వాత మిశ్రమాన్ని మరీ మందంగా లేదా మరీ పలుచగా కాకుండా కేక్ పాన్‌లో వేసుకోవాలి. మిశ్రమాన్ని వేసుకునే ముందు దానిపై కొద్దిగా వెజిటేబుల్ ఆయిల్‌ని రాయాలి. దీన్ని ఓవెన్‌లో పెట్టుకోవాలి. 45 నిమిషాల పాటు ఓవెన్‌లో 350 ఫాంరన్ హీట్ వద్ద వుంచాలి. ఎంతో రుచిగా వుండే కేక్ రెడీ. దీనిపై క్రీమ్‌తో డెకరేషన్ చేసుకోవాలి. దానిపై చెర్రీస్ అమరిస్తే మరింత బాగుంటుంది.

చాక్లెట్ కాష్యూనట్ ట్రఫెల్


కావల్సిన పదార్థాలు : జీడిపప్పు పొడి - అరకేజీ (జీడిపప్పుని మిక్సీలో పొడి చేసుకోవాలి), గుడ్లు - తొమ్మిది,



కోకోపొడి - వంద గ్రాములు, బేకింగ్ పౌడర్ - ఐదు గ్రాములు, క్యాస్టర్ షుగర్ - ఐదు వందల గ్రాములు, మైదా - అరకిలో, ట్రఫెల్ కోసం - పావుకిలో ఫ్రెష్ క్రీం, డార్క్ చాక్లెట్ - అరకిలో.

తయారు చేసే విధానం : గుడ్లు, క్యాస్టర్ షుగర్ బాగా కలుపుకొని బీటర్ సాయంతో గిలకొట్టాలి. ఇప్పుడు జీడిపప్పు పొడి, కొకొపొడి, మైదా, బేకింగ్ పొడీ కలుపుకుని కోడిగుడ్ల మిశ్రమంలో వేసుకోవాలి. ఇప్పుడు కేకులు తయారు చేసే కేక్ టిన్ తీసుకొని అందులో ఈ మిశ్రమం వేసి ఓవెన్‌లో 150 డిగ్రీల వద్ద ఇరవై నిమిషాల పాటు బేక్ చేయాలి. ఇంకో పాత్ర తీసుకొని అందులో చాక్లెట్, తాజా క్రీం కలుపుకొని చాక్లెట్ కరిగేంత వరకూ వేడి చేసి పక్కన పెట్టుకోవాలి. ఇదే ట్రఫెల్. ఇప్పుడు ముందుగా చేసి పెట్టుకున్న కేక్‌ని గిన్నెలోంచి బయటకు తీసి దానిని మూడు పొరలుగా కత్తిరించుకుని, శాండ్‌విచ్ తరహాలో ఒక్కో పొరకూ ట్రఫెల్ రాయాలి. పై పొరపై మిగిలినదంతా వేసేయాలి. గంట పాటు ఫ్రిజ్‌లో ఉంచిన తర్వాత వడ్డించుకోవచ్చు.

యాపిల్ కేక్



కావల్సిన పదార్థాలు : యాపిల్ ముక్కలు - ఐదు కప్పులు (తొక్కతీసి చిన్న ముక్కలుగా కట్ చేసినవి), చక్కెర - కప్పు, బ్లాక్ రెయిసిన్స్ - కప్పు, డ్రై ఫ్రూట్స్ - కప్పు, పీకాన్స్ - కప్పు, వెజిటేబుల్ ఆయిల్ - పావు కప్పు, వెనీలా - రెండు స్పూన్లు, గుడ్లు - బాగా బీట్ చేసినది ఒకటి, మిక్స్‌డ్ కేక్ ఫ్లోర్ - రెండున్నర కప్పులు, బేకింగ్ సోడా - ఒకటిన్నర కప్పు, దాల్చిన చెక్కడ పొడి - ఒక స్పూను.

తయారు చేసే విధానం : ఒక వెడల్పాటి గిన్నె తీసుకుని అందులో యాపిల్ ముక్కలు, చక్కెర, పీకాన్స్, రెయిసిన్స్ అన్నీ వేసుకోవచ్చు. దీన్ని 35-40 నిమిషాల పాటు ఓవెన్‌లో పెట్టాలి. టెంపరేచర్ 350 ఫారన్ హీట్ వుండేలా చూసుకోవాలి. దీన్ని సర్వ్ చేసే ముందు ఫ్రిజ్‌లో పెట్టి కాస్త కూల్‌గా వుండేలా అందించాలి.

స్వీట్ రైస్ కేక్



కావల్సిన పదార్థాలు : బియ్యప్పిండి - వంద గ్రాములు, మైదాపిండి, మొక్కజొన్న పిండి - అర టేబుల్ స్పూన్ చొప్పున, బ్రౌన్ షుగర్ - అరవై గ్రాములు, నీళ్లు - కప్పు(గోరువెచ్చగా చేసుకోవాలి), నూనె - రెండు టేబుల్ స్పూన్లు, గుడ్డు - ఒకటి.

తయారు చేసే విధానం : ముందుగా ఒక గిన్నెలో ఒక కప్పు గోరువెచ్చని నీటిలో బ్రౌన్ షుగర్‌ను కరిగించాలి. అందులో బియ్యప్పిండి, మొక్కజొన్న పిండి, మైదాపిండి ఒకదాని తర్వాత ఒకటి జల్లెడ పట్టుకోవాలి. అనంతరం ఉండలు లేకుండా కలుపుకోవాలి. అందులో నూనె జోడించి, హ్యాండ్ హెల్డ్ మిక్సర్‌తో బాగా కలుపుకోవాలి. తర్వాత చిన్న కేక్ కంటైనర్ లోపల కొద్దిగా నూనె రాసి, అందులో ఈ మిశ్రమాన్ని వేసుకోవాలి. అనంతరం 45 నిమిషాల పాటు ఆవిరిపై ఉడికించుకోవాలి. కేక్ చల్లారాక రాత్రంతా ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. అనంతరం నచ్చిన విధంగా కట్ చేసుకుని వాటిని గుడ్డు మిశ్రమంలో ముంచి ఇరువైపులా పాన్‌పై వేయించుకుని సర్వ్ చేసుకోవాలి.

అక్రోట్స్‌తో ఆరోగ్యం



డ్రై ఫ్రూట్స్ జాబితాలో అత్యధిక పోషకాలు గలిగిన అక్రోట్ ముందుంటుంది. మెదడు పనితీరును పెంచటానికి ఇదెంతో మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యానికి అక్రోట్ చేసే మేలు గురించి తెలుసుకుందాం.

- మానసిక ఒత్తిడికి అక్రోట్స్ మంచి ఔషధం. అక్రోట్స్‌లోని 'మెలటోనిన్' సుఖ నిద్రకు, చక్కని జ్ఞాపకశక్తికి దోహదం చేస్తుంది.
- అక్రోట్స్‌లో ఎక్కువగా ఉండే పీచు జీర్ణకోశ సమస్యలను నివారిస్తుంది. ఇందులో లభించే విటమిన్ ఇ చర్మాన్ని తాజాగా ఉంచుతుంది.
- బోలెడన్ని యాంటీ ఆక్సిడెంట్స్ కలిగిన అక్రోట్ రోగనిరోధక శక్తిని పెంచి రోగాలబారిన పడకుండా కాపాడుతుంది.
- అక్రోట్ వినియోగంతో రక్తంలోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. దీనివల్ల హృదయ రోగాలు నివారించబడతాయి.
- దీనిలో విరివిగా లభించే ఫాటీ ఆమ్లాలు, ఫైటో న్యూట్రియంట్స్ క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గిస్తాయి. చికిత్స పొందే రొమ్ము క్యాన్సర్ బాధితులు రోజుకో కప్పు అక్రోట్స్ తినటం వలన క్యాన్సర్ కణాల ఎదుగుదల మందగిస్తుంది.
- అక్రోట్స్‌లోని ఒమేగా-3 ఫాటీ ఆమ్లాలు గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాలను ఆరోగ్యంగా ఉంచటమే గాక చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. రక్త పీడనం కూడా అదుపులో ఉండేలా చూస్తాయి. ఈ ఆమ్లాలు గర్భస్థ శిశువు ఆరోగ్యాన్ని కాపాడటంతో బాటు సరైన సమయంలో ప్రసవం అయ్యేలా చేస్తాయి.
- రోజూ అక్రోట్ వాడే వారికి ఊబకాయం, జీవక్రియ లోపాలు, రక్తంలోని మోతాదుకు మించి కొవ్వు చేరటం, అధిక రక్త పోటు వంటి ఇబ్బందుల ముప్పు గణనీయంగా తగ్గుతుంది. రోజూ నాలుగైదు అక్రోట్స్ తినేవారికి పిత్తాశయ రాళ్ళ సమస్య రాదు.

పనులు సులభమయ్యేలా...



ఒక్క చిన్న చిట్కా మీ పని తీరునే మార్చేస్తుంది. సమయం వృథా ఉండదు. డబ్బు ఖర్చు లేదు. మరెన్నో లాభాలు ఉన్నాయి. కిచెన్‌లో ఇట్టే పనులు చక్కబెట్టడానికి కొన్ని చిట్కాలు మీ కోసం..

- నూనెలో పచ్చి మిరపకాయలను వేయించేటప్పుడు మధ్యలోకి చీల్చితే అవి పేలకుండా ఉంటాయి.
- పచ్చిమిరపకాయలు ఎక్కువ కాలం ఫ్రెష్‌గా ఉండాలంటే వాటి తొడిమలను తొలగించి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి.
- అన్నం తెల్లగా ఉండాలంటే ఉడికే సమయంలో రెండు చుక్కల నిమ్మరసం వేసుకోవాలి.
- దోశల పిండి ఎక్కువ పులిసిపోతే కాస్త గోధుమ పిండి చేర్చి వేసుకుంటే దోశలు రుచిగా తయారవుతాయి.
- చపాతీ పిండిలో కాసిని పాలు కలిపితే చపాతీలు మృదువుగా వస్తాయి.
- పెరుగు పులిసిపోకుండా ఉండాలంటే ఒక చిన్న పచ్చి కొబ్బరి ముక్క వేసి చూడండి.

ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్ పరీక్షలు!

(మొదటిపేజి తరువాయి)

తెలిసింది. దీంతో మార్చి 14 నుంచి పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు-2024 ప్రారంభమవుతాయి. అదేనెల 26 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగం రూపొందించింది. ఈ విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి కొన్ని మార్పులు జరిగే అవకాశమున్నది. జనరల్ సైన్స్‌కు సంబంధించి ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు ఒకే పరీక్షను నిర్వహిస్తున్నారు. అంటే ఒకేరోజు రెండు ప్రశ్నాపత్రాలతో పరీక్షలు జరుగుతున్నాయి. ఇది విద్యార్థులకు కొంత ఇబ్బందికరంగా మారిందని విద్యాశాఖ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో విద్యార్థుల సౌకర్యార్థం ఆ రెండు సబ్జెక్టులకు వేర్వేరు పరీక్షలను వేర్వేరు తేదీల్లో నిర్వహించాలని ఎస్సీఈఆర్టీ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రితో జరిగే సమావేశంలో దీనిపైనా స్పష్టమైన నిర్ణయం వెలువడే అవకాశమున్నది. దీంతో పదో తరగతి విద్యార్థులు ఆరు పేపర్లకు ఏడు పరీక్షలను రాయాల్సి ఉంటుంది.

ఫిబ్రవరి రెండోవారంలో ఎంసెట్ నోటిఫికేషన్!

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్‌తోపాటు వివిధ వృత్తివిద్యా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే వివిధ ప్రవేశ పరీక్షలకు సంబంధించి విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రవేశ పరీక్షల నిర్వహణ, నోటిఫికేషన్ విడుదల, రాతపరీక్షల తేదీలు వంటి అంశాలపై బుధవారం సచివాలయంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్కే మహమూద్, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు హాజరయ్యారు. ప్రవేశ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏటా ఎలాంటి పద్ధతులను అనుసరిస్తారో లింబాద్రి వివరించినట్టు తెలిసింది. విశ్వవిద్యాలయాల పాత్ర, ఉన్నత విద్యామండలి సమన్వయం గురించి చెప్పినట్టు సమాచారం. కన్వీనర్ల నియామకం, సెట్స్ కమిటీల ఏర్పాటు, సమావేశాల నిర్వహణ వంటి అంశాలను ముఖ్యకార్యదర్శి దృష్టికి తెచ్చారు. ఫిబ్రవరిలో ఎంసెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. మే రెండో వారంలో ఎంసెట్ రాతపరీక్షలను నిర్వహించాలని ప్రాథమికంగా ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) రాతపరీక్షలకు ఇబ్బంది లేకుండా ఎంసెట్ షెడ్యూల్‌ను తయారు చేస్తారు. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు జేఈఈ మొదటి విడత, ఏప్రిల్ ఒకటి నుంచి 15 వరకు రెండో విడత రాతపరీక్షలు జరుగుతాయని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. అయితే విద్యార్థులు ఎంసెట్‌కు సన్నద్ధం అయ్యేందుకు కొంత సమయం ఇచ్చి రాతపరీక్షలను నిర్వహించే అవకాశమున్నది. అందుకే మే రెండో వారంలో ఎంసెట్ రాతపరీక్షలను నిర్వహించాలని భావిస్తున్నారు. ఐసెట్, ఈసెట్, ఎడ్‌సెట్, లాసెట్, పీజీఈసెట్, పీఈసెట్ రాతపరీక్షల తేదీలు, నోటిఫికేషన్లపైనా చర్చించినట్టు తెలిసింది.

గ్రూప్-2 మరోసారి వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చేనెల ఆరు, ఏడు తేదీల్లో నిర్వహించతలపెట్టిన గ్రూప్-2 రాతపరీక్షలు మరోసారి వాయిదా పడ్డాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి అనితా రామచంద్రన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-2 రాతపరీక్షలను ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. తొలుత ఆగస్టు 29,30 తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు మొదటిసారి వాయిదా వేసింది. గ్రూప్-2 రాతపరీక్షలను నవంబర్ రెండు, మూడు తేదీల్లో నిర్వహించనున్నట్టు ప్రకటించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లోకి రావడం వల్ల మరోసారి గ్రూప్-2 రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వం మారడం, టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యులు రాజీనామా చేయడం వంటి కారణాలతో గ్రూప్-2 రాతపరీక్షలు ముచ్చటగా మూడోసారి వాయిదా పడ్డాయి. దీంతో నిరుద్యోగుల్లో ఉన్న ఆందోళనలకు తెరపడింది.

ఇక భారత్ బియ్యం!

(మొదటిపేజి తరువాయి)

ఇంకేమీ రేషన్ దుకాణాలలో దొరకడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పాతిక రూపాయలకే కిలో బియ్యం విక్రయిస్తామని చెప్పడం కేవలం ఎన్నికల ఎత్తుగడేనని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇతర నిత్యావసరాల సరఫరా మాదిరిగానే ఇది కూడా మూడునాళ్ల ముచ్చటే అవుతుందని పెదవి విరుస్తున్నారు.

ప్రస్తుతం కిలో బియ్యం జాతీయ సగటు చిల్లర ధర రూ.43.30కి చేరింది. సంవత్సరం క్రితం నాటి ధరతో పోలిస్తే ఇది 14.1% ఎక్కువని వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చెబుతోంది. పెరుగుతున్న ధరలను, తద్వారా ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకే సబ్సిడీ ధరతో భారత్ బియ్యాన్ని విక్రయించాలని ప్రభుత్వం యోచిస్తోందని అధికారులు చెబుతున్నారు. దీనిపై మరింత వివరణ కోరుతూ వినియోగ వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖను సంప్రదించినప్పటికీ సమాధానం రాలేదు.

ప్రస్తుతం భారత్ బ్రాండ్‌తో కిలో గోధుమ పిండిని రూ.27.50కి, పచ్చి శనగపప్పును రూ.60కి విక్రయిస్తున్నారు. వీటిని దేశవ్యాప్తంగా 2,000 ఔట్‌లెట్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. భారత్ దాల్, భారత్ అట్టాను ఏ విధంగా విక్రయిస్తున్నారో భారత్ బియ్యాన్ని కూడా అదే విధంగా అమ్ముతామని అధికారులు తెలిపారు. ఇటీవల ఉల్లి ధరలు మళ్లీ పెరగడంతో ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా సబ్సిడీ రేటుకు ఉల్లిగడ్డలను విక్రయించింది. మదర్ డెయిరీకి చెందిన కిరాణా సరకుల విక్రయ విభాగం సఫల్ ద్వారా కూడా ఉల్లి అమ్మకాలు జరిగాయి.

నిత్యావసర ఆహార వస్తువుల ధరలు స్థిరంగా ఉండేలా చూసేందుకు ప్రభుత్వం గత కొన్ని నెలలుగా పలు చర్యలు చేపడుతోంది. బాసుమతి యేతర బియ్యం ఎగుమతులపై జూలైలో నిషేధం విధించింది. ఆగస్టులో బాసుమతి బియ్యం ఎగుమతి ధరను టన్నుకు 1,200 డాలర్లుగా నిర్ణయించింది. ఆ తర్వాత ఆ ధరను 950 డాలర్లకు తగ్గించింది. దేశీయ మార్కెట్‌లో బియ్యం లభ్యతను పెంచేందుకు బహిరంగ మార్కెట్ అమ్మకపు పథకం (ఓఎంఎస్-ఎస్) కింద నాలుగు లక్షల టన్నుల బియ్యాన్ని ఈ-వేలం ద్వారా ఎఫ్‌సీఐ అమ్మకానికి పెట్టింది. కిలో బియ్యం ధరను రూ.29-29.73గా నిర్ణయించింది. తాజా వేలంలో 13,164 టన్నుల బియ్యాన్ని అమ్మింది. ప్రభుత్వం వద్ద ప్రస్తుతం 17.9 మిలియన్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయి.

ఆహారధాన్యాల ధరలు గత నెలలో 10.3% పెరిగాయి. దీంతో ఆహార ద్రవ్యోల్బణం 8.7 శాతానికికి చేరింది. అక్టోబరులో ఇది 6.61 శాతానికిగా ఉంది. మొత్తం వినియోగ ధరల సూచీ (సీపీఐ)లో ఆహార ద్రవ్యోల్బణం దాదాపు సగంగా నమోదైంది. ఈ శీతాకాలంలో వర్షపాతంపై ఎల్‌నినో ప్రతికూల ప్రభావం చూపుతుందని అంచనా వేస్తున్నారు. దీనివల్ల గోధుమ వంటి కీలక రబీ పంటల దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఫలితంగా ఆహారధాన్యాల ద్రవ్యోల్బణం మరింత పెరగవచ్చు.

సబ్సిడీ ధరతో ఆహార ధాన్యాలు అందించినంత మాత్రాన అల్పాదాయ వర్గాల ప్రజలకు పెద్దగా ఒరిగేదేమీ ఉండదని ఇండియా రేటింగ్ సంస్థ ప్రధాన ఆర్థికవేత్త దేవేంద్ర పంత్ అభిప్రాయపడ్డారు. ఆహారధాన్యాలు, పప్పులు... ఈ రెండింటికీ ద్రవ్యోల్బణంతో సంబంధం ఉన్నదని ఆయన తెలిపారు. నిషేధం విధించినప్పటికీ గోధుమ ధరలు ఎందుకు పెరుగుతున్నాయో ఆలోచించాలని అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి వినియోగ ధరల సూచీ 4 శాతానికి తగ్గవచ్చునని, కానీ ద్రవ్యోల్బణం మాత్రం ఈ ఆర్థిక సంవత్సరంలో సగటున 5.2-5.3 శాతంగా ఉంటుందని ఆయన వివరించారు.

సింగరేణిలో ఏఐటీయూసీ విజయం

(మొదటిపేజి తరువాయి)

అత్యధిక ఓట్లు రావడంతో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఎన్నికైంది. మొత్తంగా ఏఐటీయూసీకి 1,983 ఓట్ల మెజార్టీ సాధించింది. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం-1, రామగుండం-2 లో ఏఐటీయూసీ విజయం సాధించింది. హైదరాబాద్ హెడ్ ఆఫీస్, కొత్తగూడెం, మణుగూరు, భూపాలపల్లి, ఇల్లందు, రామగుండం-3 లో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. చివరి వరకు ఉత్కంఠగా జరిగిన పోటీలో అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఏఐటీయూసీ ఆధిక్యతను ధృవీకరించారు. అయితే అధికారికంగా ఇంకా ఫలితం వెల్లడి కావల్సి ఉంది.

అనేక ఒడిదుడుకులు ఉత్కంఠ, కోర్టు వాయిదాలు మొట్టికాయల మధ్య ఎట్టకేలకు సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్‌ల్లోని సింగరేణి వ్యాప్తంగా 12 ఏరియాల్లో జరిగిన ఎన్నికల్లో 13 కార్మిక సంఘాల పోటీ పడ్డాయి. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్, బీఎంఎస్, టీబీజీకేఎస్ పోటీలో ఉన్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు మధ్య పోలింగ్ జరిగింది. బుధవారం ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, సింగరేణి ఉద్యోగులు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్మికులు పోటెత్తారు. సాయంత్రం 5గంటల వరకు జరిగిన ఈ ఎన్నికల్లో సింగరేణి వ్యాప్తంగా 95శాతం పోలింగ్ నమోదైంది. ఆయా సంఘాలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పోలింగ్ కేంద్రాల సమీపంలో కార్మికులు, సంఘాల నాయకులతో సాధారణ ఎన్నికల సందడి వాతావరణం నెలకొంది.



ఏరియాల వారీగా సరళి..

ఇల్లందు డివిజన్‌లో 614 మందికిగాను 604ఓట్లు (98.37శాతం), మణుగూరులో 2450 ఓట్లలో 2378 (97.06శాతం), కార్పొరేట్ డివిజన్‌లో 1191ఓట్లలో 1149 (96.47శాతం), కొత్తగూడెం డివిజన్‌లో 2326 ఓట్లలో 2207 మంది.. కార్మికులు తమ ఓటు వేశారు. కరీంనగర్ జిల్లాలోని రామగుండం డివిజన్ వన్ పరిధిలో 5384 ఓట్లకుగాను 5044(93.70శాతం), ఆర్జీ-2లో 3556 ఓట్లలో 3369 (94.74శాతం), ఆర్జీ-3లో 3884 ఓట్లలో 3612 (93.00శాతం) కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భూపాల్‌పల్లి డివిజన్‌లో 5442 ఓట్లలో 5123 (94.13శాతం), బెల్లంపల్లి డివిజన్‌లో 996 ఓట్లలో 959 (96.30 శాతం), మందమర్రి డివిజన్‌లో 4835ఓట్లలో 4515(93.40 శాతం), శ్రీరాంపూర్‌లో 9124 ఓట్లలో 8491 (93.00శాతం) ఓట్లు పోలయ్యాయి. మొత్తం సింగరేణి వ్యాప్తంగా 39805 ఓట్లలో 37,451 (95శాతం) మంది కార్మికులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

అందిన సమాచారం మేరకు ఫలితాలు

ఇల్లందు ఐఎన్‌టీయూసీ ఖాతాలో పడింది. ఇల్లెందులో 46 ఓట్ల తేడాతో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేటు ఏరియాలో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. ఐఎన్‌టీయూసీ యూనియన్ 288 ఓట్లతో విజయం సాధించింది. బెల్లంపల్లి ఏరియాలో ఏఐటీయూసీ విజయం సాధించింది. 112 ఓట్ల ఆధిక్యంతో గెలిచింది. హైదరాబాద్ హెడ్ ఆఫీసులో ఐఎన్‌టియూసీకి మెజారీటి ఓట్లు పడ్డాయి. శ్రీరాంపూర్, భూపాలపల్లి, మందమర్రి, రామగుండ ఏరియాల్లో ఓట్లు అధికంగా ఉన్నాయి. ఫలితం వెలువడడానికి ఆలస్యం అవుతుందని అధికారులు వెల్లడించారు.

ఎంఫిల్‌లో చేరొద్దు

(మొదటిపేజి తరువాయి)

కోరుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఎంఫిల్ అనేది గుర్తింపు పొందిన డిగ్రీ కాదని పేర్కొన్నారు. ఈ ప్రోగ్రామ్‌ను ఉన్నతవిద్యా సంస్థలు అందించరాదంటూ యూజీసీ నిబంధనలు -2022 రెగ్యులేషన్ నెంబర్ 14 స్పష్టంగా చెబుతోందని అన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఎంఫిల్‌లో ప్రవేశాల ప్రక్రియను నిలిపివేసే చర్యలు చేపట్టాలని యూనివర్సిటీ అధికారులను ఆదేశిస్తున్నట్టు తెలిపింది.

బీఆర్ఎస్ తాత్సారం చేయలే.. కేంద్రానిదే వివక్ష

(మొదటిపేజి తరువాయి)

ఎన్నోసార్లు కలిశారనీ, పదుల సంఖ్యలో లేఖలు రాశారని తెలిపారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాటలు విడ్డూరంగా ఉన్నాయని విమర్శించారు. రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా మారుస్తామని గడ్కరీ ఇచ్చిన హామీని నెరవేర్చలేదని చెప్పారు. పార్లమెంట్‌లో కొట్లాడి ఎయిమ్స్ తెచ్చామన్నారు. జిల్లాకో నవోదయ పాఠశాల ఏర్పాటు, బయ్యారంలో ఉక్కుఫ్యాక్టరీ, ఖాజీపేటలో రైల్వే కోచ్‌ల తయారీ ఫ్యాక్టరీ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, భద్రాచలం-కౌటాల జాతీయ రహదారి, 34 అసెంబ్లీ సీట్ల పెంపు లాంటి అంశాలను కేంద్రం పట్టించుకోలేదని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ఇరిగేషన్ ప్రాజెక్టు కు జాతీయ హెూదా అడిగితే స్పందించలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సమస్యలపై ప్రధాని మోడీకి వివరించి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై వివరించడం సంతోషకరమన్నారు. విభజన హామీల కోసం కొట్లాడాలన్నారు. మీడియా సమావేశంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మెన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి షర్మిల..!

(మొదటిపేజి తరువాయి)

లోకసభ ఎన్నికలకు సన్నద్ధత, అనుసరించాల్సిన వ్యూహాలు, పొత్తులు, చేరికలు, పార్టీ బలోపేతం, ఏపీ ప్రజలకు కాంగ్రెస్ గ్యారెంటీలపై చర్చించారు. ఏపీ కాంగ్రెస్ కార్యక్రమాల రిపోర్ట్‌ను అధిష్టానానికి రుద్రరాజు అందజేశారు. అలాగే ఏపీలో కాంగ్రెస్ విజయానికి రూపొందించిన యాక్షన్ ప్లాన్ నివేదికనూ అందజేశారు. అనంతరం ఏపీ ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్ మీడియాతో మాట్లాడుతూ రానున్న లోకసభ ఎన్నికలపై చర్చించామని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ ఏపీలో కాంగ్రెస్‌ను పునర్నిర్మిస్తామని, కాంగ్రెస్ సిద్ధాంతం నమ్మే వారిని స్వాగతిస్తున్నామని అన్నారు. రాబోయే ఏపీ అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలలో ఓటు శాతం పెంచుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. వచ్చే వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై చర్చ జరిపామని, తమ పార్టీలోకి తిరిగి వచ్చే వారికి ఆహ్వానమని అన్నారు. జనవరిలో రాష్ట్రంలో మూడు సభలు ఏర్పాటు చేస్తామని, అందులో పాల్గొనేలా మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని ఆహ్వానించామని తెలిపారు. హిందుపురంలో ఖర్గే, విశాఖలో రాహుల్ గాంధీ, అమరావతిలో ప్రియాంక గాంధీ సభలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని అన్నారు.

ప్రజాపాలనకు నోడల్ అధికారులు

(మొదటిపేజి తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌కు కె.నిర్మల, వరంగల్‌కు వాకాటి కరుణ, ఖమ్మంకు రఘునందన్ రావు, మహబూబ్ నగర్‌కు టికె.శ్రీదేవి, కరీంనగర్‌కు శ్రీదేవసేనను నియమించారు. రంగారెడ్డికి ఇ.శ్రీధర్, మెదక్‌కు ఎస్.సంగీత, అదిలాబాద్‌కు ఎం. ప్రశాంతి, నల్గొండకు ఆర్‌వి. కర్ణన్, నిజామాబాద్‌కు క్రిష్టినాకు బాధ్యతలు అప్పగించారు. కాగా డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రజాపాలన కింద దరఖాస్తులు స్వీకరించనున్నారని తెలిసిందే.

ఇక రైల్వే స్టేషన్లలో మోడీ సెల్ఫీ బూత్‌లు !

ఏర్పాటుకు ఢిల్లీ రైల్వే బోర్డు తాఖీదులు

ఇది ప్రజా ధనాన్ని వృథా చేయడమే : కాంగ్రెస్



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముచ్చటగా మూడోసారి గద్దె ఎక్కాలని ప్రధాని నరేంద్ర మోడీ ఉవ్విళ్లూరుతున్నారు. ఇందులో తప్పేమీ లేదు కానీ అందుకోసం చేస్తున్న ప్రయత్నాలే విమర్శలు, వివాదాలకు దారితీస్తున్నాయి. ఇప్పటికే దేశంలోని అనేక ప్రాంతాలలో వివిధ మంత్రిత్వ శాఖలు మోడీ కటౌట్లతో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తాజాగా దేశంలోని పలు రైల్వే స్టేషన్లలో కూడా 3డీ సెల్ఫీ బూత్‌లు ఏర్పాటు చేయబోతున్నారు. తద్వారా ప్రయాణికులు మోడీ కటౌట్‌తో సెల్ఫీ దిగి సామాజిక మాధ్యమాలలో షేర్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు.
అయితే దీనిపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఈ సెల్ఫీ పాయింట్ల కారణంగా ప్రజాధనం పెద్ద ఎత్తున వృథా అవుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. 'ప్రచారం కోసం మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు హద్దులు లేకుండా పోతోంది. ఇది పన్ను చెల్లింపుదారుల సొమ్మును వృథా చేయడం తప్పించి మరొకటి కాదు' అని ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. తాత్కాలికంగా, శాశ్వతంగా సెల్ఫీ బూత్‌లు ఏర్పాటు చేసే స్టేషన్ల జాబితాను ఖర్గే ఆర్‌టీఐ ద్వారా సెంట్రల్ రైల్వే నుండి సంపాదించారు. దాని ప్రతిని కూడా ఆయన 'ఎక్స్'లో జత చేశారు. దీని ప్రకారం కేటగిరీ 'ఏ' స్టేషన్లలో తాత్కాలికంగా సెల్ఫీ బూత్‌లను ఏర్పాటు చేసేందుకు రూ.1.25 లక్షల చొప్పున ఖర్చు చేస్తారు. కేటగిరీ 'సీ' స్టేషన్లలో శాశ్వత ప్రాతిపదికన సెల్ఫీ బూత్‌ల ఏర్పాటుకు రూ.6.25 లక్షల చొప్పున ఖర్చవుతుంది.
స్టేషన్లలో సెల్ఫీ బూత్‌లు ఏర్పాటు చేయాల్సిందిగా 19 జోన్లకు చెందిన జనరల్ మేనేజర్లకు ఢిల్లీలోని రైల్వే బోర్డు తాఖీదులు పంపిందని వార్తలు వచ్చాయి. మన్నికైన 3డీ ఆకృతులు, యాక్రిలిక్ బోర్డులు, గ్లాసు, ఇంటిగ్రేటెడ్ లైటింగ్‌తో వీటిని రూపొందిస్తారు. 3డీ ఆకృతులను ఫైబర్, బంకమట్టి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో నిర్మిస్తారు. స్కిల్ ఇండియా, ఉజ్వల యోజన, చంద్రయాన్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు ఈ బూత్‌లలో ప్రాచుర్యం కల్పిస్తారు. మంత్రిత్వ శాఖ సాధించిన విజయాలను వివరిస్తూ 822 సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని అక్టోబరులో రక్షణ శాఖ మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సెల్ఫీ పాయింట్లలో విధిగా మోడీ ఫొటోలు ప్రదర్శించాలని నిర్దేశించింది. స్మారక ప్రదేశాలు, మ్యూజియంలు, ప్రజా రవాణా కేంద్రాలు, విమానాశ్రయాలు, మార్కెట్లు, పాఠశాలలు, కళాశాలలు, పర్యాటక ప్రదేశాలలో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచించింది.



దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డీన్ ఎల్గర్ సెంచరీకి తోడు బెడింగ్హామ్(56) అర్థసెంచరీతో రాణించడంతో దక్షిణాఫ్రికా జట్టు తొలి టెస్ట్‌లో ఆధిక్యత సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోర్ 8వికెట్ల నష్టానికి 208పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారతజట్టు 245పరుగులకు ఆలౌటైంది.

సిరాజ్, బుమ్రా కట్టడి చేస్తేనే..

దక్షిణాఫ్రికాకు ఆధిక్యత | ఎల్గర్ అజేయ సెంచరీ | దక్షిణాఫ్రికా 256/5

సెంచూరియన్: దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డీన్ ఎల్గర్ సెంచరీకి తోడు బెడింగ్హామ్(56) అర్థసెంచరీతో రాణించడంతో దక్షిణాఫ్రికా జట్టు తొలి టెస్ట్‌లో ఆధిక్యత సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోర్ 8వికెట్ల నష్టానికి 208పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారతజట్టు 245పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ కేఎల్ రాహుల్(101) సెంచరీతో కదం తొక్కాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా జట్టును డీన్ ఎల్గర్ సెంచరీ(135, 23ఫోర్లు)తో ఆదుకున్నాడు. భారత బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్న ఎల్గర్.. శతకంతో చెలరేగడంతో దక్షిణాఫ్రికా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌పై ఆధిక్యతను సంపాదించింది. బెడింగ్హామ్(56) అర్థసెంచరీతో రాణించాడు. ఠాకూర్ వేసిన 22వ ఓవర్లో బౌండరీ కొట్టి 79బంతుల్లో అర్థ సెంచరీ చేసిన ఎల్గర్.. అతడే వేసిన 43వ ఓవర్లో తొలి బంతికి మిడ్ వికెట్ దిశగా ఆడి సెంచరీని పూర్తిచేసుకున్నాడు.

టెస్టులలో అతడికి ఇది 14వ సెంచరీ. ఇక దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో ఆరంభంలోనే ఎయిడెన్ మార్‌క్రమ్(5) ఔటయ్యాడు. రెండో వికెట్‌కు ఎల్గర్.. టోనీ డి జోర్జి(28) 93పరుగులు జోడించారు. ఈ జోడీని బుమ్రా విడదీశాడు. వరుస ఓవర్లలో బుమ్రా.. జోర్జి, కీగన్ పీటర్సన్(2)ను ఔట్ చేశాడు. బుమ్రా, సిరాజ్ కాస్త పర్వాలేదనిపించినా శార్దూల్ ఠాకూర్, ప్రసిధ్ కృష్ణలు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. రెండోరోజైన బుధవారం ఆట నిలిచే సమయానికి దక్షిణాఫ్రికా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 5వికెట్ల నష్టానికి 256పరుగులు చేసింది. దీంతో సఫారీ జట్టుకు భారత్‌పై కేవలం 11 పరుగుల ఆధిక్యత లభించింది. క్రీజ్‌లో ఎల్గర్(140), జెన్సన్(3) ఉన్నారు. బుమ్రా, సిరాజ్‌కు రెండేసి, ప్రసిధ్ కృష్ణకు ఒక వికెట్ దక్కాయి.

కెఎల్ రాహుల్ సెంచరీ..

టీమిండియా వికెట్ కీపర్ కెఎల్ రాహుల్ సెంచరీతో కదం తొక్కి ఓ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. దక్షిణాఫ్రికాపై వికెట్ కీపర్‌గా సెంచరీ కొట్టి రెండో బ్యాటర్‌గా కెఎల్ రాహుల్ నిలిచాడు. అంతకుముందు రిషబ్ పంత్ సఫారీ జట్టుపై వికెట్ కీపర్ హోదాలో తొలిసారి సెంచరీని కొట్టాడు. గత ఏడాది భారతజట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు రాగా కేప్‌టౌన్‌లో రిషబ్ పంత్ తొలిసారి సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అలాగే సెంచూరియన్‌లో వరుసగా రెండు సెంచరీలు కొట్టిన తొలి బ్యాటర్ కూడా కెఎల్ రాహుల్ మాత్రమే.

వర్షం అడ్డంకి

రెండోరోజు ఆట ప్రారంభానికి కూడా వరుణుడు అడ్డు తగిలాడు. వర్షం కారణంగా మైదానం చిత్తడిగా మారడంతో ఆట ఆలస్యమైంది. తొలిరోజు కూడా వెలుతురు లేమి కారణంగా 59 ఓవర్లే మ్యాచ్ జరిగింది. చివరి సెషన్‌లో వర్షం పడడంతో నిర్ణీత సమయం కంటే ముందే ఆట ముగిసిన విషయం తెలిసిందే.

స్కోర్‌బోర్డు..

భారత్ తొలి ఇన్నింగ్స్ : 245

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి)రాహుల్ (బి)సిరాజ్ 5, ఎల్గర్ (బ్యాటింగ్) 140, జోర్జి (సి)జైస్వాల్ (బి)బుమ్రా 28, పీటర్సన్ (బి)బుమ్రా 2, బెడింగ్హామ్ (బి)సిరాజ్ 56, వెర్రెయనె (సి)రాహుల్ (బి)ప్రసిధ్ 4, జెన్సన్ (బ్యాటింగ్) 3, అదనం 18, (66ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 256పరుగులు.

వికెట్ల పతనం: 1/11, 2/104, 3/113, 4/244, 5/249

బౌలింగ్: బుమ్రా 16-3-48-2, సిరాజ్ 15-0-63-2, శార్దూల్ ఠాకూర్ 12-2-57-0, ప్రసిధ్ కృష్ణ 15-2-61-1, అశ్విన్ 8-3-19-0.



ముగ్గురు సభ్యులతో అడ్‌హక్ కమిటీ

చైర్మన్‌గా భూపీందర్ సింగ్ బజ్వా

తాత్కాలిక రెజ్లింగ్ కమిటీ నియమించిన భారత ఒలింపిక్ సమాఖ్య

న్యూఢిల్లీ : తాత్కాలిక రెజ్లింగ్ బాడీ (అడహక్ కమిటీ)ని భారత ఒలింపిక్ సమాఖ్య (ఐఓసీ) బుధవారం ప్రకటించింది. రెజ్లర్ల ఆందోళనలకు తలొగ్గిన కేంద్రప్రభుత్వం డబ్ల్యూఎఫ్ఐ నూతన ప్యానెల్‌ను రద్దు చేసిన సంగతి తెలిసిందే. అలాగే డబ్ల్యూఎఫ్ఐ నిర్వహణ వ్యవహారాల కోసం ఒక కమిటీని నియమించాలని కూడా ఐఓసీని కోరింది. దీంతో భూపీందర్ సింగ్ బజ్వా నేతృత్వంలో తాత్కాలిక కమిటీ (అడహక్ కమిటీ)ని ఐఓసీ నియమించింది.ఎంఎం. సౌమ్య, మంజూష కన్వర్‌లు ఈ అడహక్ కమిటీలో సభ్యులుగా కొనసాగుతారని ప్రకటించింది. డబ్ల్యూఎఫ్ఐలో న్యాయమైన, జవాబుదారీతనం, పారదర్శకత్వాన్ని నిర్ధారించడానికి ఈ అడహక్ కమిటీని నియమించినట్టు ఐఓఏ తెలిపింది. రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌గా ఎన్నికైన సంగతి తెలిసిందే. దీంతో ఈ ఎన్నికలపై రెజ్లర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రెజ్లింగ్‌కు సాక్షి మాలిక్ రిటైర్మెంట్ ప్రకటించగా, మరో రెజ్లర్ బజరంగ్‌పూనియా పద్మశ్రీని వెనక్కి ఇచ్చేశారు. బ్రిజ్ భూషణ్ సింగ్ నివాసం నుండే డబ్ల్యుఎఫ్ఐ కార్యాలయం పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఖేల్‌రత్న, అర్జున అవార్డులను వెనక్కి ఇచ్చేస్తున్నట్టు వినేష్ ఫోగట్ ప్రకటించారు.

బంగ్లా సంచలనం

తొలి టి20లో న్యూజిలాండ్‌పై గెలుపు



నైపియర్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టి20 బంగ్లాదేశ్ జట్టు సంచలన విజయం నమోదు చేసింది. న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన బంగ్లా జట్టు బుధవారం జరిగిన తొలి టి20లో ఐదు వికెట్ల తేడాతో చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ను బంగ్లాదేశ్ బౌలర్లు కట్టడి చేశారు. దీంతో ఆ జట్టు నిర్ణీ 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 134పరుగులు చేసింది. నీషమ్(48)టాప్ స్కోరర్. బంగ్లాదేశ్ బౌలర్లు ఇస్లామ్‌కు మూడు, మెహిదీ హసన్, ముస్తాఫిజుర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం బంగ్లాదేశ్ ఓపెనర్ లింటన్ దాస్(42నాటౌట్), సౌమ్య సర్కార్(22) బ్యాటింగ్‌లో రాణించడంతో 18.4ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 137పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. న్యూజిలాండ్ బౌలర్లు ఇష్ సోథీ, మిల్నే, నీషమ్, బెన్, కెప్టెన్ సాంట్నర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మెహిదీ హసన్‌కు లభించగా.. రెండో టి20 మౌంట్‌ముఘనైయి వేదికగా శుక్రవారం జరగనుంది.


ఆస్ట్రేలియా 318ఆలౌట్

పాకిస్తాన్‌తో బాక్సింగ్ డే టెస్ట్



మెల్‌బోర్న్: బాక్సింగ్ డే (రెండో)టెస్ట్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్స్ నిరాశపరిచారు. దీంతో ఆస్ట్రేలియా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 318పరుగులకు ఆలౌటైంది. తొలిరోజైన మంగళవారం ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 187పరుగులు చేసి పటిష్టంగా ఉన్న ఆసీస్‌ను పాకిస్తాన్ బౌలర్లు కట్టడి చేశారు. అమీర్ జమాల్(3/64)కి తోడు షాహిన్ షా, హంజా, హసన్ అలీ రెండేసి వికెట్లు పడగొట్టారు. దీంతో ఆసీస్ భారీ స్కోర్ చేయడంలో విఫలమైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన పాకిస్తాన్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 6వికెట్ల నష్టానికి 194పరుగులు చేసింది. ఓపెనర్ అబ్దుల్లా(62), కెప్టెన్ మసూద్(54) అర్థసెంచరీలతో మెరిసారు. బుధవారం ఆట నిలిచే సమయానికి వికెట్ కీపర్ రిజ్వాన్(29), అమీర్ జమాల్(2) క్రీజ్‌లో ఉన్నారు. ఆసీస్ కెప్టెన్ కమిన్స్‌కు మూడు, లియాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. తొలిటెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టు 360పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై గెలిచి 1-0 ఆధిక్యతలో ఉంది.

నవచిత్రం


రవితేజ, కావ్య థాపర్

పక్కా మాస్ ఈగల్

రవితేజ, కార్తీక్ ఘట్టమనేని కాంబినేషన్‌లో ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'.
పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం నుంచి రెండవ సింగిల్ 'గల్లంతే..' లిరికల్ వీడియోను మేకర్స్ లాంచ్ చేశారు. సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్ కాలేజీలో గ్రాండ్‌గా జరిగిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ, 'ఈగల్ డిఫరెంట్ మ్యాసీ ఫిలిం. ఎంటర్‌టైమెంట్ అద్భుతంగా ఉంటుంది. మీ అందరికీ తెగ నచ్చుతుంది. నాకు విపరీతంగా నచ్చింది. జనవరి 13న అందరూ థియేటర్స్‌కి వచ్చేయండి' అని అన్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 13న అన్ని దక్షిణ భారతీయ భాషలతోపాటు హిందీలోనూ గ్రాండ్‌గా ఈ సినిమా విడుదల కానుంది.

ఫ్రెష్ మ్యూజిక్‌తో బబుల్‌గమ్


శ్రీ చరణ్ పాకాల

రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. మానస చౌదరి కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈనెల 29న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల మీడియాతో ముచ్చటించారు.
'ఇప్పటివరకు నేను ఎక్కువగా థ్రిల్లర్స్ చేశాను. 'బబుల్‌గమ్' లాంటి న్యూ ఏజ్ లవ్ స్టోరీ చేయడాన్ని బాగా ఎంజాయ్ చేశాను. ఇందులో హీరో డీజే కాబట్టి దీని కోసం ఎలక్ట్రానిక్ మ్యూజిక్ మ్యూజిక్ ఇచ్చే ఛాన్స్ వచ్చింది. ట్యూన్ కంటే లిరిక్స్ ముఖ్యమని నమ్ముతాను. రవికాంత్ సింగర్ కూడా. ఇందులో ఈజీ పీజీ పాటని తనే రాశాడు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇందులో ఫ్రెష్ మ్యూజిక్ వింటారు. దర్శకుడు రవికాంత్ నా స్నేహితుడు. తన షార్ట్ ఫిలిమ్స్‌కి, 'క్షణం', 'కృష్ణ అండ్ లీలా' ఇప్పుడు ఈ సినిమాకి మ్యూజిక్ అందించాను. రోషన్ కనకాల డెడికేటెడ్, హంబుల్. మంచి నటుడు, డ్యాన్సర్ కూడా. సినిమా చూశాను. చాలా బాగా నచ్చింది. ఇప్పటివరకూ చూసిన మిగతా వారు కూడా చాలా ఇష్టపడ్డారు. మ్యూజిక్ పరంగా ఇంటర్వెల్ బ్యాంగ్, క్లైమాక్స్, పాటలని చాలా బాగా ఎంజాయ్ చేశారు. సంగీతం విషయంలో నిర్మాతలు చాలా సపోర్ట్ చేశారు. ప్రస్తుతం 'సత్యభామ, 'గూఢచారి 2' చిత్రాలకు సంగీతం అందిస్తున్నాను'.



మహేష్ బాబు

పండగలాంటి సినిమా

సంక్రాంతి పండగకి ఎన్ని ప్రత్యేకతలు ఉన్నాయో తమ 'గుంటూరు కారం' చిత్రానికి కూడా అన్ని ప్రత్యేకతలు ఉన్నాయని అంటోంది చిత్ర బృందం. మహేష్‌బాబు, త్రివిక్రమ్ కాంబోలో రూపొందుతున్న ఈ సినిమా తుది దశ చిత్రీకరణలో ఉంది. ప్రస్తుతం ఈ సినిమా కోసం ఓ మాస్ సాంగ్‌ని షూట్ చేస్తున్నారు. హారిక అండ్ హాసిని పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలు. మహేష్‌బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టే సినిమా ఉంటుందని, జనవరి 12న థియేటర్లలో హిట్ సందడి చూస్తారని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో

నయా షెడ్యూల్ షురూ..


నాని

హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ రెండోసారి కలిసి పని చేస్తున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రం 'సరిపోదా శనివారం'.
డివివి ఎంటర్‌టైన్ మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి భారీ కాన్వాస్‌తో నిర్మిస్తున్నారు. గత నెలలో ఈ సినిమా ఒక షెడ్యూల్ పూర్తి చేసుకుంది. లేటెస్ట్‌గా బుధవారం కొత్త షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ లెన్తీ షెడ్యూల్‌లో ఇంటెన్స్ యాక్షన్ బ్లాక్‌లతో పాటు ప్రధాన తారాగణంపై కొంత టాకీ పార్ట్‌ని చిత్రీకరించనున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తుండగా, ఎస్ జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ పాన్ ఇండియా చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

రాఘవరెడ్డి రిలీజ్‌కి రెడీ


శివ కంఠమనేని, రాశి

శివ కంఠమనేని హీరోగా రాశి, నందితా శ్వేత ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'రాఘవ రెడ్డి'. స్పేస్ విజన్ నరసింహా రెడ్డి సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యూజిక్ బ్యానర్‌పై సంజీవ్ మేగోటి దర్శకత్వంలో కె.ఎస్. శంకర్ రావ్, జి.రాంబాబు యాదవ్, ఆర్.వెంకటేశ్వర్ రావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీ జనవరి 5న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, 'ఇందులో అన్ని రకాల అంశాలు, ఎమోషన్స్ కనిపిస్తున్నాయి. చిన్న చిత్రాల వల్లే ఇండస్ట్రీ బతుకుతోంది' అని తెలిపారు. 'ఇది నాకు నాలుగో చిత్రం. కామెడీ ట్రాక్ కూడా బాగా వచ్చింది. ఇంటర్వెల్ సీన్ అందరికీ నచ్చుతుంది. క్లైమాక్స్ సీన్ ఎమోషనల్‌గా టచ్ అవుతుంది. అందరూ కంటతడి పెడతారు. ఈ సినిమాకి మంచి ప్రశంసలతో పాటు లాభాలు కూడా వస్తాయి' అని శివ కంఠమనేని చెప్పారు. రాశి మాట్లాడుతూ, 'ఇందులో తల్లిగా పోషించిన నా పాత్ర నాకు చాలా కొత్తగా అనిపించింది' అని తెలిపారు. "రాఘవ రెడ్డి' టైటిల్‌తో యాక్షన్, ఫ్యాక్షన్ అసలు ఏ జోనర్ అన్న అనుమానం అందరిలోనూ ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమాను తీశాం' అని దర్శకుడు సంజీవ్ మేగోటి అన్నారు. నిర్మాత శంకర్ రావు, కో ప్రొడ్యూసర్ శ్రీధర్ రెడ్డి, స్పేస్ విజన్ నరసింహా రెడ్డి తదితరులు చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.


ఇంద్రసేన, ప్రజ్ఞ నయన్

కమర్షియల్ కామెడీ ఎంటర్‌టైనర్

రవి చావలి దర్శకత్వంలో ఎస్.రమేష్ కుమార్ నిర్మించిన చిత్రం 'బద్మాష్ గాళ్ళకి బంపర్ ఆఫర్'. 'శాసనసభ' చిత్రంతో హీరోగా మంచి గుర్తింపు పొందిన ఇంద్రసేన, 'మ్యాడ్' చిత్రంలో నటించిన సంతోష్ హీరోలుగా ప్రజ్ఞ నయన్, నవీన రెడ్డి హీరోయిన్లుగా నటించారు.
డబ్బు కోసం రియల్ ఎస్టేట్ దందా చేసే ఒక వ్యక్తి దగ్గర పని చేసే ఇద్దరు కుర్రాళ్ళు అతన్నే ఎందుకు కిడ్నాప్ చేశారు. ఆ కిడ్నాప్‌లో వారికి తెలిసిన రహస్యాలు ఏమిటి? చివరకు వాళ్ళు అనుకున్న డబ్బు సంపాదించారా లేదా అనే పాయింట్‌ని పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. మలయాళ నటి మెర్లిన్ ఫిలిప్, తమిళ నటుడు తారక్, శుభలేఖ సుధాకర్ తదితరులు ప్రత్యేక పాత్రల్లో నటించిన ఈ చిత్రం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగుళూర్, టెక్సాస్, అండమాన్‌లో ఈ నెల 29న రిలీజ్ అవుతుంది అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం : భోలే షవాలి, కెమెరా: విజయ్ సి కుమార్, ఎడిటర్ : మార్తాండ్ కె వెంకటేష్, మాటలు : ఘటికా చలం, ఫైట్స్ : కృష్ణంరాజు, డాన్స్ : హుస్సేన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : శేఖర్ అలవకపాటి, లైన్ ప్రొడ్యూసర్ : తోట శ్రీకాంత్.

నా కథలో నువ్వున్నావా..?


సత్యం రాజేష్, మేఘా చౌదరి

సత్యం రాజేష్ హీరోగా నటిస్తున్న నూతన చిత్రం 'టెనెంట్'. మేఘా చౌదరి కథానాయిక. వై.యుగంధర్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ పతాకంపై మోగుళ్ళ చంద్రశేఖర్ రెడ్డి నిర్మించారు. తాజాగా ఈచిత్రం నుంచి సాహిత్య సాగర్ లిరిక్స్‌తో పాటు ట్యూన్ అందించిన మెలోడి సాంగ్ 'నా కథలో నువ్వున్నావా?నీ కథనే నేను అయ్యానా?' అనే లిరికల్ వీడియో పాట విడుదలైంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'భార్యాభర్తల అనురాగాన్ని, అప్యాయతను తెలియజేసే పాట ఇది. ఈ బ్యూటీఫుల్ మెలోడి సాంగ్ అందరికి నచ్చుతుంది. జీవితం ఆడే వైకుంఠపాళిలో ఎంచుకున్న పాచికల్లాంటి ఆరు ముఖ్యపాత్రలకి మధ్య జరిగే కథే ఈ చిత్రం. ప్రస్తుత అర్బన్‌లైఫ్ స్టయిల్‌ని ప్రతిబింబిస్తూ మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాలో చెబుతూ, వాళ్లని అలర్ట్ చేసే విధంగా ఈ సినిమా ఉంటుంది' అని తెలిపారు.


శశి, రోహిత్

డబుల్ ఇంజన్

రోహిత్ - శశి రచన, దర్శకత్వంలో రూపొందిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ 'డబుల్ ఇంజన్'.
'పరేషాన్' లాంటి న్యూ ఏజ్ చిత్రాన్ని అందించిన వాల్టెయిర్ ప్రొడక్షన్స్‌లో సిద్ధార్థ్ రాళ్లపల్లి ఈ చిత్రాన్ని నిర్మించారు. లేటెస్ట్‌గా ఈ చిత్ర ట్రైలర్ విడుదలైంది. డానీ, మౌళి, నర్సింగ్, గోపి.. ఈ నలుగురు స్నేహితులు డబ్బు సంపాదించడానికి 'డబుల్ ఇంజన్' కోసం చేసిన ప్రయత్నాలను చాలా థ్రిల్లింగ్ అడ్వంచరస్ జర్నీగా ప్రజంట్ చేసిందీ ట్రైలర్. ముని, రోహిత్, రాజు, అజిత్, గాయత్రి గుప్తా, సాయి కిరణ్ యాదవ్, పవన్ కృష్ణ తమ సహజమైన నటనతో ఆకట్టుకున్నారు. కథ, కథనానికి తగట్టుగా ఎక్స్‌ట్రార్డినరీ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. టెక్నికల్‌గా ట్రైలర్ బ్రిలియంట్‌గా ఉంది. ట్రైలర్‌ని గ్రిప్పింగ్‌గా ప్రజెంట్ చేశారు. విజువల్స్‌లో రా నెస్ అద్భుతంగా చూపించారు. వివేక్ సాగర్ తన బీజీఎంతో కంటెంట్‌ని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్ళారు. అమెజింగ్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ నెరేటీవ్‌ని మరింత లైవ్లీగా చూపించింది. శశాంక్ సినిమాటోగ్రఫీ టాప్ క్లాస్‌లో ఉంది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి. ఈ ట్రైలర్ సినిమాపై చాలా క్యూరియాసిటీని పెంచింది అని చిత్ర యూనిట్ తెలిపింది. జనవరి 5న ఈ సినిమా విడుదల కానుంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.